
శ్రుతి (ఫైల్)

వినయ్‌కుమార్ (ఫైల్)

ప్రేమ జంట ఆత్మహత్య

వివాహానికి పెద్దలు నిరాకరించటంతో మనస్తాపం
భువనగిరిలో రైలు కిందపడి బలవన్మరణం 3
మృతులు జనగామ జిల్లా వాసులుగా గుర్తింపు

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

జనగణనకు నోటిఫికేషన్

విడుదల చేసిన కేంద్ర హోం శాఖ
మంచు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో 2026 అక్టోబరు 1 నాటికి పూర్తి 10
మిగతా ప్రాంతాల్లో 2027 మార్చి 1కి
34 లక్షల మంది ఎన్యూమరేటర్లు, 1.3 లక్షల మంది సిబ్బందితో నిర్వహణ
రూ.13 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా

మంగళవారం | 17-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 79 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం; తిథి: షష్ఠి మ.2.47 తదుపరి సప్తమి; నక్షత్రం: శతభిషం రా.1.02 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: ఉ.8.22-9.57; దుర్ముహూర్తం: ఉ.8.21-9.13, రా.10.22-11.04; అమృతఘడియలు: సా.5.53-7.28; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.47 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మంత్రివర్గ ఆమోదం లేకుండా

చెల్లింపులేంటి?


విచారణ అనంతరం ఏసీబీ ఆఫీసు నుంచి బయటకు వస్తున్న కేటీఆర్

- ఎన్నికల కోడ్ ఉండగా అధికారులకు మౌఖిక ఆదేశాలు ఎందుకు ఇచ్చారు?
- ఏస్‌నెక్స్ట్‌జెన్ మీ పార్టీకి రూ.49 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో ఎందుకిచ్చింది?
- విదేశీ సంస్థకు నిధుల చెల్లింపుల్లో ఆర్‌బీఐ నిబంధనల ఉల్లంఘన ఎందుకు జరిగింది?
- ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ ప్రశ్నలు
- 2వ సారి ఏసీబీ విచారణకు హాజరైన కేటీఆర్
- 7 గంటలకుపైగా విచారణ.. 60 దాకా ప్రశ్నలు
- వారికి ఎదురు ప్రశ్నలు వేసిన మాజీ మంత్రి!
- రేపటిలోగా ఫోన్లు అప్పగించాలన్న ఏసీబీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): "ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహణకు మంత్రివర్గ ఆమోదం లేకుండా నిధుల చెల్లింపులు ఎందుకు చేశారు? రేసు నిర్వహణ నుంచి మధ్యలో తప్పుకొన్న ఏస్ నెక్స్ట్ జెన్ మీ పార్టీకి ఎన్నికల బాండ్ల రూపంలో రూ.49 కోట్లు ఎందుకు చెల్లించింది? ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో మీరు అధికారులకు నేరుగా (మౌఖిక) ఆదేశాలు ఎలా ఇచ్చారు? విదేశీ సంస్థకు నిధుల చెల్లింపుల్లో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాలను ఎందుకు ఉల్లంఘించారు?" ..అంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. సుమారు


మిగతా 12వ పేజీలో...

'జై తెలంగాణ' అననోణ్ని ఏమనాలె?

- హౌలా అన్నందుకు నాపై మండిపడుతున్నరు 12
- రేవంత్‌లాగా లుచ్చాపని మా పార్టీలో ఎవరూ చేయలే
- నాపై పెట్టింది లొట్టపీసు కేసు.. ఆయనో లొట్టపీసు సీఎం
- నన్ను జైల్లో పెడితే పెట్టుకోండి.. విశ్రాంతి తీసుకుంటా: కేటీఆర్

హరీశ్‌రావుకు స్వల్ప అస్వస్థత
కిమ్స్‌లో చేరిక
కేటీఆర్ పరామర్శ

అర్వింద్ కుమార్ అదృశ్యం!.. భువనగిరి ఎంపీ చామల సందేహం 12



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతునేస్తం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు

9 రోజుల్లో 9 వేల కోట్లు!

70 లక్షల మంది ఖాతాల్లో రైతు భరోసా సొమ్ములు

- ఏడాదిన్నరలో రైతుల కోసం లక్ష కోట్లు వెచ్చించాం
- సన్నవడ్ల సాగుతోనే పేదలకు సన్నబియ్యం
- అన్నదాతలు అంబానీ, అదానీలతో పోటీపడాలి
- రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తాం
- బీఆర్ఎస్ పదేళ్లలో వందేళ్ల ఆర్థిక విధ్వంసం
- కొత్తగా వచ్చినోడికి కొంత టైం ఇద్దామని లేదు
- ఏం జరిగినా ప్రతిపక్షానికి పైశాచిక ఆనందమే
- వాళ్లు రోడ్లపై దొర్లినా పదేళ్లు మేమే ఉంటాం
- రైతువేదికల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- వానాకాలం 'రైతుభరోసా'ను ప్రారంభించిన సీఎం

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతులకు ఏకకాలంలో రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. వానాకాలం సీజన్‌లో పంటలకు పెట్టుబడి ఖర్చుల కోసం అన్నదాతలు ఎవరి దగ్గరా చేయిచాచి, అప్పు అడగకుండా చూడాలన్నదే తమ ఉద్దేశమని తెలిపారు. అందుకే రైతు భరోసాను ఏకకాలంలో అమలు చేయాలని నిర్ణయించామన్నారు. సోమవారం నుంచి రాబోయే 9 రోజుల్లో రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాలకు బదిలీ చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 70,11,184 మంది రైతులకు ఎకరానికి రూ.6 వేల చొప్పున 1.49 కోట్ల ఎకరాలకు రైతు భరోసా చెల్లిస్తామని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన రైతువేదికల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 566 రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఉంది. మరో 1,034 రైతువేదికల్లో వీసీ సౌకర్యం కల్పించే కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,600 రైతువేదికల్లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం చేశారు. ఇదే వేదిక నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వానాకాలం రైతుభరోసా నగదు బదిలీ కార్యక్రమాన్ని మీట నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన పెట్టుబడి సాయం, కనీస మద్దతు ధర, బోనస్, రైతుబీమా అన్నీ కలిపి ఇప్పటి వరకు 18 నెలల్లోనే ఈ ప్రభుత్వం రైతుల కోసం రూ.1,01,728 కోట్లు

మిగతా 13వ పేజీలో...

అన్ని వైద్య కళాశాలల్లో పూర్తి వసతులు

- క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారులతో కమిటీ
- నర్సింగ్ కళాశాలల్లో ఆప్షనల్‌గా జపాన్ భాష
- ప్రతి నెలా విద్య, వైద్యారోగ్య శాఖలపై సమీక్ష
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం 13

టార్గెట్ టెహ్రాన్!

- టెహ్రాన్ లక్ష్యంగా దాడులకు సిద్ధమవుతున్న ఇజ్రాయెల్
- ప్రజలు వెళ్లిపోవాలంటూ హెచ్చరికలు
- ప్రాణరక్షణ కోసం పొరుగు దేశాలకు పారిపోతున్న ఇరాన్ ప్రజలు

ఇజ్రాయెల్‌పై దాడులను పెంచిన ఇరాన్

- టెల్‌అవీవ్ శివార్లలో భారీ విధ్వంసం
- తాజాగా 11 మంది మృతి
- హైఫాలోని చమురు ప్లాంట్‌పై దాడి
- చెలరేగుతున్న మంటలు.. ప్లాంట్ సేఫ్
- ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర: నెతన్యాహు
- అణు ఒప్పందం నుంచి తప్పుకొంటాం
- మాపై అణుబాంబు వేస్తే.. పాకిస్థాన్ గట్టిగా స్పందిస్తుంది: ఇరాన్
- మధ్యవర్తిత్వానికి మేం సిద్ధం: రష్యా


ఇరాన్ క్షిపణుల ధాటికి ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌లో జరిగిన భారీ పేలుడు

టెల్‌అవీవ్/టెహ్రాన్/న్యూఢిల్లీ, జూన్ 16: ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను ఇజ్రాయెల్ టార్గెట్‌గా చేసుకుంటోంది. "మీరంతా వీలైనంత త్వరగా టెహ్రాన్‌ను వదిలి వెళ్లండి. సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లండి" అంటూ ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) అధికారులు అరబిక్, పర్షియా భాషల్లో టెహ్రాన్ పౌరులకు సందేశాలు పంపుతున్నారు. దాంతో.. వేల మంది ఇరానీలు టెహ్రాన్ నగరాన్ని వీడుతున్నారు. సోమవారం ఉదయం నుంచే ఇరాన్‌లోని ఇతర ప్రావిన్సులతోపాటు.. పాకిస్థాన్, అజర్‌బైజాన్, తుర్కియే, తుర్క్‌మెనిస్థాన్ దేశాలకు తరలివెళ్తున్నారు. దీంతో.. టెహ్రాన్ వీధులన్నీ కార్లతో నిండిపోయాయి. పాకిస్థాన్ సరిహద్దుల్లో ఇరానీలు గేట్లను

మిగతా 2వ పేజీలో...



పొంగులేటిపై..

టీపీసీసీ చీఫ్ ఫైర్

- స్థానిక ఎన్నికలపై వ్యాఖ్యల్ని తప్పుపట్టిన మహేశ్‌గౌడ్.. మీపరిధిలో లేని శాఖపై ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్న
- బీసీ రిజర్వేషన్లతో ముడిపడిన, కోర్టుల పరిధిలో ఉన్న అంశాలపై కొంచెం జాగ్రత్తగా మాట్లాడాలని హితబోధ
- పార్టీ లైన్ దాటి మాట్లాడొద్దని ఫోన్‌లో సూచనలు

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వస్తుందంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీ శాఖ పరిధిలో లేని అంశాలపై ఎందుకు మాట్లాడారు? విధానపరమైన అంశాలపై మంత్రి మండలిలో చర్చించకుండా మాట్లాడతారా? పార్టీలో నిర్ణయం తీసుకోకుండానే శ్రేణులను అయోమయానికి గురిచేసేలా ప్రకటనలు చేయడమేంటి?" అని ఫోన్‌లో ప్రశ్నించారు. సున్నితమైన బీసీ రిజర్వేషన్లతో ముడిపడి ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలపై వ్యాఖ్యానించడం తొందరపాటు చర్యేనని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ.. నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వస్తుందని, తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉంటాయని పేర్కొన్న విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ లైన్ దాటి మాట్లాడటం, సంబంధం లేని మంత్రిత్వ శాఖ తరఫున ప్రకటనలు చేయడాన్ని టీపీసీసీ తీవ్రంగా పరిగణించింది. ఈ విషయమై నేరుగా పొంగులేటికే ఫోన్ చేసిన టీపీసీసీ చీఫ్.. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన అంశాలపై మాట్లాడాల్సిన అవసరం ఏముంది? క్యాబినెట్‌లో చర్చించాల్సిన

మిగతా 13వ పేజీలో...

ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం ఇవ్వడానికి నేడు సిట్ ఎదుటకు మహేశ్‌గౌడ్ 3

ఇష్టమొచ్చినట్లు మాట్లాడొద్దు

- మనం మాట్లాడుకునేవి వేదికలపై చెబితే ఎలా?.. నిర్ణయాలకు ముందే ప్రకటనలా?
- సమష్టిగా నిర్ణయాలు తీసుకుందాం..
- కలిసి నడుద్దాం.. మంత్రులతో భేటీలో సీఎం
- 23న సమావేశం కానున్న క్యాబినెట్!
- స్థానిక ఎన్నికలతో పాటు పలు అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం 13

మెట్రో రైలు 'పార్ట్-బీ' పరుగులు!

- మూడు కారిడార్లకు రూ.19,579 కోట్లు
- పాలనాపరమైన అనుమతులిచ్చిన సర్కారు
- వేగంగా ఫ్యూచర్‌సిటీ, మేడ్చల్, శామీర్‌పేట్ మార్గాలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త వెంచర్‌గా ప్రాజెక్టు

పాతబస్తీ మెట్రో పనులకు రూ.125 కోట్లు విడుదల

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు రెండో దశలో పార్ట్-బీ కింద ప్రతిపాదించిన నార్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీ కారిడార్ల పనులు వేగిరం కానున్నాయి. మూడు మార్గాల్లో 86.1 కిలోమీటర్ల పనులకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపగా.. ఈ కారిడార్లకు కేటాయించిన రూ.19,579 కోట్లకు ప్రభుత్వం సోమవారం పరిపాలనా అనుమతులు ఇస్తూ జీవో 113 జారీ చేసింది. దీంతో పనులు మరింత వేగంగా జరగనున్నాయి. హైదరాబాద్‌లో మెట్రో

మిగతా 10వ పేజీలో...


రెరా అప్పీలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా
సంతోష్ రెడ్డి
ప్రభుత్వ ఉత్తర్వులు జారీ 13



రాజాసింగ్‌లా సీనియర్ నాయకుడిని కాదు!

- నేను సాధారణ కార్యకర్తనే.. సీనియర్లు మాట్లాడినప్పుడు మేం తప్పకుండా వింటాం
- వారి మాటలను మేం గౌరవిస్తాం
- రాజాసింగ్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు
- బనకచర్ల విషయంలో తెలంగాణ హక్కులు కాపాడేందుకు సీఎం చొరవ చూపాలని సూచన


హైదరాబాద్/అడ్డగుట్ట/హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తాను సాధారణ కార్యకర్తనని, ఎమ్మెల్యే రాజాసింగ్ సీనియర్ నాయకుడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సెటైర్ వేశారు. ఇటీవల రాజాసింగ్ బీజేపీలోని కొంత మంది సీనియర్ నాయకులపై తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. పార్టీ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో

మిగతా 14వ పేజీలో...

ఖాజాగూడలో ప్రభుత్వ భూమి కబ్జాపై.. నలుగురు

కాంగ్రెస్ ఎమ్మెల్యేల పిల్

- చెరువు ఎఫ్‌టీఎల్ 27.18 ఎకరాల్లో 47 అంతస్తుల చొప్పున 8 టవర్లు నిర్మిస్తున్నారన్న ఎమ్మెల్యేలు
- భూమి విలువ రూ.10 వేల కోట్లు ఉంటుంది
- హైడ్రాకు ఫిర్యాదు చేసినా లాభం లేదని తెలిపిన అనిరుధ్ రెడ్డి, యెన్నం, మురళీనాయక్, రాజేశ్ రెడ్డి
- అధికారులు కుమ్మక్కయ్యారని తీవ్ర ఆరోపణ
- హైడ్రాకు ఇచ్చిన ఫిర్యాదులో సర్వే నంబర్, లొకేషన్ ఎందుకు పేర్కొనలేదన్న హైకోర్టు
- పూర్తి వివరాలతో మళ్లీ ఫిర్యాదు చేయాలని, ఆ కాపీ సమర్పించాలని ఎమ్మెల్యేలకు సూచన
- విచారణ రెండు వారాల పాటు వాయిదా



హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ ప్రభుత్వం, అధికారులకు వ్యతిరేకంగా నలుగురు అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. ఖాజాగూడ చెరువు ఫుల్ ట్యాంక్ లెవెల్ పరిధిలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా భారీ టవర్లు నిర్మిస్తున్నారని పేర్కొంటూ ఎమ్మెల్యేలు జనంపల్లి అనిరుధ్ రెడ్డి (జడ్చర్ల), యెన్నం శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్ నగర్), మురళీనాయక్ భూక్యా (మహబూబాబాద్), కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి (నాగర్‌కర్నూల్) పిల్

మిగతా 14వ పేజీలో...

'ధరణి'పై ఫోరెన్సిక్ ఆడిట్ షురూ!

- కేరళ ప్రభుత్వ సంస్థ కేఎస్ఏపీసీకి బాధ్యతలు 3
- సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఆడిట్
- ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించింది. 25% రాయితీతో ఈనెల 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ముగ్గురేసి పిల్లలను కనండి

» మూడో బిడ్డ బాధ్యత వీహెచ్‌పీదే: ప్రవీణ్ తొగాడియా

బెంగళూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): శక్తిమంతమైన హిందూ దేశ నిర్మాణం కోసం హిందువుల జనాభా పెరగాలని, కనుక ప్రతి హిందూ జంట ముగ్గురేసి పిల్లలకు జన్మనివ్వాలని అంతర్జాతీయ విశ్వహిందూ పరిషత్ సంస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా పిలుపునిచ్చారు. మూడోబిడ్డ బాధ్యత చదువు, ఫీజులు తదితర బాధ్యతను విశ్వహిందూ పరిషత్ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. హుబ్బళ్లిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హిందువులకోసం దేశవ్యాప్తంగా హెల్ప్ లైన్ ప్రారంభించామని, అడ్వకేట్ హెల్ప్‌లైన్, 10వేల మంది డాక్టర్లతో హిందువుల రక్షణకు సలహాలు, సేవలు అందించే విభాగం పనిచేస్తున్నాయని తెలిపారు. ముష్టి(పిడికిలి) బియ్యం పథకాన్ని ప్రారంభించామని, దేశంలో ఏ హిందువూ ఆకలితో బాధపడకూడనేదే దీని లక్ష్యమని చెప్పారు. ప్రతి హిందువు రోజూ గుప్పెడు బియ్యం పక్కనతీసి వంట చేసుకోవాలని, ఆ బియ్యాన్ని నెలకోసారి హిందువులకు పంచాలని కోరారు. తద్వారా ఏ హిందువూ ఆకలితో అలమటించరని అన్నారు.

విమాన ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీ తొలి భేటీ

» సీవీఆర్‌ను స్వాధీనం చేసుకున్న ఏఏఐబీ అధికారులు

న్యూఢిల్లీ, జూన్ 16: అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై దర్యాప్తు చేసేందుకు ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ తొలిసారి సమావేశమైంది. విమాన ప్రమాదానికి దారి తీసిన కారణాలపై చర్చించింది. సోమవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన ఈ భేటీ జరిగింది. విమాన ప్రమాదానికి గల కారణాలపై అందరి అభిప్రాయాలు తీసుకొని.. భేటీలో చర్చించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు.. విమాన ప్రమాదంపై ప్రత్యేక దర్యాప్తు జరుపుతున్న ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) ప్రమాదం స్థలంలో కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్)ను గుర్తించి స్వాధీనం చేసుకుంది. ఇటు అమెరికాకు చెందిన స్వతంత్ర దర్యాప్తు సంస్థ జాతీయ రవాణా భద్రతా బోర్డు (ఎన్‌టీఎస్‌బీ) కూడా రంగంలోకి దిగింది. విమాన ప్రమాదానికి గల కారణాలను గుర్తించేందుకు అనేక మంది అంతర్జాతీయ నిపుణులను ప్రమాద స్థలానికి రప్పించింది.

15 సెకన్లలోనే యూపీఐలో నగదు బదిలీ

న్యూఢిల్లీ, జూన్ 16: ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ వినియోగదారులకు శుభవార్త. దేశవ్యాప్తంగా యూపీఐ లావాదేవీలు ఇక నుంచి 15సెకన్లలోనే పూర్తవుతాయి. యూపీఐ లావాదేవీలు ప్రాసెస్ కావడానికి పట్టే సమయం తగ్గేలా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) కొత్త మార్గదర్శకాలను ప్రవేశపెట్టింది. సోమవారం నుంచే ఇవి అమల్లోకి వచ్చాయి. ఇప్పటి వరకు యూపీఐ ద్వారా నగదు బదిలీ, స్వీకరణకు సాధారణంగా 30 సెకన్ల వరకు సమయం పట్టేది. గతంలో చెల్లింపులు ఆగిపోయినపుడు నగదు డెబిట్ అయిందా లేక తిరిగి జమ అయిందా అని తెలియడానికి 30 సెకన్లు, అంతకంటే ఎక్కువ సమయం పట్టేది. ఇప్పుడు 10 సెకన్లలోనే ఆ వివరాలు తెలిసిపోతాయి. అలాగే బ్యాంకులు, చెల్లింపు యాప్‌లు పెండింగ్ లేదా నిలిచిపోయిన లావాదేవీల వివరాలను ధ్రువీకరించడానికి 90 సెకన్ల వరకు పట్టగా, ఇప్పుడు 45 నుంచి 60 సెకన్లు మాత్రమే తీసుకుంటుంది.

రైల్వేలో 6,374 పోస్టుల భర్తీకి చర్యలు

న్యూఢిల్లీ, జూన్ 16: రైల్వేలో ఖాళీగా ఉన్న 6,374 టెక్నీషియన్ పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభమయ్యాయి. సిగ్నల్, టెలికమ్యూనికేషన్ సహా 51 కేటగిరీల్లోని గ్రేడ్ -సి పోస్టులు భర్తీ కానున్నాయి. దేశంలోని 17 జోన్లు, ఉత్పాదక యూనిట్లలో ఈ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. ప్రస్తుతం పేర్కొన్న పోస్టుల సంఖ్య కన్నా ఇంకా ఎక్కువ ఖాళీలు ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి. సిగ్నల్, టెలికాం విభాగంలో చివరిసారిగా 2017లో పోస్టుల భర్తీ జరిగింది.

కేదార్‌నాథ్ యాత్ర పునఃప్రారంభం

రుద్రప్రయాగ, జూన్ 16: కేదార్‌నాథ్ యాత్ర సోమవారం పునఃప్రారంభమైంది. ఆదివారం రుద్రప్రయాగ జిల్లాలోని పలుప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడడంతో ఓ వ్యక్తి మరణించగా, ఇద్దరు గాయపడ్డారు. ఈ క్రమంలో కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. యాత్రకు వెళ్లే మార్గంలో పడిన కొండచరియలను తొలగించడంతో సోమవారం పునరుద్ధరించారు. ఈ వారం మొత్తం వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో సోన్‌ప్రయాగ్ నుంచి కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లే నడక నడక మార్గాన్ని మూసివేస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు.

'ఉపాధి' వ్యయంపై పరిమితి దారుణం: ఖర్గే

న్యూఢిల్లీ, జూన్ 16: పేదల జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకం నిర్వీర్యానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం 'ఎక్స్'లో ఆరోపించారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ వ్యయంపై కేంద్రం పరిమితి విధించిందని, ఇది 'రాజ్యాంగ వ్యతిరేకం' అని విమర్శించారు. ఉపాధి హామీ పథకం వ్యయాన్ని ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలలకు 60 శాతంగా నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. పేదల జేబుల నుంచి రూ.25 వేల కోట్లు దోచుకొనేందుకు మోదీ ప్రభుత్వం ఇలా చేస్తోందా? అని ఖర్గే ప్రశ్నించారు.

ఎట్టకేలకు కదిలిన నైరుతి

» ముంబై, కేరళను ముంచెత్తుతున్న భారీ వర్షాలు

న్యూఢిల్లీ, జూన్ 16: సుమారు 19 రోజులపాటు నిలిచిపోయిన నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు పుంజుకున్నాయి. మధ్య, ఉత్తర అరేబియా సముద్రం, గుజరాత్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో పలు ప్రాంతాలు.. కొంకణ్, మధ్య మహారాష్ట్ర, తెలంగాణలో మిగిలిన ప్రాంతాలకు విస్తరించాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో గుజరాత్, మహారాష్ట్ర, విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్‌లోనూ విస్తరించనున్నాయి. గుజరాత్ పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం మంగళవారానికి అల్పపీడనంగా మారనుంది. ఇంకా వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రుతుపవనాలు చురుగ్గా కదులుతాయని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాల ప్రభావంతో ముంబై నగరాన్ని వర్షాలు ముంచెత్తుతున్నాయి. కేరళలో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి.

టార్గెట్ టెహ్రాన్!



ఇరాన్‌లో తగలబడిపోతున్న ఐఆర్‌బీబీ భవనం

(మొదటి పేజీ తరువాయి)

తోసుకుంటూ లోనికి వెళ్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "టెహ్రాన్ పౌరులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సందేశాలు పంపాం. మేము టార్గెట్‌గా చేసుకోబోతున్న ప్రాంతాల వివరాలను అందజేశాం" అని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి మేజర్ కమల్ పిన్హాసీ పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ కూడా ఇవే హెచ్చరికలు చేశారు. దీంతో.. సోమవారం అర్ధరాత్రి నుంచి టెహ్రాన్‌పై భీకర దాడులు చేసేందుకు ఐడీఎఫ్ సిద్ధమైనట్లు తెలుస్తోంది.

వైమానిక దాడులకు చాన్స్!

టెహ్రాన్ వాసులకు హెచ్చరికలు జారీ చేయడానికి ముందు కాట్జ్ ఓ ప్రకటన చేశారు. "ఇరాన్‌లోని మూడోవంతు గగనతల రక్షణ వ్యవస్థలను మేం నిర్వీర్యం చేశాం. ఇప్పుడు టెహ్రాన్‌తోపాటు.. కీలక ప్రాంతాల్లో గగనతలాన్ని మేం నియంత్రించగలం" అని వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని నిర్ధారించారు. దీన్ని బట్టి సోమవారం అర్ధరాత్రి దాటాక టెహ్రాన్‌పై భీకర వైమానిక దాడులు జరుగుతాయని తెలుస్తోంది. కడపటి వార్తలందేసరికి ఇరాన్ సెంట్రల్ కమాండ్‌లోని పలు లక్ష్యాలపై, ఇస్ఫహాన్ అణుకేంద్రంపై ఇజ్రాయెల్ దాడులు జరిగాయి. టెహ్రాన్ వైమానిక స్థావరంపై జరిపిన దాడిలో రెండు ఎఫ్-14 ఫైటర్ జెట్లు ధ్వంసమయ్యాయి. వీటితోపాటు.. ఇరాన్ డ్రోన్ల యూనిట్‌ను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. క్షిపణులను తరలిస్తున్న ట్రక్కులను టార్గెట్లుగా చేసుకుని, దాడులు చేసినట్లు తెలిపింది. పశ్చిమ, మధ్య ఇరాన్‌లోనూ డజన్ల కొద్దీ డ్రోన్ దాడులు జరిగాయి. ఈ ప్రాంతాల్లో ఉన్న ఇరాన్ క్షిపణి, యూఏవీ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ వార్తాసంస్థ 'వైనెట్' వెల్లడించింది. కాగా.. సోమవారం ఉదయం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన ఖుద్స్ ఫోర్స్ ప్రధాన కార్యాలయం ధ్వంసమైంది. ఇరాన్ సైన్యం ప్రధాన కార్యాలయంపైనా క్షిపణి దాడులు జరిగాయి. క్షిపణి దాడుల కారణంగా ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్(ఐఆర్‌ఐబీ) భవనం తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ భవనంలో ఇరాన్ అధికారిక వార్తాసంస్థలు-- ప్రెస్‌టీవీ, అల్-ఆలమ్, హిస్పాన్ టీవీ కొనసాగుతున్నాయి. మరో వార్తాసంస్థ 'సహర్ టీవీ' భవనంపైనా బాంబులు పడడంతో తీవ్రంగా దెబ్బతిన్నది. యాంకర్ లైవ్‌లో ఉండగానే క్షిపణి దాడి జరిగింది. ప్రేక్షకులు ఈ దృశ్యాలను మీడియాలో చూశారు. ఈ రెండు ఘటనల్లో పలువురు మృతి చెంది ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన నాలుగు రోజులుగా జరుగుతున్న యుద్ధంలో 400 మంది మరణించారని, వారిలో 197 మంది సాధారణ పౌరులని ఇరాన్‌లోని మానవ హక్కుల సంఘాలు పేర్కొన్నాయి.

ఇజ్రాయెల్‌లో భారీ నష్టం

ఇరాన్ క్షిపణి దాడులతో నాలుగో రోజు కూడా ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్ శివార్లలోని పలు పట్టణాలు భారీగా నష్టపోయాయి. ఈ దాడుల్లో 11 మంది మృతిచెందారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 24 మరణాలు నమోదైనట్లు, 500 మందికిపైగా గాయపడ్డట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం అర్ధరాత్రి దాటాక.. సోమవారం తెల్లవారుజాము వరకు హైఫా ప్రాంతంలో క్షిపణుల వర్షం కురిసింది. ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ వాటిని చాలా వరకు గాల్లోనే అడ్డుకున్నా.. పలు క్షిపణులు బాజాన్ చమురు క్షేత్రాన్ని తాకాయి. అయితే.. చమురు క్షేత్రం వద్ద పార్క్ చేసి ఉన్న భారీ ట్యాంకర్ ట్రక్కులు, పైప్‌లైన్ మాత్రమే ధ్వంసమైనట్లు ఐడీఎఫ్ వర్గాలు తెలిపాయి. ప్రధాన ప్లాంట్ క్షేమంగా ఉందని చెప్పాయి. ఈ ప్రాంతంతో పాటు.. పేటాతిక్వా, క్రయోట్‌లో మరణాలు ఎక్కువగా సంభవించినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ ప్రభుత్వం తమ పౌరులను బంకర్లకు తరలించడంతో.. ప్రాణనష్టం తక్కువగా ఉన్నా.. భవనాలు, ఆకాశహర్మ్యాలు, దెబ్బతిన్నాయి. సోమవారం రాత్రి ఇరాన్ జరిపిన దాడుల్లో ఉత్తరాదిలోని పలు ప్రాంతాల్లో నష్టం జరిగినట్లు తెలిసింది.



ఇజ్రాయెల్‌లోని పేటాతిక్వాలో ధ్వంసమైన భవనం

పాకిస్థాన్ రంగంలోకి దిగుతుంది: ఇరాన్

ఇజ్రాయెల్ తమపై అణుబాంబుతో దాడిచేస్తే.. పాకిస్థాన్ రంగంలోకి దిగుతుందంటూ ఐఆర్‌జీసీ జనరల్ మొహిసన్ రెజాయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ చూస్తూ ఊరుకోదని, ఇజ్రాయెల్‌పై తన అణ్వాయుధాలను ప్రయోగిస్తుందని హెచ్చరించారు. ఆ మేరకు తమకు పాకిస్థాన్ నుంచి హామీ లభించిందని చెప్పారు. అంతేకాకుండా.. తుర్కియే, సౌదీఅరేబియా, పాకిస్థాన్ తదితర దేశాలతో కలిసి ఇస్లామిక్ ఆర్మీని ఏర్పాటు చేయాలని మొహిసిన్ పిలుపునిచ్చారు. కాగా.. మొహిసిన్ అణుదాడి వ్యాఖ్యలను పాకిస్థాన్ ఖండించింది.

ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర: నెతన్యాహు

ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్రపన్నిందంటూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సంచలన ఆరోపణలు చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదని ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారని, అందుకే ఆయనను చంపాలని ఇరాన్ చూస్తోందని ఆరోపించారు. కాగా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వానికి తాము సిద్ధంగా ఉన్నామని రష్యా ప్రకటించింది. ఈ మేరకు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఓ ప్రకటన చేశారు. "మేం గతంలోనే ఇరాన్‌కు ఒక ప్రతిపాదన చేశాం. రష్యా గడ్డపై ఇరాన్ యురేనియంను నిల్వ చేయాలి. ఈ ప్రతిపాదన ఇప్పటికీ సముచితమైనదే" అని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు మధ్యవర్తిత్వానికి ఒప్పించేలా అమెరికాను కోరాలని ఖతార్, సౌదీ అరేబియా, ఒమన్‌లకు ఇరాన్ విజ్ఞప్తి చేసినట్లు రాయిటర్స్ ఓ కథనాన్ని ప్రచురించింది.

భారతీయ విద్యార్థులకు మార్గం సుగమం

ఇరాన్‌లో చిక్కుకుపోయిన సుమారు 10 వేల మంది భారతీయ విద్యార్థులను వెనక్కి రప్పించడానికి విదేశాంగ శాఖ మార్గం సుగమం చేసింది. భారత విజ్ఞప్తి మేరకు అజర్‌బైజాన్, తుర్క్‌మెనిస్థాన్, ఆఫ్ఘానిస్థాన్ మీదుగా రోడ్డు మార్గంలో విద్యార్థులు వెనక్కి వెళ్లేందుకు ఇరాన్ సర్కారు అనుమతినిచ్చింది. కాగా.. టెహ్రాన్ వైద్య విశ్వవిద్యాలయంపై సోమవారం ఇజ్రాయెల్ క్షిపణులు పడ్డాయి. ఈ ఘటనలో జమ్మూకశ్మీర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి.

భారత్‌ను కాపీ కొడుతున్న ఇరాన్!

ఇజ్రాయెల్‌తో యుద్ధంపై ప్రెస్ బ్రీఫింగ్‌లో ఇరాన్ భారత్‌ను కాపీ కొడుతున్నట్లు కనబడుతోంది. 1979 పేం,ఇ ఏనాడూ ఫ్రంట్‌లైన్‌లో మహిళా అధికారులను ఇరాన్ నియమించలేదు. కానీ, ఇజ్రాయెల్‌తో యుద్ధం సందర్భంగా మొట్టమొదటిసారి ఫాతిమా మొహాజిరాని అనే మహిళను అధికార ప్రతినిధిగా నియమించారు. ప్రెస్ బ్రీఫింగ్ బాధ్యతలను పూర్తిస్థాయిలో ఆమెకే అప్పగించారు.

లోకం తీరు



ఇజ్రాయెల్‌కు ఆత్మరక్షణ హక్కు ఉంది

» జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సు

కననాస్కిస్, జూన్ 16: ఇజ్రాయెల్‌కు ఆత్మరక్షణ హక్కు ఉందని కెనడాలో జరుగుతోన్న జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సు స్పష్టం చేసింది. అదే సమయంలో ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉండరాదని కూడా ఓ ముసాయిదా ప్రకటన ద్వారా తేల్చి చెప్పింది. ప్రాంతీయ సుస్థిరత కోసం రెండు దేశాలు ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని ముసాయిదాలో సూచించాయి. మరోవైపు సదస్సులో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధంలో ఇరాన్ గెలవదన్నారు. ఆలస్యం కాకముందే ఇరాన్ సంప్రదింపుల ప్రక్రియ ప్రారంభిస్తే మేలని సూచించారు. అమెరికా సంస్థలపై దాడి చేస్తే కనీవినీ ఎరుగని రీతిలో ప్రతిదాడులు చేస్తామని ఇరాన్‌ను హెచ్చరించారు. జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సు ముసాయిదా ప్రకటనపై సంతకం చేసేందుకు ట్రంప్ నిరాకరించారని సమాచారం.ఔ కాగా, ప్రధాని మోదీ సైప్రస్ పర్యటన ముగించుకుని జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు కెనడా చేరుకున్నారు.

ఆగస్టులో ట్రంప్ మొబైల్ ఫోన్లు

వాషింగ్టన్ డీసీ, జూన్ 16: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొబైల్ ఫోన్ మార్కెట్‌లోకి అడుగుపెట్టారు. ఆయన సొంత సంస్థ(ట్రంప్ ఆర్గనైజేషన్) ట్రంప్ మొబైల్ పేరిట స్మార్ట్ ఫోన్‌ను ఆవిష్కరించింది. టీ1 పేరిట గోల్డెన్ కలర్ ఫోన్‌ను ఆగస్ట్‌లో మార్కెట్‌లోకి తీసుకురానున్నారు. దీని ఖరీదు 499 డాలర్లు. అమెరికాలో ఏటా ఆరు కోట్ల మొబైల్ ఫోన్లు అమ్ముడుపోతున్నా ఉత్పత్తి మాత్రం బయట దేశాల్లోనే జరుగుతోంది. అయితే ట్రంప్ ఫోన్లు మాత్రం పూర్తి స్థాయిలో అమెరికాలోనే తయారవుతాయి. ట్రంప్ ఫోన్ నెలవారీ ప్లాన్లలో 47 డాలర్లకే హై స్పీడ్‌తో 20జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాల్స్, సందేశాలు పంపే అవకాశమిచ్చారు.

కాంగ్రెస్ వల్లే నేపాల్‌లో రాచరిక వ్యవస్థ పతనం

బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే

న్యూఢిల్లీ, జూన్ 16: ఏకైక హిందూ దేశమైన నేపాల్‌లో రాచరిక వ్యవస్థ పతనానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే ఆరోపించారు. నేపాల్ రాజు బీరేంద్రను గద్దె దించి రాచరిక వ్యవస్థను పతనం చేయడంతో పాటు అనంతర కాలంలో చైనా మద్దతున్న ప్రచండను ప్రధానిగా చేసిందన్నారు. రా (రీసర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్) అధికారి అమర్ భూషణ్‌కు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బాధ్యతలు అప్పగించిందని చెప్పారు. నాడు కాంగ్రెస్ అనుసరించిన తీరు వల్ల నేడు భారత్ ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఈ మేరకు దూబే సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. "1988లో నాటి ప్రధాని రాజీవ్ గాంధీ కుటుంబ సమేతంగా నేపాల్ వెళ్లారు. పర్యటనలో భాగంగా అక్కడి పశుపతినాథ్ ఆలయాన్ని దర్శించాలనుకున్నారు. హైందవేతరులకు ఆలయంలోకి ప్రవేశం లేదంటూ ఆలయ కమిటీ సభ్యులు సోనియా గాంధీకి అనుమతి నిరాకరించారు. దీనికి ప్రతీకారంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నేపాల్‌పై కక్షగట్టింది. నేపాల్‌కు వెళ్లే వస్తువులపై కస్టమ్స్ డ్యూటీ విధించడంతో పాటు ఆంక్షలు విధించింది. దీంతో నాటి నేపాల్ రాజు బీరేంద్ర.. చైనాతో ఆయుధాలు, ఆహార పదార్థాలకు సంబంధించిన ఒప్పందం కుదుర్చుకున్నారు. తద్వారా నేపాల్ చైనా ఒడిలోకి వెళ్లినట్లైంది. అంతటితో ఆగక రా అధికారి అమర్ భూషణ్ ద్వారా నేపాల్‌లో రాచరిక వ్యవస్థ పతనమయ్యేలా చేయడంతో పాటు.. అనంతర కాలంలో ప్రచండను ప్రధానిని చేశారు" అని దూబే సోషల్ మీడియా పోస్టులో ఆరోపించారు.

బాబోయ్.. విమాన ప్రయాణాలు!

బాంబు బెదిరింపులు, సాంకేతిక సమస్యలు, ప్రమాదాలతో జనంలో ఆందోళన



లండన్/హైదరాబాద్, జూన్ 16: జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన లుఫ్తాన్సా విమానం.. బాంబు బెదిరింపు కారణంగా వెనక్కి మళ్లింది. ఫ్రాంక్‌ఫర్ట్ స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 2.14 గంటలకు (భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5.44గంటలు) బయల్దేరిన ఎల్‌హెచ్752 (బోయింగ్ 787-9 డ్రీమ్‌లైనర్) విమానం.. షెడ్యూలు ప్రకారం సోమవారం ఉదయానికి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోవాలి. కానీ, బయల్దేరిన రెండు గంటలకే.. బాంబు బెదిరింపు కారణంగా విమానం యూటర్న్ తీసుకుని తిరిగి ఫ్రాంక్‌ఫర్ట్‌కు చేరుకుంది. విమానయాన సంస్థ.. సోమవారం ఉదయం 10 గంటలకు(భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటలకు) అదే విమానంలో వారిని హైదరాబాద్‌కు పంపింది. మరోవైపు.. ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఈ విమానానికి సంబంధించి బాంబు బెదిరింపు ఈమెయిల్ వచ్చినట్టు శంషాబాద్ విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. మరోవైపు.. లండన్‌లోని హీత్రూ ఎయిర్‌పోర్టు నుంచి చెన్నైకి బయల్దేరిన బోయింగ్ 787-9 డ్రీమ్‌లైనర్ (బ్రిటిష్ ఎయిర్‌వేస్ ఫ్లైట్ బీఏ35).. సాంకేతిక సమస్యల కారణంగా మళ్లీ లండన్‌కు చేరుకుంది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగానే విమానాన్ని వెనక్కి మళ్లించినట్టు బ్రిటిష్ ఎయిర్‌వేస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ విమానం మళ్లీ సోమవారం మధ్యాహ్నం చెన్నైకి బయల్దేరిందని.. మంగళవారం ఉదయం చెన్నైలో ల్యాండ్ కానుందని తెలిపింది. ఇక.. హాంకాంగ్ నుంచి సోమవారం ఢిల్లీకి బయల్దేరిన ఎయిరిండియా(బోయింగ్ 787-8) విమానంలో సాంకేతిక సమస్య ఉందని పైలట్ అనుమానించడంతో.. దాన్ని తిరిగి హాంకాంగ్‌కే మళ్లించి అక్కడ సురక్షితంగా ల్యాండ్ చేశారు. అటు.. జెద్దా నుంచి లక్నవూకు 242 మంది హజ్ యాత్రికులతో వచ్చిన సౌదీ ఎయిర్‌లైన్స్ విమాన చక్రాల నుంచి పొగలు, నిప్పురవ్వలు రావడం కలకలం సృష్టించింది. అయితే ఎలాంటి ప్రమాదం జరగకుండా చూశారు.

దించి.. ఎక్కించి..

గువాహటి నుంచి కోల్‌కతా వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగించింది. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సీట్లలో కూర్చొన్న ప్రయాణికులను రెండుసార్లు కిందికి దింపాల్సి వచ్చింది. 18 గంటల పాటు వేచి చూసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో చివరకు మరో ప్రత్యేక విమానంలో కోల్‌కతాకు పంపాల్సి వచ్చింది. గువాహటి విమానాశ్రయం నుంచి శనివారం రాత్రి 9.20 గంటలకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం బయలుదేరాల్సి ఉండగా సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో విమానంలోని 170 మంది ప్రయాణికులను కిందికి దించారు. సమస్య పరిష్కారమయిందని చెప్పి ప్రయాణికులను మళ్లీ కూర్చోమన్నారు. తిరిగి అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో మరోసారి అందర్నీ కిందికి దించారు. తిరిగి ఆదివారం ఉదయం 9.30 గంటల సమయంలో ప్రయాణికులంతా విమానం ఎక్కారు. సాంకేతిక సమస్య ఉందని చెప్పి ఇంకోసారి అందర్నీ కిందికి దించేశారు. చివరకు మరో విమానం ఏర్పాటు చేసి సాయంత్రం 3.34 గంటల సమయంలో ప్రయాణికులను కోల్‌కతా పంపించారు. మరోవైపు.. ఆదివారం సాయంత్రం 6.51 గంటలకు ఢిల్లీ నుంచి వడోదరకు బయల్దేరిన ఎయిరిండియా విమానాన్ని ల్యాండింగ్ గేర్‌లో సమస్య కారణంగా 7.20 గంటలకు తిరిగి ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు.

సైప్రస్‌లో తుర్కియేకు మోదీ గట్టి సందేశం

» త్వరలో ఈయూ కౌన్సిల్ బాధ్యతలు చేపట్టనున్న సైప్రస్

» భారత్‌కు పలు అంశాల్లో అనుకూలం

న్యూఢిల్లీ, నికోసియా(సైప్రస్), జూన్ 16 : ప్రధాని నరేంద్ర మోదీ సైప్రస్ పర్యటన దానికి పొరుగు దేశం తుర్కియేకు గట్టి సందేశమేనని విశ్లేషకుల అంచనా. 1974లో ఆ దేశంలోని మూడోవంతు భాగాన్ని తుర్కియే ఆక్రమించుకొంది. అప్పటి నుంచి ఆ రెండు దేశాల మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. అంతేగాక భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో తుర్కియే పాకిస్థాన్‌కు అండగా నిలిచింది. అదే సమయంలో సైప్రస్ భారత్‌కు మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత ప్రధాని సైప్రస్ పర్యటన అర్థవంతమైనదిగానే విశ్లేషకులు భావిస్తున్నారు. సైప్రస్ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడలిడీస్ ఆహ్వానం మేరకు ప్రధాని నరేంద్ర మోదీ 100 మంది అధికారుల బృందంతో ఆ దేశ పర్యటనకు వెళ్లడం విశేషం. ఈ పర్యటన వ్యూహాత్మకంగా, దౌత్యపరంగా, ఆర్థికంగా, ప్రపంచ రాజకీయాల కోణంలోనూ కీలకమైనదిగా భావిస్తున్నారు. 2026లో సైప్రస్ యూరోపియన్ యూనియన్(ఈయూ) కౌన్సిల్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనుంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటనతో భారత్-ఈయూల మధ్య వాణిజ్యం, భద్రత అంశాల్లో మరింత మెరుగైన సహకారం పెంపొందేందుకు ఆ దేశం కృషి చేసే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి సైప్రస్ దేశ అత్యున్నత పురస్కారం "గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ మెకరియోస్-3"ని ప్రదానం చేశారు. రెండు దేశాల మధ్య ఉన్న నిజమైన స్నేహానికి ఈ పురస్కారం నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. రెండు దేశాల సంబంధాలు మరింత ఉన్నత స్థాయికి చేరతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మన అణ్వస్త్రాలు పెరుగుతున్నాయ్

» ఈ ఏడాది 180కి చేరే అవకాశం

» పాకిస్థాన్ వద్ద 170 వార్‌హెడ్లు

» ఏడాదికి వంద సిద్ధం చేస్తున్న చైనా

» స్టాక్‌హోం రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడి



న్యూఢిల్లీ, జూన్ 16: భారత్ గతేడాది తన అణ్వస్త్రాలను స్వల్పంగా పెంచుకోవడంతోపాటు వినూత్న అణు సరఫరా వ్యవస్థల అభివృద్ధిని కొనసాగిస్తోంది. ప్రస్తుతం దాని వద్ద 172 అణ్వస్త్రాలు ఉన్నాయని.. ఈ ఏడాది వాటి సంఖ్య 180కి చేరుకుంటుందని స్టాక్‌హోం అంతర్జాతీయ శాంతి పరిశోధక సంస్థ (సిప్రీ) అంచనా వేసింది. ప్రపంచ దేశాలు మోహరించిన వార్‌హెడ్లు.. వాటి సైన్యాల అమ్ములపొదిలో ఎన్ని అణ్వస్త్రాలు ఉన్నాయో సోమవారం తన నివేదికలో తెలిపింది. భారత్ సరికొత్తగా కంటైనర్‌లలో ఉండే తర్వాతి తరం క్షిపణులను అభివృద్ధి చేస్తోందని.. వాటిలో సదరు క్షిపణులకు ముందే అణు వార్‌హెడ్లను మరింత సురక్షితంగా అమర్చే సౌకర్యం ఉంటుందని పేర్కొంది. 'తర్వాతి తరం నూతన డెలివరీ ప్లాట్‌ఫాంలలో అగ్ని ప్రైమ్ (అగ్ని-పీ) క్షిపణి, మల్టీ ఇండిపెండెంట్‌లీ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికిల్ (ఎంఐఆర్‌వీ) సామర్థ్యం కల అగ్ని-5 క్షిపణి వ్యవస్థ ఉన్నాయి. అగ్ని సిరీస్ క్షిపణుల్లో అగ్ని-5 అత్యంత అధునాతనమైనది. దీని టార్గెట్ రేంజ్ వెయ్యి కిలోమీటర్ల నుంచి 2 వేల కిలోమీటర్లకు ఉంటుంది' అని తెలిపింది. మరోవైపు.. పాకిస్థాన్ కూడా ఈ ఏడాది తన అణు వార్‌హెడ్ల సంఖ్యను 170కి పెంచుకోవాలని నిర్ణయించిందని 'సిప్రీ' వెల్లడించింది.'అణుసంబంధ మిలిటరీ మౌలిక వసతులపై దాడులకు మూడో వ్యక్తులిచ్చే తప్పుడు సమాచార వ్యాప్తి కూడా తోడైతే సంప్రదాయ యుద్ధం అణుసంక్షోభంగా మారుతుంది' అని సిప్రీ సీనియర్ పరిశోధకుడు మ్యాట్ కోర్డా హెచ్చరించారు. చైనా అతివేగంగా అణు వార్‌హెడ్లను తయారుచేస్తోందని సిప్రీ తెలిపింది. అమెరికా, రష్యాలతో పోటీపడుతూ.. ఏడాదికి వంద చొప్పున సిద్ధం చేస్తోందని.. ఈ ఏడాది మరో వంద తయారీలో నిమగ్నమైందన్నది. గత జనవరికల్లా 350 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను (ఐసీబీఎం) నిల్వచేసే భూగర్భ కేంద్రాలను పూర్తిచేసిందని పేర్కొంది. అమెరికా, రష్యా వద్ద ఉన్న అణు వార్‌హెడ్లలో మూడో వంతు మాత్రమే చైనా వద్ద ఉండటంతో 2035కల్లా 1,500 వార్‌హెడ్ల తయారీ లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొంది. గత జనవరికల్లా ప్రపంచ దేశాల వద్ద 12,241 వార్‌హెడ్లున్నాయని తెలిపింది. అయితే సిప్రీ నివేదికపై స్పందించేందుకు నిరాకరించిన చైనా.. ఏటా వంద వార్‌హెడ్లు తయారుచేస్తున్నా.. కని ష్ఠంగానే తన ఉత్పత్తి ఉందని పేర్కొది. అమెరికా, రష్యాలతో అణు రే సులో లేమని స్పష్టంచేసింది. తమ అణ్వస్త్ర కార్యక్రమం పూర్తిగా ఆత్మరక్షణకేనని చైనా విదేశాంగ ప్రతినిధి గువో జియాకున్ తెలిపారు.

సింధూపై భారీ జల ప్రణాళిక

» పాక్‌కు పోతున్న మిగులు జలాలకు చెక్

» సీరియస్‌గా అధ్యయనం చేస్తున్న భారత్

న్యూఢిల్లీ, జూన్ 16 : పూర్తి స్థాయిలో సింధూనదీలోని తన వాటా జలాల వినియోగానికి భారత్ భారీ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. జమ్మూకశ్మీర్ గుండా పాక్‌కు పోతున్న మిగులు జలాలను 113 కిమీ పొడవైన కాలువ ద్వారా పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లకు మళ్లించాలని యోచిస్తోంది. కాలువ నిర్మాణ సాధ్యాసాధ్యాలపై కేంద్రం లోతుగా అధ్యయనం చేస్తోందని ఓ ఆంగ్ల పత్రిక కథనం ప్రచురించింది. పాక్‌కు సింధూజలాలను నిలిపివేస్తున్నట్టు పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సింధూ నదీజలాల మళ్లింపు ప్రణాళికను మోదీ ప్రభుత్వం సిద్ధం చేస్తున్నదని ఆ కథనం పేర్కొంది. సింధూ పరివాహకంలోని చినాబ్‌ను రావి-బియాస్-సట్లేజ్‌తో ఈ కాలువ అనుసంధానిస్తుందని శనివారం బీజేపీ శిక్షణా శిబిరంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సూచనప్రాయంగా వెల్లడించారు. జమ్మూకశ్మీర్ నుంచి పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌ల్లో గల కాలువలను కలుపుకుంటూ కొత్త కాలువ నిర్మాణం చేపడతారు. అంతిమంగా రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ కాలువ వ్యవస్థతో అనుసంధానిస్తారు. దీనికోసం బ్యారేజ్‌లు, టన్నెళ్లు నిర్మిస్తారు. రణబీర్ కాలువను డబుల్ చేస్తూ 60 కిమీ నుంచి 120 కిమీకు విస్తరిస్తారు. కథువా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఉజ్ బహుళార్థ సాధక ప్రాజెక్టును పునరుద్ధరిస్తారు. ఉజ్‌కు దిగువన రెండో రావి-బియాస్ లింక్‌ను గతంలో తలపెట్టారు. పాకిస్థాన్‌లోకి ప్రవహించే మిగులు రావి జలాలను ఆపటం అప్పట్లో దీని లక్ష్యం. దీనిని కూడా కాలువ నెట్‌వర్క్‌లో అంతర్భాగం చేయాలని తాజాగా యోచిస్తున్నారు. దీనికోసం ఒక బ్యారేజ్, టన్నెల్‌ను నిర్మించి.. బియాస్ నదీ బేసిన్‌కు జలాలను మళ్లిస్తారు. వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో పాకల్ దల్ ప్రాజెక్టును తలపెట్టింది. రెటిల్ (850మెగావాట్లు), కిరూ (624 మెగావాట్లు) ఖ్వార్ (540 మెగావాట్లు) ప్రాజెక్టులను చేపడుతోందని ఆ కథనం తెలిపింది.

ఎవరా ఐఏఎస్‌లు?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఆరా తీస్తున్న నిఘా వర్గాలు
- చర్చనీయాంశంగా 'ఆంధ్రజ్యోతి' 'మేం మారేదే లే' కథనం

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసే పలువురు ఐఏఎస్‌లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని, పథకాల రూపకల్పనలో ముందుచూపు కొరవడుతోందని, కిందిస్థాయి అధికారులు, ఉద్యోగుల పట్ల దరుసుగా వ్యవహరిస్తున్నారని "మేం మారేదే లే" శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం ఐఏఎస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తమ సహచరుల్లో ఎవరై ఉంటారోనంటూ కొంత మంది ఐఏఎస్ అధికారులు ఫోన్లు చేసుకుని మాట్లాడుకున్నట్లు సమాచారం. మరోవైపు ఆ ఐఏఎస్‌లు ఎవరు? వారు నిర్వర్తిస్తున్న విధులేంటి? ఆయా శాఖలు ఏమిటనే దానిపై నిఘా వర్గాలు ఆరా తీశాయి. కథనంలో పేర్కొన్న వివరాల మేరకు ఆయా శాఖల అధికారులు, వారి పని తీరు గురించి వాకబు చేశారు. ఓ శాఖలో ఐఏఎస్ వర్సెస్ ఐపీఎస్‌గా మారిన వ్యవహారం ఏంటి? ఎందుకు వారిద్దరి మధ్యన సమస్య తలెత్తిందనే అంశంపై ప్రత్యేకంగా ఆరా తీసినట్లు సమాచారం. ఇదే అంశంపై ముఖ్యమంత్రి కార్యాలయం కూడా దృష్టి సారించినట్టు తెలిసింది.

ప్రేమ జంట ఆత్మహత్య

- పదేళ్ల నుంచి ప్రేమించుకుంటున్న జంట
- వివాహానికి పెద్దలు నిరాకరించటంతో మనస్తాపం
- భువనగిరిలో రైలు కిందపడి బలవన్మరణం
- మృతులు జనగామ జిల్లా వాసులుగా గుర్తింపు


శ్రుతి, వినయ్‌కుమార్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ / భువనగిరి రూరల్ జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇద్దరిదీ ఒకే వీధి కావడంతో చిన్ననాటి నుంచి కలిసి పెరిగారు.. తర్వాత స్నేహం ప్రేమగా మారింది.. పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నారు. కానీ, పెద్దలు నిరాకరించడంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన భువనగిరి శివారులోని పగిడిపల్లి వద్ద జరిగింది. మృతులను జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నెమలిగొండకు చెందిన మచ్చ శృతి(23), కోటే వినయ్‌కుమార్(25)గా గుర్తించారు. వీరి రెండు కుటుంబాలు ఒకే వీధిలో నివాసముంటున్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కలిసి చదువుకున్నారు. ఈ క్రమంలోనే పదేళ్లుగా ఒకరినొకరు ప్రేమించుకున్నారు. బీటెక్ పూర్తి చేసిన శ్రుతి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ చేస్తోండగా, వినయ్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో శ్రుతి తన ప్రేమ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. వారు నిరాకరించడంతో విషయాన్ని వినయ్‌కు తెలిపింది. దీంతో శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన వినయ్ ఆదివారం మధ్యాహ్నం వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా పని మీద భువనగిరి వచ్చానని తెలిపాడు. భువనగిరి వద్ద కలుసుకున్న వినయ్, శృతి తమకు వివాహం కాదేమోనని భావించి, ఆదివారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో పోలీసులు మృతుల వివరాలను తెలుసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించామని రైల్వే ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడడంతో నమిలికొండలో విషాదం అలుముకుంది.

నేడు సిట్ ఎదుటకు పీసీసీ చీఫ్

ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలం.. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్ ట్యాప్ అయ్యిందని మహేశ్ ఆరోపణ

- వివరాలు తెలియజేయాలని సిట్ నోటీసు
- వాంగ్మూలం ఇవ్వనున్న కాంగ్రెస్ నేత
- సిట్ విచారణకు హాజరైన మహిపాల్‌రెడ్డి
- గత ప్రభుత్వం 8 నెలల పాటు తన ఫోన్‌ను ట్యాపింగ్ చేయించిందని వెల్లడి
- నేడు విచారణకు ప్రభాకర్‌రావు, సరిత

హైదరాబాద్, వికారాబాద్, గద్వాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను వేగవంతం చేసింది. దాదాపు 600 మంది ఫోన్ ట్యాపింగ్ బాధితులు ఉన్నట్లు ఇప్పటికే తేలటంతో, వారి నుంచి సిట్ అధికారులు వాంగ్మూలాలు సేకరిస్తున్నారు. దీంట్లో భాగంగానే టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నుంచి వాంగ్మూలం సేకరించేందుకు సిట్ సిద్ధమైంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు మహేశ్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే, తమ ఎదుట విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాల్సిందిగా సిట్ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. దీంతో మంగళవారం జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయానికి మహేశ్‌కుమార్ వెళ్లనున్నారు. కాగా, బాధితుల నుంచి వాంగ్మూలాల సేకరణలో భాగంగా వికారాబాద్‌కు చెందిన ఉమ్మడి రంగారెడ్డి జడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పట్లోళ్ల మహిపాల్ రెడ్డిని సిట్ అధికారులు సోమవారం 45 నిమిషాలపాటు విచారించారు. తొలుత ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్సైలు ప్రాథమికంగా ప్రశ్నించి వివరాలు సేకరించగా, ఆ తర్వాత ఏసీపీ వెంకటగిరి సుమారు అరగంటపాటు విచారించారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, అప్పటి పీసీసీ చీఫ్, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డితో తరచూ మాట్లాడిన కాల్ డేటాను ఆయన ముందు ఉంచి ప్రశ్నించారు. ఆయా సమయాల్లో వారితో మాట్లాడింది వాస్తవమేనని మహిపాల్ రెడ్డి అధికారులకు వాంగ్మూలం ఇచ్చారు. ఎన్నికల ముందు ఒక ఫోన్ నెంబరు ఉపయోగిస్తూ, మరో ఫోన్‌లో వాట్సాప్ ఎందుకు వాడాల్సి వచ్చిందని సిట్ బృందం ప్రశ్నించగా... అప్పటికే తన ఫోన్ ట్యాపింగ్ అవుతున్నట్లు సందేహం కలగటంతో భద్రతా కారణాల రీత్యా అలా చేశానని మహిపాల్ రెడ్డి సిట్ తెలిపినట్లు సమాచారం.



నేడు మరోసారి ప్రభాకర్‌రావు విచారణ

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు మంగళవారం మరోసారి సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరు కానున్నారు. బుధవారం ప్రణీత్ రావును సిట్ విచారించనుంది. ఫోన్ ట్యాపింగ్‌కు గురైన వారి జాబితాలో ఉన్న గద్వాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి సరితను కూడా వాంగ్మూలం ఇవ్వటానికి మంగళవారం తమ ఎదుట హాజరుకావాలని సిట్ నోటీసులు ఇచ్చింది. ఈ మేరకు, సిట్ ఎదుట హాజరుకానున్నట్లు సరిత తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ బాధితుడు విష్ణువర్ధన్‌రెడ్డి స్టేట్‌మెంట్

2023 నవంబర్ 15 నుంచి 30వ తేదీ వరకు కొనసాగిన ఫోన్ ట్యాపింగ్ జాబితా బాధితుల్లో నాటి ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి పోటీ చేసిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పేరు ఉంది. ఈ నేపథ్యంలో స్టేట్‌మెంట్ ఇవ్వాలని పోలీసులు కోరడంతో ఆయన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఎన్నికల ప్రచారంలో ఆయనపై జరిగిన దాడులు, కేసులపై ప్రశ్నించి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ తేదీలకు, జరిగిన దాడుల కేసులకు సరిపోతుందని విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడించారు.

కోర్టులో సాక్ష్యం చెబుతా: మహిపాల్ రెడ్డి

సిట్ అధికారుల ఎదుట వాంగ్మూలం ఇచ్చి వెళ్తున్న సమయంలో మహిపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'గత ప్రభుత్వం 8 నెలల పాటు నా ఫోన్ ట్యాప్ చేసింది. ఎన్నికల సమయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి 14 మంది ఎమ్మెల్యేల ప్రచారాన్ని నేను పర్యవేక్షించా. నా ఫోన్ ట్యాప్ చేసి నన్ను ఇబ్బందులు పెట్టారు. నా ఫోన్‌లో ఉన్న నంబర్ల ఆధారంగా ఎంతో మంది ఫోన్లు ట్యాప్ చేశారు. నా వాహనం వెంట నెంబర్‌ప్లేట్ లేని పోలీస్ వాహనంలో నిరంతరం పోలీసులు తిరిగేవాళ్లు. అప్పటి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. తప్పు చేసిన వారిని వదలొద్దు. కోర్టుకు వచ్చి సాక్ష్యం చెబుతానని సిట్ అధికారులకు చెప్పాను' అని తెలియజేశారు.


సిట్ ఎదుట విచారణకు వెళ్తున్న మహిపాల్‌రెడ్డి

జీవో ఇచ్చినంత మాత్రాన మెడికల్ కాలేజీ అవదు

- భవనాలు, సిబ్బంది, మౌలిక వసతులు ఉండాలి
- హరీశ్ రావుకు మంత్రి దామోదర కౌంటర్



హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయటం అంటే కేవలం జీవో జారీ చేయడం కాదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఘాటుగా వ్యాఖ్యానించారు. వైద్య కళాశాల అంటే భవనాలు, ఎంబీబీఎస్ సీట్లకు తగ్గట్టుగా ఆస్పత్రి, బోధన సిబ్బంది, ఇతర మౌలిక వసతులు ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. నూతన వైద్య కళాశాలలపై మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ఆరోపణలకు బదులిస్తూ సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం గాల్లో మేడలు కట్టి, కాగితాలపై కాలేజీలను చూపించి, వైద్య విద్యను నాసిరకంగా చేసింది మీరు కాదా? అంటూ నిలదీశారు. సౌకర్యాలు లేవంటూ ఇప్పుడు నోటీసులు రాగానే దొంగ ఏడుపులు ఏడుస్తూ, పిల్లలను తల్లిదండ్రులను భయాందోళనకు గురిచేసేలా ట్వీట్లు చేస్తున్నారని మండిపడ్డారు. హరీశ్‌రావు హయాంలో సరైన ప్రణాళిక లేకుండా కాలేజీలు ప్రారంభించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని మంత్రి ఆరోపించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం ఈ లోపాలను సరిదిద్దేందుకు కృషి చేస్తోందని తెలిపారు. "ప్రతి మెడికల్ కాలేజీకి అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే కాకుండా, ఒక్క ఎంబీబీఎస్ సీటు కూడా నష్టపోకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుంది" అని ఆయన స్పష్టం చేశారు.


హెచ్ఎం సమక్షంలో కుమార్తెను స్కూల్‌లో చేర్పిస్తున్న ఎస్‌జీటీ సయ్యద్

ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాల జోరు

- అడ్మిషన్లలో కల్వాల ప్రాథమిక పాఠశాల రికార్డు
- మూడు రోజుల్లో విద్యార్థుల సంఖ్య రెట్టింపు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతూ మూత పడే స్థితికి చేరుకుంటుండగా... అందుకు భిన్నంగా మహబూబాబాద్ జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జిల్లాలోని కేసముద్రం మండలం కల్వల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మూడు రోజుల క్రితం వరకు 65 ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 130కి చేరింది. ఒకప్పుడు ప్రైవేట్ పాఠశాలలపై ఆధారపడిన తల్లిదండ్రులు కూడా ఇప్పుడు ధైర్యంగా తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకాన్ని మళ్లీ పెంచేలా చేసింది. నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఎస్ కె.సయ్యద్ తన కూతురును ఇదే పాఠశాలలో ఐదో తరగతిలో చేర్పించారు. గూడూరులో వీఆర్‌ఏగా పనిచేస్తున్న పెసర మహేష్ తన కుమారుడు వర్షిత్‌ను ఒకటో తరగతిలో, పాలేరు నవోదయ పాఠశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న పెద్దారపు సంపత్ తన కూతురు స్మృతికను రెండో తరగతిలో చేర్పించడం గమనార్హం. ప్రభుత్వం అందించే యూనిఫాంతో పాటు హెచ్ఎం కళ్లెం వీరారెడ్డి తన సొంత ఖర్చులతో వారంలో రెండు రోజులు ధరించే ప్రత్యేక యూనిఫాంను విద్యార్థులకు అందజేశారు. అలాగే రూ. 40 వేలు వెచ్చించి కార్పొరేట్ స్కూల్ తరహాలో పాఠశాలకు రంగులు వేయించారు. గ్రామ పెద్దల సహకారంతో, ఉపాధ్యాయుల సమష్టి కృషితో తల్లిదండ్రుల నమ్మకాన్ని పొందామని హెచ్ఎం కళ్లెం వీరారెడ్డి తెలిపారు.

వైద్యం వికటించి జిమ్ ట్రైనర్ మృతి

- ఆర్ఎంపీ క్లినిక్ ఎదుట మృతుడి బంధువుల ఆందోళన
- బొల్లారం రిసాలబజార్‌లో ఘటన


జ్ఞానేశ్వర్ (ఫైల్)

తిరుమలగిరి జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ట్రిక్ సమస్యకు ఆర్ఎంపీ వైద్యుడు చేసిన చికిత్స వికటించి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. బొల్లారం రిసాల బజార్‌కు చెందిన జ్ఞానేశ్వర్ కుమార్ (22) జిమ్ ట్రైనర్. అయితే, ఆదివారం రాత్రి బిర్యాని తిన్న అనంతరం జ్ఞానేశ్వర్‌కు గ్యాస్ట్రిక్ సమస్య తలెత్తింది. దీంతో స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు వంశీ నిర్వహించే క్లినిక్‌కు వెళ్లాడు. వైద్యుడు ఇంజక్షన్ ఇవ్వడంతో ఇంటికి వచ్చిన జ్ఞానేశ్వర్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అతన్ని కంటోన్మెంట్ ఆసుపత్రికి తరలించగా ఆక్సిజన్ సపోర్ట్ లేకపోవడంతో వేరే ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. దాంతో బంధువులు అల్వాల్ రైతుబజార్ సమీపంలోని ఓజోన్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆగ్రహానికి గురైన జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు వైద్యుడి క్లినిక్‌పై దాడి చేశారు. వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ మూలంగానే అతను మృతి చెందాడని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బొల్లారం పోలీసులు.. వంశీని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తులో ఉంది. కాగా, గతంలో భవాని క్లినిక్ పేరుతో ఉన్న ఇదే ఆర్ఎంపీ.. ఓ క్లినిక్‌ను నిర్వహించగా మేడ్చల్ డీఎంహెచ్ఓ అధికారులు సీజ్ చేశారు. అయితే, ఇటీవలే ఈ క్లినిక్‌ను మళ్లీ తెరిచారు.

21న మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న అడ్లూరి

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గంలోకి ఇటీవల కొత్తగా వచ్చిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈనెల 21న మంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. సచివాలయంలోని మొదటి అంతస్తులో తనకు కేటాయించిన చాంబర్‌లో 21న ఉదయం బాధ్యతలు చేపట్టనున్నారు.

వ్యాపార విస్తరణ ప్రాజెక్టుల్లో వేగం పెరగాలి

- జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదు: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టుల్లో మరింత వేగం పెరగాలని, జాప్యం జరిగితే ఉపేక్షించబోమని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ హెచ్చరించారు. సంస్థ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన సోలార్ విద్యుత్, పవన విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్, జియో థర్మల్ విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ తదితర 28 రకాల ప్రాజెక్టులు, పనులపై ఆయన సంబంధిత అధికారులతో వీడియో సమావేశంలో చర్చించారు. సంస్థకు ఈ వ్యాపార విస్తరణ చర్యలు ఎంతో అవసరమని, పనులను మరింత వేగవంతం చేయాలని కోరారు. ఇకపై ప్రతివారం బొగ్గు ఉత్పత్తిపైనే కాకుండా ప్రత్యేకంగా వ్యాపార విస్తరణ ప్రాజెక్టులపై కూడా సమీక్ష ఉంటుందని ఎన్.బలరామ్ స్పష్టం చేశారు.



శ్రీవారి సేవలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్

తిరుమల, జూన్16(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి పీయూష్ గోయల్ సోమవారం ఉదయం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో గోయల్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి చిత్రపటం, క్యాలెండరు, డైరీ అందజేశారు.

'ధరణి'పై ఫోరెన్సిక్ ఆడిట్ మొదలు!

కేరళ ప్రభుత్వ సంస్థ కేఎస్ఏఏసీకి బాధ్యతలు.. ప్రయోగాత్మకంగా సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో ఆడిట్

- అక్కడి ఫలితాలు చూసి రాష్ట్రవ్యాప్తంగా అనుమతిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ ఆధారంగా జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు ఫోరెన్సిక్ ఆడిట్ మొదలు కానుంది. కేరళ ప్రభుత్వ సంస్థ అయిన కేరళ సెక్యూరిటీ ఆడిట్ అండ్ అస్యూరెన్స్ (కేఎస్ఏఏసీ) ఈ ఆడిట్ నిర్వహించనుంది. 2020 అక్టోబరు నుంచి 2023 డిసెంబరు వరకు జరిగిన ధరణి లావాదేవీలు, ముఖ్యంగా హైదరాబాద్ హెచ్ఎండీఏ పరిధిలో నిషేధిత జాబితాలోని భూములను సాఫ్ట్‌వేర్‌ను అనుకూలంగా మార్చుకొని రాత్రికి రాత్రే అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న వ్యవహారంపై శాస్త్రీయ కోణంలో విచారణ చేయించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

డిసెంబరు నాటికి పూర్తి..

కేఎస్ఏఏసీ రెండు జిల్లాల ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను 4 నెలల్లో ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిసింది. ధరణి పోర్టల్ నిర్వహణ చేపట్టిన టెర్రాసిస్ సంస్థ ఇచ్చిన రికార్డుల ఆధారంగా ఆడిట్ చేయనున్నట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారాన్ని 4 నెలల్లో ముగించి.. ఆ తరువాత రెండు, మూడు నెలల్లో మిగిలిన జిల్లాల్లో ఉన్న భూ రికార్డులను ఆడిట్ చేయనున్నట్లు తెలిసింది. మొత్తం మీద డిసెంబరు నాటికి ఫోరెన్సిక్ ఆడిట్ ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందించేలా కేరళ సంస్థ ప్రతిపాదనలు ఇచ్చినట్లు సమాచారం.

ఈ నేపథ్యంలోనే విదేశీ సంస్థలు కాకుండా స్వదేశీ సంస్థల ద్వారానే ఆడిట్ చేయాలని టెండర్లు పిలిచింది. నాలుగు సంస్థలు టెండర్లలో పాల్గొనగా.. కేరళకు చెందిన కేఎస్ఏఏసీ వైపు ప్రభుత్వం మొగ్గు చూపింది. సెక్యూరిటీ ఆడిట్, ఫోరెన్సిక్ ఆడిట్ కోసం రెవెన్యూ రికార్డులను అప్పగించాలని సదరు సంస్థ కోరగా.. రికార్డుల గోప్యత గురించి హామీనివ్వాలని ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలోనే ఆడిట్ నిర్వహణకు రూ.80 లక్షలకు పైగా ఖర్చవుతుందని కేఎస్ఏఏసీ కోట్ చేయగా.. అంత మొత్తం ఇవ్వలేమని.. పునఃపరిశీలన చేసి మరో ప్రతిపాదన ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. దీనిపై ఆ సంస్థ రెవెన్యూ మంత్రి, ఉన్నతాధికారులతో పలుమార్లు భేటీ అయింది. తొలుత రెండు చిన్న జిల్లాలను ఎంపిక చేసుకుని.. వచ్చిన ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఆడిట్ చేయాలని ప్రభుత్వం సూచించింది. దీంతో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఫోరెన్సిక్ ఆడిట్ చేసేందుకు కేఎస్ఏఏసీ సిద్ధమైనట్లు తెలిసింది. అందుకు అవసరమైన రికార్డులను సీసీఎల్ఏ అధికారులు సంస్థకు అందించినట్లు సమాచారం.

లక్షల ఎకరాలు చేతులు మారినట్లు ఆరోపణలు

2014-2023 మధ్య కాలంలో లక్షలాది ఎకరాల అటవీ, దేవాదాయ, వక్ఫ్, భూదాన్ భూములు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో అసైన్డ్ భూములు 22.68 లక్షల ఎకరాలుండగా.. ఇవి కూడా మాయమైపోయాయి. 2017 సెప్టెంబరు భూరికార్డుల నవీకరణకు ముందు పట్టా భూములు 1.30 కోట్ల ఎకరాలుంటే 2020 అక్టోబరు 23 నాటికి ఈ లెక్క 1.55 కోట్ల ఎకరాలకు చేరింది. పట్టా భూముల జాబితాలో ఏకంగా 25 లక్షల ఎకరాలు అదనంగా రికార్డయింది. ఈ 25 లక్షల ఎకరాలు అటవీ భూములా లేక దేవాదాయ భూములా, వక్ఫ్ భూములా అనేది తేలాలంటే ఫోరెన్సిక్ ఆడిట్ తప్పనిసరని ప్రభుత్వం భావించింది. భూముల లెక్కలపై అనేక అనుమానాలున్నా రికార్డుల నవీకరణ అనంతరం 2020లో ధరణి పోర్టల్‌లోకి ఎక్కించేశారు. రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు జరిగిపోయాయి. లెక్క తేలని ప్రభుత్వ, అటవీ, దేవాదాయ, అసైన్డ్ భూముల వివరాలు చూసుకోకుండా మ్యుటేషన్ చేసేయాలని గత ప్రభుత్వం నిర్ణయించడంతో ఆయా భూములు శాశ్వతంగా అటవీ, దేవాదాయ, వక్ఫ్ రికార్డుల నుంచి కనుమరుగయ్యే పరిస్థితి తలెత్తిందనే వాదన ఉంది. వందల ఎకరాల భూదాన్ భూముల రికార్డులు ట్యాంపర్ అయినట్లు వార్తలు రావడంతో.. ఆ వివరాలను తేల్చేందుకు ప్రస్తుతం సీసీఎల్ఏలో ఓ అధికారిని ప్రభుత్వం నియమించింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2023 కాంగ్రెస్ అధికారం చేపట్టే వరకు అర్ధరాత్రి జరిగిన రిజిస్ట్రేషన్ల నుంచి భూములు ఎవరి చేతుల్లోకి మారాయో ఆ వివరాలు ప్రజల ముందు పెడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఫోరెన్సిక్ ఆడిట్‌కు ప్రాధాన్యత ఏర్పడింది.

జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు వరద

- నారాయణపూర్‌లో రెండు గేట్లు ఎత్తివేత


వరద నీటితో జూరాల జలాశయం

హైదరాబాద్, ధరూరు/దోమలపెంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులకు సోమవారం ఇన్‌ఫ్లోలు పెరిగాయి. కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టులో రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల జలాశయంలో ఇన్‌ఫ్లోలు పెరగడంతో 317.780 మీటర్లకు 8.184 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా జెన్‌కో జలవిద్యుత్ కేంద్రానికి 23,957 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ 2.702 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 25,835 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి 35,796 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకుగాను 842.40 అడుగుల్లో 65.4574 టీఎంసీల నీటి నిల్వ నమోదు అయినట్లు డ్యాం అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 9 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా... 1,954 క్యూసెక్కులు జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా, 900 క్యూసెక్కులను కాలువ ద్వారా వదులుతున్నారు. ఇక గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద స్వల్పంగానే వస్తోంది.


బిల్లుల కోసం బడికి తాళం వేసి కాంట్రాక్టర్ ఆందోళన

- ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం
- చివరికి పోలీసుల జోక్యంతో తెరుచుకున్న పాఠశాల


శ్రీనివాస్ ఒంటిపై పెట్రోల్ పోసుకుంటుండగా డబ్బాను లాగేస్తున్న స్థానికులు

ఖానాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : చేసిన కాంట్రాక్ట్ పనుల తాలూకు బిల్లులు మంజూరు చేయాలంటూ ఓ కాంట్రాక్టర్ తాను నిర్మించిన పాఠశాలకు తాళం వేసి ఆత్మహత్యకు యత్నించిన ఘటన నిర్మల్ జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. ఖానాపూర్ మండలం రాజుర గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస్ కాంట్రాక్టర్. ఇతను గత ప్రభుత్వ హయాంలో గ్రామంలోని పాఠశాలలో రూ. 37 లక్షల నిధులతో భవనాన్ని నిర్మించగా.. రూ. 14 లక్షల బిల్లులు చేతికి వచ్చాయి. మిగిలిన రూ. 23 లక్షల బిల్లులు మూడేళ్లుగా మంజూరు కాలేదు. దీంతో కొద్ది రోజులుగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో సోమవారం పాఠశాల వద్దకు వచ్చి.. తనకు చెల్లించాల్సిన బిల్లులు వచ్చే వరకూ పాఠశాల భవనంలోకి ఎవరినీ వెళ్లనిచ్చేది లేదంటూ తాళం వేసి.. ఆందోళన చేశాడు. ఆ తర్వాత గేటు బయట పెట్రోల్ డబ్బాతో కూర్చున్నాడు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి.. తనకు రావాల్సిన రూ. 23 లక్షల బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశాడు. లేని పక్షంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడతానంటూ పోలీసుల ఎదుటే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. అక్కడే ఉన్న గ్రామస్థులు, పార్టీల నాయకులు అతడి చేతిలోంచి పెట్రోల్ డబ్బాను లాక్కొని పక్కన పడేశారు. పోలీసులు సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో పాఠశాల గేట్లను తెరిచాడు. అనంతరం అతడు మాట్లాడుతూ.. పాఠశాల భవన నిర్మాణానికి అప్పులు చేసి తాను తీవ్ర ఇబ్బందులు పడుతున్నానన్నారు. అధికారులు వారం రోజుల్లోపు తనకు రావాల్సిన బిల్లులను చెల్లించకపోతే.. మరోసారి పాఠశాలకు తాళం వేస్తానని హెచ్చరించి వెళ్లిపోయాడు.

రేపు సెప్టెంబరు నెల శ్రీవారి ఆర్జితసేవల కోటా విడుదల



తిరుమల, జూన్16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్లకు సంబంధించి సెప్టెంబరు నెల లక్కీడిప్ కోటాను టీటీడీ బుధవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వీటి కోసం భక్తులు 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో సేవలు పొందిన భక్తులు 20 నుంచి 22 మధ్యాహ్నంలోపు టికెట్ సొమ్ము చెల్లించి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇక, 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవ టికెట్లను విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, 11 గంటలకు శ్రీవాణి టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి టోకెన్లు జారీ చేస్తారు. 24 ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వసతి గదుల కోటాను విడుదల చేస్తారు. 25న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారిసేవ, పరకామణిసేవ, నవనీతసేవ, గ్రూప్ సూపర్‌వైజర్ల సేవల ఆగస్టు నెలా కోటాను విడుదల చేయనున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధోన్మాదం!

సత్వరమే ఆగనిపక్షంలో ఇజ్రాయెల్–ఇరాన్ ఘర్షణ అన్ని హద్దులూ దాటే ప్రమాదం ఉంది. తనకు గొప్పలు చెప్పడం ఇష్టం ఉండదని అంటూనే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో మారు ఇటీవలి భారత్–పాక్ ఘర్షణ ప్రస్తావన తెచ్చారు. తనమాట వినే ఈ రెండుదేశాలూ తక్షణమే దారికొచ్చాయనీ, అదేమాదిరిగా ఇరాన్–ఇజ్రాయెల్ కూడా ఒప్పందం కుదర్చుకోవాలనీ అన్నారు. అయితే, అది ఇప్పట్లో సాధ్యం కాదన్న సందేశం కూడా ఆయనే ఇచ్చేశారు. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట ఇజ్రాయెల్ అతి దుర్మార్గంగా ఇరాన్‌లోకి చొరబడి సైనికస్థావరాలతో పాటు యురేనియం శుద్ధి కేంద్రాలను కూడా ధ్వంసం చేస్తే, ఇరాన్‌కు మంచిశాస్తి జరిగిందని, మరిన్ని దెబ్బలు తినాల్సివస్తుందని ట్రంప్ సమర్థించుకొచ్చారు. అమెరికా ఆశీస్సులూ అండదండలతోనే ఇజ్రాయెల్ నేరుగా ఇరాన్ మీద విరుచుకుపడి, మరో కొత్తయుద్ధానికి తెరదీసిందన్నది వాస్తవం. ఇరాన్‌ను గాజా తరహాలో దుంపనాశనం చేసిన తరువాతే ఒప్పందాల సంగతని ట్రంప్ వ్యాఖ్యల్లో మర్మం.

యుద్ధం ఎంతకాలం సాగుతుందన్నది ఇరాన్ సైనికపాటవం మీద ఆధారపడివుంది. హమాస్ దాడికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ అనేక పక్షాలతో ఏకకాలంలో యుద్ధం చేస్తూ వచ్చింది. అక్టోబర్ 7ఘటనకు ముందువరకూ ఇరాన్‌కు రక్షణకవచాల్లాగా వ్యవహరిస్తూవచ్చిన హమాస్, హిజ్బొల్లాలు ఇజ్రాయెల్ దెబ్బకు గట్టిగా ఎదురుదెబ్బతీయలేని స్థితికి జారుకున్నాయి. యెమెన్‌లో హౌతీలను బలహీనపరచడంలోనూ ఇజ్రాయెల్‌దే పైచేయి అయింది. గత ఏడాది ఏప్రిల్, అక్టోబర్‌లలో ఇరాన్‌మీద జరిపిన దాడి ఇజ్రాయెల్‌కు ఒక ట్రయల్‌రన్‌లాగా ఉపకరించిందని అంటారు. అయితే, అప్పుడూ ఇప్పుడూ కూడా ఇరాన్ జవాబు గమనించినప్పుడు దానిదగ్గర డ్రోన్లు, క్షిపణులు ఇత్యాది ఆయుధాలు దండిగానే ఉన్న విషయం అర్థమవుతోంది. అయితే, అవన్నీ హరించుకుపోయాక ఇరాన్ నిస్సహాయంగా చేతులెత్తేసి శత్రువుల ముందు సాగిలబడుతుందని ఎవరూ నమ్మడం లేదు. అమెరికా–ఇజ్రాయెల్ పరిభాషలో చెప్పాలంటే, నిరంకుశులైన ఇరాన్ పాలకులు అంత సునాయాసంగా దేశాన్ని అప్పచెబుతారనుకోలేం. అమెరికా సైనిక స్థావరాలమీద దాడులు చేసి దానిని యుద్ధబరిలోకి లాగి ఇస్లామిక్ దేశాలను ఇరుకునపెట్టే ప్రయత్నం కూడా పద్ధతి ప్రకారం జరగవచ్చు. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధాన్ని ప్రశ్నించనందుకు ఇప్పటికే ప్రజాగ్రహాన్ని చవిచూస్తున్న అమెరికా మిత్రదేశాలకు మరో కొత్త పరీక్ష మొదలవుతోంది.


ఇరాన్‌తో అణుఒప్పందం కోసం ఒకపక్క చర్చలు సాగుతూండగా, ఇజ్రాయెల్‌తో మరోపక్క దాడిచేయించి గొప్ప ఎత్తువేశానని ట్రంప్ అనుకొని ఉండవచ్చు. మెట్టుదిగేది లేదని ఇరాన్ పాలకులు భీషణ ప్రతిజ్ఞలు చేస్తున్నా, వారిని గద్దెదించేవరకూ వదిలేది లేదని ఇజ్రాయెల్ కూడా అంటోంది. అనేక అణుబాంబులు సిద్ధంచేయగల స్థితిలో ఉన్నదని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇరాన్, ఈ ఇజ్రాయెల్ దాడి తరువాత, వీసమెత్తు అవకాశం ఉన్నా అణుబాంబు తయారీని వదులుకోదన్నది వాస్తవం. అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు ఇరవై యేళ్ళ తరువాత ఒక్కసారిగా ఇరాన్ అతిభయంకరంగా ఎందుకు కనిపించిందో తెలియదు.

అణుబాంబులున్నాయన్న ఆరోపణతో, బ్రిటన్ వంటి తొత్తులను వెంటేసుకొని ఇరాక్‌లో సద్దాం హుస్సేన్‌ను కూల్చింది అమెరికా. ఇరాక్‌లో ప్రజారంజకమైన పాలనేమీ జరగడంలేదు కానీ, అమెరికా అనుకూల పాలనతో అమెరికా కంపెనీలు చక్కగా చమురు తోడుకుంటూ అప్పటి యుద్ధం లక్ష్యాన్ని నెరవేర్చుతున్నాయి. సద్దాం మరణానంతర పరిస్థితులు ఐసిస్‌వంటి ఉగ్రసంస్థల ఆవిర్భావానికి దోహదం చేసి, ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టేసిన సంగతి తెలిసిందే. ప్రజాస్వామ్యాన్ని ప్రతిష్ఠించే పేరిట తమకు గిట్టని, తమ మాటవినని వారిని మట్టుబెట్టడం అమెరికాకు అలవాటే. ఖమేనీలను కూల్చి ఇరానియన్లకు అతిత్వరలో విముక్తి ప్రసాదిస్తానని నెతన్యాహూ వీరంగం వేస్తున్నారు. ఇరాన్ పాలకులను కూల్చడమంటూ జరిగితే, తదనంతరకాలంలో మిగతా ప్రపంచం ఏ కొత్త ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందన్నదే భయం. ఇజ్రాయెల్‌ను ప్రపంచపటం నుంచి చెరిపేస్తారన్న ఆరోపణతో ఇరాన్‌పాలకుల మీద విరుచుకుపడిన నెతన్యాహూ వరుస యుద్ధాలతో తన ఎజెండా కొనసాగిస్తూ ప్రపంచాన్ని కష్టాల్లోకి నెట్టేస్తున్నారు. తాను యుద్ధవ్యతిరేకిననీ, అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని యుద్ధాలనూ ముగించేస్తానని హామీ ఇచ్చిన ట్రంప్, పూర్తిభిన్నంగా కొత్తకుంపట్లు రగిలిస్తున్నారు.

ఉగ్రవాదం ఒక మతాన్ని మించినది!

భారత్ ఒక్కటే ఉగ్రవాద సమస్య ఎదుర్కొంటోందని, దీనికి హిందువులు అధికంగా బలవుతున్నారన్న ప్రచారం బలంగా ఉంది. వాస్తవానికి గణాంకాల ప్రకారం: ఉగ్రవాదం వల్ల మరణించినవారిలో అత్యధికులు ముస్లిం మతస్థులే, ఈ మరణాలు ఇండియాలో కంటే పాకిస్థాన్‌లోనే ఎక్కువ. పాకిస్థాన్‌లోని బెలూచిస్థాన్ వగైరా ప్రాంతాల్లోని 'ముస్లిం ఉగ్రవాదులు' పాకిస్థాన్ ప్రభుత్వంపై దాడి చేస్తున్నారు. ఇండియాలో కూడా ఉగ్రవాదం, దాని అణచివేత పేరుతో సాగిన కార్యకలాపాల వల్ల మరణించిన అత్యధికులు ముస్లింలే. నాగాలాండ్, అస్సాం, పంజాబ్, మణిపూర్ తదితరచోట్ల కొనసాగుతున్న ఉగ్రవాదానికీ ముస్లిం మతానికీ సంబంధం లేదు. లోగడ అస్సాంలోనూ, ఎల్‌టీటీఈ కాలంలో తమిళనాడులోనూ, నేడు మణిపూర్‌లోనూ ఉగ్రవాదుల్లో అత్యధికులు హిందువులే. కశ్మీర్‌లో నేటివరకూ లక్షమంది ప్రజలు చంపబడ్డారని అంచనా. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాలుగువేలమంది అని పార్లమెంటులో ప్రకటించారు. సంఖ్య ఎంతైనా, వీరిలో 90శాతం ముస్లింలే. భారత, పాకిస్థాన్ దేశాల్లోని పాలకులు ఉగ్రవాదాన్నీ, మతాన్నీ మేళవించి వాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకానీ, అది కేవలం హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలు సాగిస్తున్నది కాదన్నది సుస్పష్టం.

బ్రిటిష్ వారి నుంచి స్వాతంత్ర్యం పొందినప్పుడు భారతదేశం మతం ఆధారంగా గాక భాషాజాతులకు స్వయం నిర్ణయాధికారం ఉండే రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సింది; ఈ భాషాజాతులు ఐచ్ఛికంగా ఒక ప్రజాస్వామిక కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సింది. అలా జరిగివుంటే ఉపఖండంలో ఐక్యత, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, మతసామరస్యం పరిఢవిల్లేవి. పంజాబ్, బెంగాల్, కశ్మీర్లతో పాటు బహుజాతుల భారత్ ఐక్యంగా వుండి, కొనసాగి, బలపడేది. కానీ, జిన్నా వంటి ముస్లిం లీగ్ నాయకులూ, సావర్కర్ వంటి హిందుత్వశక్తులూ మతం ఆధారంగా ఉపఖండ ప్రజలు 'రెండు జాతుల' వారన్న అవాస్తవ, అశాస్త్రీయ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులూ, వారిపైన ఆధారపడిన ఉపఖండంలోని బడా పెట్టుబడిదారులు, ఫ్యూడల్ శక్తులూ ఈ సిద్ధాంతాన్ని స్వప్రయోజనాలకు వాడుకున్నారు. వారి కోసమే నెహ్రూ, పటేల్ తదితర నాటి కాంగ్రెస్ నాయకులూ దీన్ని ఆమోదించారు. అంతా కలిసి, మతప్రాతిపదికపై, భారత్ – పాకిస్థాన్ అనే రెండు రాజ్యాలను ఏర్పాటు చేసారు. ఈ రెండు రాజ్యాలలోని కశ్మీర్, బెంగాల్, పంజాబ్, ఈశాన్య భారత్ తదితర జాతుల ప్రజలు తమకు స్వయం నిర్ణయాధికారం/ స్వయం ప్రతిపత్తి కావాలని, లేదా రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు కావాలనీ ఆనాటి నుండీ పోరాడుతూనే ఉన్నారు. ఈ ప్రజల పోరాటాలన్నింటినీ 'ఉగ్రవాదం' అని ముద్ర వేసి, పాశవికంగా అణచివేసే నిరంకుశ విధానాలు అమలు చేయడంవల్ల సమస్య పరిష్కారం కాదని అనుభవాలు చెబుతున్నాయి.



ఇండియాలో కూడా ఉగ్రవాదం, దాని అణచివేత పేరుతో సాగిన కార్యకలాపాల వల్ల మరణించిన అత్యధికులు ముస్లింలే. నాగాలాండ్, అస్సాం, పంజాబ్, మణిపూర్ తదితరచోట్ల కొనసాగుతున్న ఉగ్రవాదానికీ ముస్లిం మతానికీ ఏ విధమైన సంబంధం లేదు. అయినప్పటికీ ఉగ్రవాదులంతా ముస్లింలేనని ప్రచారం సాగుతోంది.

దీనికితోడు అమెరికా, రష్యా అగ్రరాజ్యాల మధ్య జరిగిన ప్రచ్ఛన్న యుద్ధం ఇండియా, పాకిస్థాన్‌ల మధ్య బంగ్లాదేశ్ యుద్ధంగా పరిణమించింది. రష్యా అగ్రరాజ్యానికి లోబడిన విధానాలను భారత పాలకులు, అమెరికా అగ్రరాజ్యానికి లోబడిన విధానాలను పాకిస్థాన్ పాలకులు అనుసరించారు. ఆఫ్ఘనిస్థాన్‌పై రష్యా దురాక్రమణ, అమెరికా అక్కడ తన ప్రాబల్యంకోసం తాలిబాన్, అల్‌ఖైదా వంటి సాయుధశక్తులను పెంచిపోషించడం, దానికి పాకిస్థాన్‌ను వాడుకోవటం వంటి పరిణామాలు దక్షిణాసియాలో ఉగ్రవాదానికి ఆజ్యం పోసాయి. ఒకవైపు బంగ్లా యుద్ధంతో పాకిస్థాన్ విచ్ఛిన్నం, మరోవైపు స్వయం నిర్ణయాధికారం కావాలని పోరాడుతున్న కశ్మీర్ జాతిప్రజలపై భారత ప్రభుత్వ దమనకాండ, ఇస్లాం ఉగ్రవాదం అణచివేత పేరిట అమెరికా గ్లోబల్ యుద్ధం, దీనికి ఇండియా, పాక్ ఇరుదేశాల పాలకుల మద్దతు– వీటన్నిటి పర్యవసానంగా ఉగ్రవాదశక్తులూ, వాటికి పాకిస్థాన్ మద్దతూ బలపడుతూ వచ్చాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వారసత్వం కొనసాగిస్తూ, దక్షిణాసియాలో భారత పాలకులు అనుసరిస్తున్న విస్తరణవాద విధానాలు కూడా ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

కశ్మీర్‌లో స్వయం నిర్ణయాధికారం కోసం కశ్మీరీ పండిట్లు కూడా లోగడ ఉద్యమాల్లో పాల్గొన్నారు. తర్వాతి కాలంలో పాలకులు దాన్ని మతపరంగా మలచటానికి ప్రయత్నించారు. నిజానికి నాటి కశ్మీర్ రాజు "కేంద్రానికి మూడే అధికారాలు, కశ్మీర్ జాతి ప్రజలకే ఇతర అన్ని అధికారాలు" వుండే షరతుపై ఇండియాలో చేరటానికి సంతకం చేసారు. కనీసం ఆ మేరకైనా స్వయంప్రతిపత్తిని అమలు చేయాలని కశ్మీర్ ప్రజలు, శాసనసభ కోరుతుంటే అంగీకరించకుండా అణచివేత విధానాలనే కొనసాగిస్తుండటం వల్ల సమస్య జటిలమవుతోంది. కశ్మీర్ స్వయంప్రతిపత్తిని ఆచరణలో కాంగ్రెస్ పాలకులూ, ఆర్టికల్–370 రద్దు పేరుతో బీజేపీ పాలకులూ లాగివేయటం, కశ్మీర్‌ను మూడు ముక్కలుగా, కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించటం– ఇవన్నీ ఉగ్రవాదానికి ఆజ్యం పోస్తున్నాయి.

భారత పాకిస్థాన్ దేశాల పాలకులు ఇరువురూ స్వతంత్రంగా చర్చల ద్వారా అన్ని సమస్యలకూ పరిష్కారం సాధించుకోవాలి. తన చైనా–వ్యతిరేక ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగంగా, దక్షిణాసియాలో తన పట్టు, ప్రాబల్యం పెంచుకోవడానికి అమెరికా అనేక కుతంత్రాలు పన్నుతోంది. అటువంటి అమెరికా తోక పట్టుకుపోవడం నష్టదాయకం. ప్రజలు చారిత్రక వాస్తవాలను అవగాహన చేసుకుని, ఉగ్రవాదాన్ని మాత్రమే గాక, మతవిద్వేషం, జాతీయ దురహంకారం, యుద్ధోన్మాదాలను కూడా బలంగా వ్యతిరేకించాలి. అదే శాంతికీ, అభివృద్ధికీ దోహదం చేస్తుంది.

○ సిహెచ్.ఎస్.ఎన్. మూర్తి
ప్రధాన కార్యదర్శి, ఎఫ్.ఐ.టి.యు

చరిత్ర సృష్టించిన 'దౌత్య విజయం'

ప్రపంచంలో సుస్థిరమైన శాంతిని నెలకొల్పాలన్న పరమాశయంతో 'పంచశీలాలు' రూపొందించిన దేశం– భారత్. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విదేశాంగ వ్యవహారాల శాఖను తన వద్దనే ఉంచుకొన్నారు. భారతదేశ సంప్రదాయాలు, చరిత్ర, తత్త్వశాస్త్ర విధానాలను విదేశాలకు తెలియజెప్పి సమభావం, పరస్పర సహకారంతో ప్రపంచ దేశాలతో భారత్ సహజీవనం చేయాలనుకొంటున్నట్లు నెహ్రూ పలు అంతర్జాతీయ వేదికలపై నుంచి చెప్పేవారు. ఇందుకు అనుగుణంగానే ఏ దేశానికీ అనుకూలం కాని తటస్థ వైఖరిని భారతదేశం అనుసరించింది. ఏ కూటమితోనూ పొత్తు కుదుర్చుకోకుండా తటస్థంగా ఉన్న దేశాలే ప్రపంచంలో శాంతి వాతావరణాన్ని సృష్టించగలవని ప్రధాని నెహ్రూ తరచుగా చెప్పేవారు.

తొలుత నెహ్రూ అనుసరించిన విదేశాంగ విధానం విమర్శల పాలైంది. అనివార్యంగా సాంకేతిక పరిజ్ఞానం కోసం సోవియెట్ రష్యాతో చెలిమి చేయాల్సి రావడం వల్ల చాలాకాలం అమెరికాలోని అధికార వర్గాలు భారతదేశం పట్ల విరోధభావాన్ని ప్రకటించాయి. అంతేకాకుండా శాంతికి, ప్రజాస్వామ్యానికి మరో రూపం అంటూ పాకిస్థాన్‌ను అమెరికా భుజాలకెత్తుకొని మోసింది. అయితే.. కెన్నెడీ అధ్యక్షుడయ్యాక భారత్ పట్ల అమెరికా వైఖరి క్రమంగా మారింది. భారతదేశం అనుసరించే తటస్థ వైఖరి శక్తివంతమైనదనీ, భారతీయులు ప్రచ్ఛన్నయుద్ధంతో సంబంధం పెట్టుకోకపోయినా శాంతికి, స్వాతంత్ర్యానికి బద్ధులై ఉంటారని జాన్.ఎఫ్.కెన్నడీతో సహా నాటి పలువురు దేశాధినేతలు భారత్ విదేశాంగనీతిని కొనియాడారు.

నెహ్రూ తర్వాత దేశానికి ప్రధానులైన లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ అదే పథాన్ని అనుసరించారు. ప్రపంచంలోని చిన్న దేశాలు, బలహీన దేశాలు, అభివృద్ధి చెందుతున్న తృతీయ దేశాలు.. తప్పనిసరిగా అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక సహాయం లేకుండా తమంతట తాముగా అభివృద్ధి చెందలేవు. కాబట్టి ఆనాడు మూడు శక్తివంతమైన పక్షాలుగా విడిపోయి ఉన్న ఉత్తర అమెరికా, యూరప్, సోవియెట్ యూనియన్ల సహాయ సహకారాలు పొందడం అవసరం. అయితే ఏదో ఒక పక్షంలో చేరితే, మిగతా రెండు పక్షాల నుంచి దూరం కావాల్సి వస్తుంది. కాబట్టి, తటస్థంగా ఉన్నప్పుడు ఆ పక్షాల మధ్య పరస్పరం ఉన్న వైరుధ్యాలకు సంబంధం లేకుండా ఈ దేశాలు అందరి సహాయ సహకారాలు పొందవచ్చునని 'పండిట్ నెహ్రూ' చేసిన సూత్రీకరణకు అనేక దేశాలు ఆమోదం తెలిపాయి. పండిట్ నెహ్రూ, నాటి ఈజిప్ట్ ప్రధాని నాసర్, నాటి యుగోస్లేవియా మార్షల్ టిటోల చొరవ కారణంగానే అలీన దేశాల కూటమి ఏర్పడింది. ఆ తర్వాత పలు దశాబ్దాల పాటు కూటమిలోని దేశాలు అన్ని పక్షాలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకొని, వాటి సహాయ సహకారాలతో అభివృద్ధి పథంలో ముందుకెళ్లాయి.



నెహ్రూ వేసిన పునాదిపై తర్వాతి కాలంలో దేశ ప్రధానులుగా ఉన్నవారు, నేటి ప్రధాని నరేంద్ర మోదీ దేశ దౌత్య విధానాన్ని, విదేశీ వ్యవహారాలను ఎటువంటి రాజీధోరణి లేకుండా మరింత సుదృఢం చేయడం అభినందనీయం. ఇదేవిధంగా దేశంలో వివిధ రాజకీయ పార్టీల మధ్య కొన్ని కీలకాంశాలలో ఏకాభిప్రాయం కుదిరితే, భారతదేశం మరింత వేగంగా అభివృద్ధిపథంలో దూసుకుపోగలదు.

నెహ్రూ అనుసరించిన విదేశాంగ విధానానికి సర్వత్రా ఆమోదం లభించింది. మొరార్జీదేశాయ్, ఆ తర్వాత మళ్లీ ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, వి.పి. సింగ్, పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజపేయి నుంచి నేటి ప్రధాని నరేంద్ర మోదీ వరకు అనుసరించే విదేశాంగ నీతిలో పెద్దగా మార్పులేదు. వారందరూ కూడా నెహ్రూ బాటలోనే తటస్థ వైఖరినే అనుసరించారు. ఆ కారణంగానే నేడు భారత్ అన్ని దేశాలతో సవ్యమైన ఆర్థిక, వాణిజ్య, దౌత్య సంబంధాలను ఏర్పర్చుకోగలిగింది. కాగా, దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లిన పరిస్థితులలో రాజకీయాలకు అతీతంగా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావడం కూడా గతం నుంచి వస్తోంది. 1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్థాన్‌తో యుద్ధం చేయాల్సి వచ్చినపుడు దేశం యావత్తూ ఒక్క గొంతుకగా మారింది. రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావులు దేశ ప్రధానులుగా ఉండగా, యునైటెడ్ నేషన్స్ సదస్సులలో పాల్గొన్న భారత్ దౌత్య బృందానికి నాటి విపక్షనేత వాజపేయి నేతృత్వం వహించారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా పాకిస్థాన్‌కు దగ్గరవ్వడానికి కృషి చేసినప్పుడు ఆయనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. అలాగే, కార్గిల్ యుద్ధం చేయాల్సి వచ్చినపుడు జాతి అంతా ఒక్కటైంది. స్వల్ప విభేదాలు మినహాయిస్తే.. పొరుగుదేశం పాకిస్థాన్ పాల్పడే క్రాస్‌బోర్డర్ టెర్రరిజంను ఖండించడంలో రెండో మాట లేకుండా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా వారికి మద్దతు తెలుపుతున్నాయి.

తాజాగా, ప్రధాని నరేంద్రమోదీ పహల్గాం ఉదంతంలో 'ఆపరేషన్ సిందూర్' నిర్వహణకు దారి తీసిన పరిస్థితులు; తదనంతరం మే 10న కాల్పుల విరమణ, ఒకవేళ మళ్లీ పాకిస్థాన్ కనుక భారత్‌లో ఉగ్రవాద చర్యలకు ఊతం ఇస్తే ఏ విధంగా జవాబు చెప్పాలనుకొంటుందో ప్రపంచ దేశాలకు వివరించేందుకు అధికార, విపక్ష ఎంపీలతో ఏర్పాటుచేసిన ఏడు అఖిలపక్షాల బృందాలను 33 దేశాలకు పంపడం.. భారత్ దౌత్యనీతిలో సాధించిన గొప్ప విజయం. ప్రారంభంలో అఖిలపక్ష బృందాల కూర్పులో వివిధ రాజకీయ పార్టీల నడుమ అభిప్రాయబేధాలు పొడసూపినా, ఆ తర్వాత అన్నీ సర్దుకొని ప్రభుత్వం–ప్రజలు ఆశించిన లక్ష్యాలు నెరవేరడం విశేషం. భారత అఖిలపక్ష బృందాలు పర్యటించిన దేశాలలో కొన్ని పాకిస్థాన్ పాటపాడేవి కూడా ఉన్నాయి. అయితే, దేశ విభజన నాటి నుంచి నేటి వరకు పాకిస్థాన్ పాల్పడుతున్న ఉగ్రవాద చర్యలు, 1999లో కార్గిల్ ఉదంతం, 2001లో భారత పార్లమెంట్‌పై జరిగిన దాడి, కాందహార్ విమాన హైజాక్, 2008లో ముంబయి మారణకాండ మొదలుకొని 'యురి' ఉదంతం, పహల్గాం దుర్ఘటనతో సహా ఎప్పుడెప్పుడు భారత్‌పై పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడిందో సమగ్రంగా వివరించారు.

ప్రధాని మోదీ ఈ చొరవ చూపడం ద్వారా రెండు విజయాలు సాధించారు. ఒకటి– ప్రపంచ దేశాలకు పాకిస్థాన్ ఉగ్రవాద రూపాన్ని బహిర్గతం చేసి అంతర్జాతీయంగా ఏకాకిని చేయడం. రెండు– మళ్లీ దాడి చేసే దుస్సాహసానికి ఒడిగడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పాకిస్థాన్‌కు గట్టిగా వార్నింగ్ ఇవ్వడం. భారత్ అఖిలపక్ష బృందాలకు నేతృత్వం వహించిన శశిథరూర్, బైజయంత్‌పాండా, అసదుద్దీన్ ఒవైసీ, కనిమొళి వంటివారు విదేశీ వేదికలపై ఎటువంటి శషభిషలు లేకుండా భారత్ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. ఉగ్రవాదంపై భారత్ జరిపే పోరాటానికి మద్దతుగా నిలుస్తామని రష్యా, జపాన్ వంటి దేశాలు విస్పష్టమైన హామీ ఇవ్వడం విశేషం.

'ఆపరేషన్ సిందూర్' ఉద్దేశాల్ని చాటిచెప్పి.. ఆయా దేశాల మద్దతు కూడగట్టడంలో మన ఎంపీలు సమర్థవంతంగా వ్యవహరించారు. దేశ భద్రత, సమగ్రతకు ముప్పు వాటిల్లే సమయంలో సంకుచిత రాజకీయాలకు తావులేదని వారు స్పష్టం చేశారు. భారత్ ఏనాడూ ఎవ్వరిమీద కాలు దువ్వలేదని, పైగా విపత్కర సమయాల్లో పొరుగు దేశాలకు అండగా నిలబడి సాయం చేసిన వైనాన్ని సమగ్రంగా వివరించారు.

నిజానికి, విదేశాంగ విధానంలో నెహ్రూ అవలంబించిన 'తటస్థత' కారణంగానే నేడు పాకిస్థాన్ మినహా అన్ని దేశాలతో.. వాటి మధ్యనున్న వైరుధ్యాలకు అతీతంగా భారత్ సన్నిహితం కాగలిగింది. వాటి సహాయ సహకారాలతో ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగగలుగుతోంది. 'భిన్నత్వంలో ఏకత్వమే మా బలం' అని భారత్ విశ్వవేదికలపై సగర్వంగా చాటుకోగలుగుతోంది. అయితే.. ఆనాడు నెహ్రూ వేసిన పునాదిపై.. తర్వాతి కాలంలో దేశ ప్రధానులుగా ఉన్నవారు, నేటి ప్రధాని నరేంద్రమోదీ దేశ దౌత్య విధానాన్ని, విదేశీ వ్యవహారాలను ఎటువంటి రాజీధోరణి లేకుండా మరింత సుదృఢం చేయడం అభినందనీయం. ఇదేవిధంగా దేశంలో వివిధ రాజకీయ పార్టీల మధ్య కొన్ని కీలకాంశాలలో ఏకాభిప్రాయం కుదిరితే, భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి పథంలో దూసుకుపోగలదు.

■ సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు

విస్మృత గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు

1940వ దశాబ్దపు ద్వితీయార్థంలో తెలంగాణలో కమ్యూనిస్టు ఉద్యమం తారస్థాయికి చేరింది. రజాకార్ల అరాచకాలకు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు దళాలు అరణ్యాల్లో గెరిల్లా యుద్ధాన్ని ప్రారంభించాయి. అప్పటి హైదరాబాద్ రాష్ట్ర పాలకుడు నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఈ దౌర్జన్యాలను అరికట్టకపోవడం వల్ల రజాకార్ల దురాగతాలకు మద్దతిచ్చినట్లయ్యింది. కమ్యూనిస్టు గెరిల్లా దళాల్లో ఒకటి ప్రస్తుత మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం అరణ్య ప్రాంతంలో రహస్యంగా పనిచేసింది. నాయికపోడు గిరిజనుడైన పసుల సీతారాములు ఈ దళంలో కీలక పాత్ర పోషించారు. జనబాహుళ్యంలోకి రావడానికి అంతగా ఇష్టపడని గిరిజనుల నుంచి ఒకరు ఇలా ఉద్యమానికి నాయకత్వం వహించడం అరుదైన విషయమే.

గార్ల, బయ్యారం సమీపంలోని పెద్దతాళ్ళగడ్డ గ్రామానికి చెందిన పసుల బుచ్చయ్య, చాసమ్మ దంపతులకు సీతారాములు జన్మించారు. తెలంగాణలోని నిజాం నిరంకుశ పాలనను చూస్తూ పెరిగి, ఆ దౌర్జన్యాలను అడ్డుకోవాలనుకున్నారు. తర్వాత ఆయన ఒక తుపాకీని సంపాదించారు. ఆ రోజుల్లో అదొక అసామాన్యమైన విషయం. తుపాకీ వాడటాన్ని నేర్చుకుని రజాకార్లు, నిజాం పోలీసులు, స్వాతంత్ర్యానంతరం భారత సైన్యం వంటి బృందాలను ధైర్యంగా ఎదిరించారు. పలుమార్లు కాల్పుల నుంచి చాకచక్యంగా తప్పించుకున్నారు. పెత్తందారీ భూస్వామ్య వ్యవస్థను వ్యతిరేకించడంలో సీతారాములు ముందుండేవారు. వాస్తవంగా గిరిజనులు కష్టపడి పనిచేసినా, ఫలితాలు మాత్రం బయటివారికే చెందేవి. ఉదాహరణకు కమ్మ సామాజిక వర్గానికి చెందిన సంగయ్య అనే వ్యక్తి గిరిజనులతో అడవిని నరికించి 'సంద్రలపోడు' అనే కొత్త గ్రామాన్ని ఏర్పాటు చేశాడు. కానీ తర్వాత ఆ గ్రామాన్ని ఉత్తర భారతీయ వ్యాపారి సంత్‌లాల్ ఆక్రమించాడు. దాంతో ఆ గ్రామం పేరు సంత్‌లాల్‌పోడుగా మారిపోయింది. కష్టపడినవారికి అందాల్సిన ఫలాలు వేరొకరు దక్కించుకోవడం అన్యాయం. అలాంటి వాటిపై సీతారాములు గట్టి పోరాటం చేశారు. కానీ భూస్వాములు, వ్యాపారులకే నిజాం పోలీసులు, రజాకార్లు మద్దతు ఇచ్చేవారు. ఈ శక్తులకు వ్యతిరేకంగా పోరాడిన సీతారాములుపై ఓసారి బయ్యారం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. అప్పుడప్పుడూ పేషీకి హాజరు కావాలంటూ ఆయన్ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించేవారు. తనకు సైకిల్ ఏర్పాటు చేస్తేనే పేషీకి వస్తానని ఏ మాత్రం బెదరకుండా వారికి జవాబిచ్చేవారు. అనంతర కాలంలో ఆయన పేషీకి వెళ్లడానికి పూర్తిగా నిరాకరించి, బహిరంగంగా తిరుగుబాటు చేశారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం కమ్యూనిస్టులపై దాడి ప్రారంభించడంతో సీతారాములు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. భారత సైన్యం ఆయన్ను వెంటాడి, ఆయన తుపాకీతో ప్రతిఘటిస్తుండగా కాల్చి చంపింది. సీతారాములు వీరగాథ క్రమంగా మరుగున పడిపోతోంది. ఆయన గురించి ప్రస్తుతం చెప్పగలిగినవారు ఆయన తమ్ముడి కుమారుడు పసుల బుచ్చయ్య మాత్రమే. గిరిజన నాయకుడైన సీతారాములు సాహసగాథ తెలంగాణ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఓ వెలుగు దివ్వెలా నిలిచిపోతుంది.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ

న్యాయ నిష్పాక్షికతపై నీడలు!

దేశ సర్వోన్నత న్యాయస్థానంలోనూ, వివిధ హైకోర్టుల్లోనూ పనిచేసిన ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులు పదవీ విరమణ తర్వాత ఏం చేయాలీ ఏం చెయ్యకూడదు అనేదానిపై ఈ మధ్య దేశవ్యాప్తంగా విస్తృత చర్చ సాగుతున్నది. భారత ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన జస్టిస్ సదాశివం 2014లో పదవీ విరమణ తర్వాత నెల రోజుల్లోనే కేరళ గవర్నర్‌గా బాధ్యతలు తీసుకోవటంతో ప్రారంభమైన రచ్చ జస్టిస్ రంజన్ గొగోయ్ 2019లో పదవీ విరమణ తర్వాత రాజ్యసభ సభ్యునిగా మార్చి 2020లో నియమితులు అవ్వటంతో మరింత పెరిగింది. సుప్రీం తొలి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీవీ కూడా పదవీ విరమణ తర్వాత తమిళనాడు గవర్నర్‌గా పదవి స్వీకరించి ఆ పదవిలో 1997 నుండి 2001 వరకు కొనసాగారు. ఆ కాలంలో గవర్నర్‌గా ఆమె నిర్ణయాలు కూడా వివాదస్పదమైనాయి. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా వున్న అబ్దుల్ నజీర్ కూడా జనవరి 2023లో పదవీ విరమణ చేసి వెన్వెంటనే అంటే ఫిబ్రవరి 12న గవర్నర్‌గా పదవీ ప్రమాణం చేశారు.

పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(7) ప్రకారం భారత భూభాగంలోని ఏ కోర్టులోనూ న్యాయవాదిగా వ్యవహరించకూడదు. అలాగే ఆర్టికల్ 220 ప్రకారం పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తి తాను పని చేసిన హైకోర్టు మినహా మిగిలిన హైకోర్టులలోగాని, సుప్రీంకోర్టులో గాని న్యాయవాదిగా పని చేయవచ్చు; కానీ మరే ఇతర కిందస్థాయి కోర్టుల్లో న్యాయవాదిగా వ్యవహరించకూడదు. న్యాయవాదులుగా పనిచేయటం విషయంలో స్పష్టత ఇచ్చిన రాజ్యాంగం గాని, ఇతర న్యాయ చట్టాలు గాని అధికార పదవుల విషయంలో మౌనం దాల్చాయి. నిజానికి 2014కి ముందు పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఎవరూ ఏ విధమైన పదవీ స్వీకరించలేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పనిచేసినవారు రాజ్యసభ సభ్యత్వానికి, గవర్నర్ పదవికి ఆశపడే రోజులు వస్తాయని రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరు.

నిజానికి 2014కి ముందు పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఎవరూ ఏ విధమైన పదవీ స్వీకరించలేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పనిచేసినవారు రాజ్యసభ సభ్యత్వానికి, గవర్నర్ పదవికి ఆశపడే రోజులు వస్తాయని రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరు.



ఇక్కడ ఇంకో ఆసక్తికర విషయం కూడా ప్రస్తావించాలి. భారతదేశంలో అత్యంత విస్తృత జీవితం గడిపి బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా; అంతర్జాతీయ కోర్టులో న్యాయమూర్తిగా; గవర్నర్‌గా; వైస్ ఛాన్సలర్‌గా; అమెరికా, ఇంగ్లాండ్, క్యూబా, స్పెయిన్, ఐర్లండ్ దేశాల్లో భారత రాయబారిగా నెహ్రూ మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా; ఇందిరాగాంధీ మంత్రివర్గంలో విదేశాంగ శాఖా మంత్రిగా; అనేక కమిటీలకు, కమిషన్లకూ ఛైర్మన్‌గా; లా కమిషన్ సభ్యునిగా; ఐరాసలో భారత ప్రతినిధిగా; స్వతంత్ర భారతదేశంలో ముద్రా కుంభకోణం గుట్టుమట్టులు వెలికితీసిన అత్యంత నిజాయితీపరుడు జస్టిస్ యం.సి. చాగ్లా కూడా తాను బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉంటూనే దాన్ని వదులుకొని అమెరికా రాయబారిగా వెళ్లటం స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలోనే వివాదాస్పమైంది. సర్వీసులో ఉన్న ఒక న్యాయమూర్తికి ఇలాంటి నియామకం ఇవ్వటం ద్వారం న్యాయవ్యవస్థ స్వతంత్రత నిజాయితీని ప్రశ్నార్థకం చేశారని నెహ్రూ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు పార్లమెంటులో విమర్శించాయి. చాగ్లా సమర్థతను, నిజాయితీని ఆనాటి హోంమంత్రి గోవిందవల్లభ్ పంత్ ఎంతగా కొనియాడినా, చివరకు అది చాగ్లా లాంటి గొప్ప వ్యక్తి జీవితంలో మచ్చగానే మిగిలింది. ఆనాటి న్యాయవ్యవస్థలో ప్రఖ్యాతి గాంచి, పదమూడేళ్ళు అటార్నీ జనరల్‌గా ఉన్న యం.సి. సెతల్వాడ్ లాంటి వ్యక్తి చాగ్లాకి అతి సన్నిహితుడైనప్పటికీ తన ఆత్మకథ 'నా జీవితం'లో ఇలా అన్నాడు: "చాగ్లాకి రాజకీయ జీవితం పట్ల ఆసక్తి వుంది. లా కమిషన్ నివేదికపైన తాను సంతకం పెట్టిన మరుక్షణమే, సిరా చుక్క తడి ఆరకముందే రాయబారి పదవిలో చేరటానికి న్యాయమూర్తిగా రాజీనామా చేశాడు. ఉన్నత పదవిలో ఉన్నవారి స్వార్థచింతనకు ఇది బలమైన తార్కాణంగా నిలుస్తుంది". దానికి బదులుగా చాగ్లా "సెతల్వాడ్, సహజన్యాయం గురించి నీకు మంచి అవగాహన వుంది. నాతో స్నేహభావం వుంది. నా మీద ఇలా దాడి చేయటం న్యాయంగా ఉందా? నీ సేవలు అవసరమని ప్రధానమంత్రి (నెహ్రూ) కోరితే ఎవరైనా ఎలా తిరస్కరిస్తారు?" అంటూ, ప్రథమ ప్రపంచయుద్ధ సమయంలో ఇంగ్లాండు ప్రధాన న్యాయమూర్తిగా వున్న లార్డ్ రీడింగ్‌ను అమెరికాలో రాయబారిగా నియమిస్తే మారు మాట్లాడకుండా ఆ బాధ్యతని అతను స్వీకరించిన విషయాన్ని చాగ్లా ఉదహరించాడు. న్యాయవాదిగా రెండు చేతులా సంపాదిస్తున్న దశలో న్యాయమూర్తిగా బాధ్యత తీసుకోమంటే అది దేశసేవలో భాగమే అని నేను దాన్ని స్వీకరించాను అని చాగ్లా చెప్పుకోవాల్సి వచ్చింది.

ప్రయోజనాల ఘర్షణ, న్యాయవ్యవస్థ గౌరవం నిలబెట్టటం, న్యాయమూర్తిగా ఉన్న కాలంలో తమకున్న అసాధారణ అధికారాలతో లభించిన సమాచారాన్ని దుర్వినియోగం చేసే పరిస్థితిని నివారించటం తదితర అంశాల కారణంగా న్యాయమూర్తులుగా పనిచేసినవారు తర్వాత ఇతర పదవులు స్వీకరించరాదనే నైతిక సాంప్రదాయం ఒకటి నెలకొన్నది. భవిష్యత్‌లో వారు ఆశించే పదవులకు న్యాయమూర్తిగా ఉన్న కాలంలో ఇచ్చే తీర్పులు ప్రాతిపదిక కావటం కూడా గమనార్హం. బాబ్రీ మసీదు తీర్పు చెప్పిన బెంచ్‌లో గొగోయ్, అబ్దుల్ నజీర్ ఇద్దరూ ఉండటం ఇలాంటి వాదనల్ని బలపర్చుతున్నాయి. అయితే కొన్ని మంచి ఉదాహరణలు కూడా ఉన్నాయి. మొన్న పదవీ విరమణ చేసిన జస్టిస్ ఖన్నా తర్వాత పదవి చేపట్టిన జస్టిస్ గవాయ్, గత నెల 27న పదవీ విరమణ చేసిన జస్టిస్ ఓకా – వీరందరూ భవిష్యత్‌లో ఏ పదవీ చేపట్టబోమని ప్రకటించారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా ఉండి ఆ తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎదిగిన బేలా ఎం. త్రివేది వ్యవహార సరళి న్యాయ నిర్ణయాల్లో ఆమె ధోరణితో పదవీ విరమణ చేసిన ఒక న్యాయమూర్తికి వీడ్కోలు ఇవ్వటమనే సంప్రదాయానికి సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తిరస్కరించడం – ఇవన్నీ శుభ పరిణామాలే.


• చెరుకూరి సత్యనారాయణ

భద్రప్రయాణానికి భరోసా కల్పించాలి!

ఇటీవల ముంబైలో జరిగిన లోకల్ రైలు ప్రమాదంలో ప్రయాణికులు చనిపోవడం, పలువురు గాయపడడం అత్యంత విషాదకరమైన సంఘటన. గతంలో ప్రమాదాలు రైళ్లు పట్టాలు తప్పడం, ఒకదానికి ఒకటి ఢీకొనడం, వరదల వల్ల పట్టాలు కొట్టుకొనిపోవడం, విద్రోహ చర్యలు వంటి వాటివల్ల జరిగేవి. ఇప్పుడు ప్రయాణికుల రద్దీ వల్ల జరుగుతున్నాయి. ఒకసారి న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట వల్ల ప్రయాణికులు చనిపోయిన ఘటన కూడా జరిగింది. వీటన్నిటికీ రైల్వే శాఖకు ముందస్తు ప్రణాళిక లేకపోవడం కారణమవుతోంది.

రైల్వే స్టేషన్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మౌలిక వసతులు, ఆకర్షణీయమైన రీతిలో అంతర్జాతీయ సాంకేతిక ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్నారు, ఇది చాలా హర్షించదగ్గ విషయం. కానీ వీటిని ఉపయోగించే ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. జనాభా అవసరాలకు తగ్గట్టు ప్రయాణికుల రైళ్లు పెరగడం లేదు. ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చడంతో పాటు కొన్ని స్టేషన్లలో హాల్ట్‌లను ఎత్తివేస్తున్నారు. అత్యంత వేగంతో నడిచే రైళ్లు ప్రవేశపెట్టడానికి చూపించే శ్రద్ధ, సామాన్య ప్యాసింజర్ రైళ్ల విషయంలో చూపడం లేదు. చార్జీలు కూడా విపరీతంగా పెంచారు. స్లీపర్ బోగీల సంఖ్య తక్కువగా ఉంటోంది. జనరల్ బోగీల్లో సీట్లు సామర్థ్యానికి మించి టికెట్లు జారీ చేస్తున్నారు. ఫలితంగా ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తున్నది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆధునీకరించిన స్టేషన్ల సముదాయాల వల్ల రైల్వే శాఖకు ఆదాయం విస్తృత స్థాయిలో లభిస్తోంది. కాబట్టి కొత్త ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రవేశపెట్టడం, ఉన్నవాటికి బోగీలను పెంచడం, ప్రజలకు అవసరం ఉన్న స్టేషన్లలో హాల్ట్‌లను కల్పించడం చేయాలి. ప్రజలు ప్రమాదరహితంగా, సుఖసంతోషాలతో రైలు ప్రయాణం చేయడానికి వీలు కల్పించి భారతీయ రైల్వేను ప్రపంచ పటంలో ఆదర్శవంతమైన వ్యవస్థగా నిలపాలి.

– దండంరాజు రాంచందర్‌రావు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
మంగళవారం 17 జూన్ 2025



వరంగల్‌లో నిర్మితమవుతున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

డిసెంబరులో.. సూపర్ సేవలు

మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని వినియోగంలోకి తెచ్చేలా ప్రణాళిక

- ఇప్పటికే 75 శాతం పనులు పూర్తి
- గత ప్రభుత్వం పెంచిన వ్యయాన్ని రూ.167.95కోట్లు తగ్గించిన ప్రభుత్వం
- ఆస్పత్రి నిర్మాణంలో గత పాలకుల అక్రమాలపై కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఉత్తర తెలంగాణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం నిధులు కేటాయింపులు చేసింది. గత ప్రభుత్వం ఏలాంటి అనుమ తులు లేకుండా పెంచిన అంచనా వ్యయాన్ని కుదించింది. నిర్మాణ సంస్థకు పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపుతో పాటు ఆస్పత్రిలో ఏర్పాటు చేసే హెల్త్ అండ్ మెడికల్ ఎక్విప్‌మెంట్ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఇప్పటికే 75శాతం పనులు పూర్తి కాగా, డిసెంబరు చివరి నాటికి ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి, పేదలకు వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మరో వైపు వరంగల్ సెంట్రల్ జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి తెచ్చిన అప్పుతో అస్పత్రి నిర్మాణం పూర్తి చేయగా పోగా, అంచనా వ్యయాన్ని భారీగా పెంచింది. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే చేపట్టిన విజిలెన్స్ విచారణ అస్పత్రి నిర్మాణానికి అడ్డంకిగా మారవద్దనే లక్ష్యంతో ప్రభుత్వం నిధులు విడుదలతో పాటు పనుల వేగంపై దృష్టి పెట్టింది.

నార్త్ తెలంగాణ పేదలకు పెద్దదిక్కు

ఉత్తర తెలంగాణలోని ప్రజలకు వరంగల్ ఎంజీఎం ప్రస్తుతం పెద్దదిక్కుగా ఉంది. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు దక్షిణ తెలంగాణలో మెదక్, నల్గొండ ఉమ్మడి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల నుంచి వైద్య సేవలకు వరంగల్ ఎంజీఎంకే వస్తున్నారు. దీంతో ఎంజీఎం సేవలు విస్తరించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం 2021 జూన్ 22న 2వేల పడకలతో నిర్మించనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి శంకుస్థాపన చేసింది. 56 ఎకరాల్లో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు ఎంజీఎం ఆస్పత్రి, కాకతీయ మెడికల్ కాలేజీ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అన్ని కూడా ఒకే కాంప్లెక్స్ పరిధిలోకి తెచ్చేలా వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అన్ని రకాల వైద్య సేవలతో పాటు మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీలు ఒకే గొడుకు కిందికి వస్తుండడంతో సుమారు 215 ఎకరాల్లో వరంగల్ హెల్త్‌సిటీగా అభివృద్ధి అయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం భావించింది.. ప్రధానంగా వరంగల్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో పేదలకు మూడు బ్లాకులు, 34 విభాగాల్లో సూపర్‌స్పెషాలిటి వైద్యం అందించనున్నారు. 500 మంది వైద్యులు, వెయ్యి మందికి పైగా నర్సులు, పారా మెడికల్ సిబ్బందితో పాటు ఇతర సిబ్బంది పని చేయనున్నారు. ప్రధానంగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, అర్థోపెడిక్ తదితర స్పెషాలిటీ వైద్యం కోసం 1,200 పడకలు, అంకాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ తదితర సూపర్ స్పెషాలిటీ వైద్యం కోసం 800 పడకలను ఏర్పాటు చేశారు. కిడ్నీ, కాలేయం తదితర ఆవయవ మార్పిడి కోసం అన్ని సదుపాయాలు ఉండేలా ఏర్పాట్లు చేశారు. కీమోథెరఫి, రేడియేషన్ సౌకర్యాలతో అధునాతన క్యాన్సర్ కేంద్రంతో పాటు డెంటల్ కాలేజీ ఏర్పాటు చేయనున్నారు. 42 లిఫ్టులు, పెషేంట్ అటెండెండ్స్ కోసం 450 పడకలతో ధర్మశాల, 8 లక్షల కెపాసిటీతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఒకేసారి ఆరు డెడ్‌బాడీలకు శవ పరీక్షలు చేసే వీలుగా పోస్టుమార్టం గదితో పాటు అనేక హంగులతో ఈ అస్పత్రి నిర్మాణం చేపట్టారు.

75 శాతం ఆస్పత్రి పనులు పూర్తి

ప్రభుత్వం ప్రత్యేకంగా సూపర్ స్పెషాలిటీ అస్పత్రి నిర్మాణంపై దృష్టి పెట్టడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 75 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మరో మూడు నెలల్లో మిగతా పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్ బీ అధికారులు పేర్కొంటున్నారు. నిర్మాణ పనులు పూర్తి కాగానే, ఆస్పత్రిలో ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాల్ చేసే ప్రక్రియకు 45 రోజుల నుంచి 60 రోజుల వరకు పట్టే అవకాశం ఉందని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. మొత్తంగా డిసెంబరు చివరినాటికి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకవచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల సూపర్ స్పెషాలిటీ అస్పత్రి నిర్మాణం తీరును రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణరావు, ఆర్ అండ్ బీ కార్యదర్శి వికాస్‌రాజ్‌లు పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేసి, ఉత్తర తెలంగాణలోని పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా చూడాలని జిల్లా అధికారులను ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆర్ అండ్ బీ అధికారుల పర్యవేక్షణలో పనుల్లో స్పీడందుకుంది.

అంచనా వ్యయం రూ.1,558 కోట్లకు కుదింపు

వరంగల్ కేంద్రంగా ఉత్తర తెలంగాణలోని పేదలకు వైద్య సేవలు అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి 2021లో అప్పటి ప్రభుత్వం రూ.1,116 కోట్లు కేటాయిస్తూ అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ జీవో నెంబరు 158 విడుదల చేశారు. ఎల్‌అండ్‌టీ కంపెనీ అస్పత్రి పనులను చేపట్టింది. అయితే ఏడాది కాకముందే ఏలాంటి అనుమతులు లేకుండా రూ.1,725.95కోట్లకు గత ప్రభుత్వం పెంచింది. అదనంగా రూ.625.95కోట్ల వ్యయాన్ని పెంచడాన్ని గోప్యంగా ఉంచింది. అయినప్పటికీ పనులకు నిధుల కొరత ఏర్పడటంతో ముందుకు సాగలేదు. 2023 డిసెంబరు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఎలాంటి అదనపు అంచనాలు లేకుండా రూ.1,725.95 కోట్లకు పెంచడాన్ని ప్రభుత్వం తప్పు పట్టింది. దీనిపై అధికారులతో పలుమార్లు సమీక్షల అనంతరం రూ.1,558 కోట్లకు అంచనా వ్యయాన్ని కుదించింది. వీటిలో సివిల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వాటర్, పారిశుద్యం పనుల కోసం రూ.1,159,77,02,424లు కేటాయించారు. అలాగే వైద్య పరికరాలు, అనుబంధ పనుల కోసం రూ.107,14,28,571లు, నిర్మాణాలు, పర్యావరణం, డిజైన్, ఎన్‌వోసీలు తదితర చట్టబద్ధమైన అనుమతుల కోసం రూ. 44,72,09,134లు

మిగతా 7వ పేజీలో..



ఏసీబీ అధికారులకు పట్టుబడిన డీఈవో పాణిని, జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్

లంచగొండుల ఆటకట్టు

- ఉపాధ్యాయుడికి రీ పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వడానికి లంచం డిమాండ్
- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- డబ్బులు తీసుకుంటూ దొరికిపోయిన డీఈవో పాణి, జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్
- ములుగు డీఈవో కార్యాలయంలో కలకలం
- జిల్లా స్థాయి అధికారి పట్టుబడటంతో ఉద్యోగ వర్గాల షాక్

ములుగు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అతడు ఓ ఉపాధ్యాయుడు.. ప్రమాదానికి గురై లీవులో కొనసాగాడు... ఆరోగ్యం కుదుటపడిన తర్వాత ఉద్యోగంలో జాయిన్ కావడానికి వస్తే రీపోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వడానికి డీఈవో, జూనియర్ అసిస్టెంట్.. లంచాల వేధింపులకు గురి చేశారు.. కనీసం సానుభూతి లేకుండా తనను డబ్బుల కోసం పీడించడాన్ని సదరు ఉపాధ్యాయుడు జీర్ణించుకోలేకపోయాడు. చివరకు ఆయన ఏసీబీని ఆశ్రయించగా, వారు వలపన్ని ఇద్దరినీ పట్టుకున్నారు. ఈ సంఘటన సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో జరిగింది. ఏసీబీ ఆపరేషన్‌లో డీఈవో పాణినితో పాటు జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్ దొరికిపోవడం ఉద్యోగవర్గాల్లో కలకలం రేపింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన మేరకు పూర్వాపరాలు ఇలా వున్నాయి... ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు గత సంవత్సరం ఫిబ్రవరిలో ప్రమాదానికి గురయ్యాడు. అనంతరం ఆరోగ్యం కుదుటపడటంతో అక్టోబర్ నెలలో విధుల్లోకి చేరేందుకు రాగా, రీపోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వడానికి డీఈవో, జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్ రూ.25 వేల లంచం డిమాండ్ చేశారు. తాను అన్ని డబ్బులు ఇచ్చుకోలేనని చెప్పినా వినలేదు. అక్టోబర్ నుంచి కాలయాపన చేస్తూ వచ్చారు. తిరిగి పాఠశాలల ప్రారంభం రోజున ఉపాధ్యాయుడు వెళ్లి మళ్లీ అడగగా రూ. 20 వేలు ఇస్తేనే ఉత్తర్వుల కాపీ ఇస్తానని తెలిపారు. దీంతో విసిగివేసారిన బాధిత ఉపాధ్యాయుడు వరంగల్ రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు సోమవారం డీఈవో కార్యాలయానికి వెళ్లి డీఈవో పాణినికి రూ.15వేలు, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం జూనియర్ అసిస్టెంట్ తొట్టె దిలీప్‌కుమార్ యాదవ్‌కు

మిగతా 7వ పేజీలో..


కర్రలతో జేసీబీని అడ్డుకునేందుకు వెళుతున్న ఆదివాసీలు

అధికారులపై తిరగబడిన ఆదివాసీలు

- అటవీ భూమిలో వేసిన గుడిసెలను తొలగిస్తుండగా అడ్డుకున్న గిరిజనులు
- కారం చల్లి కర్రలు, కత్తులతో దాడి
- ఎక్స్‌కవేటర్ అద్దాలు ధ్వంసం

6

కౌలు రైతుల కన్నీటి సాగు..!

- నేటికీ అందని 'రైతు భరోసా'
- అమలు కాని కాంగ్రెస్ ప్రభుత్వ హామీ
- రుణాలు ఇచ్చేందుకు బ్యాంకుల విముఖత
- పాలకులు మాట నిలుపుకోవాలని విన్నపం

7

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- బల్దియా కమిషనర్ చహత్ బాజ్ పాయి
- ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ
- 76 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇకపై బల్దియా ప్రజావాణి ద్వారా ప్రజలు నుంచి వస్తున్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ చహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ హాజరై ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయి మాట్లాడారు. నగర ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రధానంగా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలపై వస్తున్న ఫిర్యాదులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఇక శానిటేషన్‌పై ప్రజలు చేసే ఫిర్యాదులపై ఒక్క రోజులో పరిష్కరించాలని అన్నారు. ఇక్కడ పరిష్కారం కానీ సమస్యలను హైదరాబాద్ సీడీఎంఏ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజావాణి తర్వాత టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు గతంలో ఉన్నట్టు ప్రస్తుతం బల్దియాలో ఉండదని ప్రజల నుంచి పదే పదే ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 76 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషణర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటి కమిషనర్ రాజేశ్వర్, ఇంచార్జీ సీపీ రవీంద్ర రాడేకర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌తో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఇంజనీరింగ్ - 17, హెల్త్, శానిటేషన్ - 6, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 10, టౌన్‌ప్లానింగ్ - 39, తాగునీటి సరఫరా - 3, ఎలక్ట్రికల్ - 1 ఇలా మొత్తం 76 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్ పాయి

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా..

- హనుమకొండ జయశంకర్ ఏకశిల పార్కు చుట్టుపక్కల అనుమతులు లేని డబ్బాలు, షాపులు ఏర్పాటు చేయడం వల్ల ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వచ్చే వాకర్స్‌కు చాలా ఇబ్బందిగా ఉందని అసోసియేషన్ నాయకులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 29వ డివిజన్ రామన్నపేటలో సెల్ టవర్ నిర్మాణం వల్ల చుట్టు పక్కల నివసించే ప్రజలకు రేడియేషన్ తో ప్రాణాంతక వ్యాధులు వస్తాయని స్థానిక ప్రజలు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ పోర్టు రోడ్డు శంభునిపేట అంబేద్కర్ వీదిలో చాలా చోట్ల వీది దీపాలు వెలగడం లేదు. ఈ ప్రాంతంలో సుమారు 100మంది కళాకారులు జీవిస్తున్నాం, నిత్యం ఈ ప్రాంతం గుండా రావడం, పోవడం జరుగుతుంది. కమిషనర్ స్పందించి వీది దీపాలు ఏర్పాటు చేయాలని ఉత్తర తెలంగాణ కళా మండలి కళాకారులు విజ్ఞప్తి చేశారు.
- హనుమకొండ ఎర్రగట్టుగుట్ట వద్ద బస్‌షెల్టర్ లేక ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక నారాయ ణనగర్ వాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

పేదవారికి ఆత్మ గౌరవం కల్పిస్తాం

- అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- గత పాలకులు ఏ ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇవ్వలేదు
- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఓ సిటీలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల అందజేత


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్‌సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇండ్లు కట్టించి వారికి ఆత్మ గౌరవం కల్పిస్తామని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వరంగల్ ఓసిటీలోని తన క్యాంపు కార్యాలయంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ చౌహత్ బాజ్‌పాయ్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇళ్లను అందజేయలేదని, తాము అధికారంలోకి రాగానే పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని అన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 3500ల ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని, ఒక్కో లబ్ధిదారుడికి రూ.5 లక్షలు ఇస్తామని అన్నారు. ఈరోజు 1659 ఇళ్లకు మంజూరు పత్రాలను అందజేస్తున్నామన్నారు. లబ్ధిదారులు 400ల నుంచి 600ల ఫీట్లలోపే నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ప్రొసీడింగ్స్ ఇచ్చిన వారంలోపే భూమి పూజ చేసుకోవాలని తెలిపారు. గోదావరి పుష్కరాలకు నిధుల కేటాయింపులో తెలంగాణాకు అన్యా యం జరగిందని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రెండు రాష్ట్రాలను సమానంగా చూడాలని కోరారు. ఎన్నికలకు ముందు ప్రజలకు తాము ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేసి చూపిస్తామన్నారు.

నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. నిరుపేదలు సొంత ఇల్లు నిర్మించుకునే అవకాశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ఇళ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే కొండా మురళీధర్‌రావుమాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతీ పేదవాడికి ఇళ్లు మంజూరు అయ్యే విధంగా కృషి చేస్తామని అన్నారు. మునిసిపల్ కమిషనర్ చౌహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు పది రోజుల్లోగా గ్రౌండింగ్ చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు వస్కుల బాబు, సోమిశెట్టి ప్రవీణ్, పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, భోగి సువర్ణ, పోశాల పద్మ, కావటి కవిత, బైరబోయిన ఉమా, గుండు చందన, ఓని స్వర్ణలత, ఫుర్కాన్, సురేష్, కుమారస్వామి, సురేష్ జోషి, జిల్లా నోడల్ ఆఫీసర్ రామిరెడ్డి, హౌసింగ్ పీడీ గణపతి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసిల్దార్ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

- ఒకే వీధి కావడంతో చిన్ననాటి నుంచే స్నేహం
- పదేళ్ల నుంచి ప్రేమించుకుంటున్న వైనం
- యువతికి సంబంధాలు చూస్తుండడంతో మనస్తాపం
- భువనగిరిలో రైలు కిందపడి బలవన్మరణం
- స్వగ్రామం నెమలిగొండలో విషాదం
- కంటతడిపెట్టించిన కుటుంబసభ్యుల రోదనలు


మచ్చ శ్రుతి (ఫైల్)


వినయ్ కుమార్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇద్దరిది ఒకే వీధి కావడంతో చిన్ననాటి నుంచి కలిసి చదువుకున్నారు.. తర్వాత వారి స్నేహం ప్రేమగా మారింది.. పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నారు.. కానీ పెద్దలు ఇందుకు సహకరించరేమోనని భావించి కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. భువనగిరి రైల్వేస్టేషన్ సమీపంలో ప్రేమికులు రైలుకింద పడి బలవన్మరణం చెందడంతో స్వగ్రామం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నెమలిగొండలో విషాదం నెలకొంది. గ్రామస్థులు కథనం ప్రకారం. మచ్చ కుమారస్వామి-రేణుక దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్నకుమార్తె శ్రుతి(23). అలాగే కోటె రాజయ్య-లక్ష్మి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరి కుమారుడు వినయ్‌కుమార్(25). ఈ రెండు కుటుంబాలు ఒకే వీధిలో ఉన్నాయి. శ్రుతి, వినయ్‌లు ప్రాథమిక విద్య గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగింది. 6వ తరగతిలో ఇద్దరు గ్రామ పరిధిలోని మోడల్ స్కూల్‌లో చదువుకున్నారు. చిన్ననాటి నుంచి ఇద్దరి మధ్య మంచి పరిచయం

(మిగతా 8వ పేజీలో)

ప్రముఖులను కలిసిన బల్దియా కమిషనర్


మంత్రి సురేఖకు పూల మొక్కను అందిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చహత్ బాజ్‌పాయి సోమవారం వరంగల్ నగరంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి పూలమొక్కలను అందించారు. వారి కార్యాలయాలకు వెళ్లి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కమిషనర్ కలిసిన వారిలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, కలెక్టర్ స్నేహ శబరీష్, హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జీలు పట్టాభిరావు, బీవీ నిర్మలా గీతాంబలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే నాయిని



హనుమకొండ కలెక్టరేట్, జూన్16(ఆంధ్రజ్యోతి) : కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్నేహ శబరీష్‌ను సోమవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు మాట్లాడుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీజీవోలు

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ స్నేహశబరీష్‌ను టీజీఓలు, టీఎన్‌జీఓలు కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన టీజీఓ నాయకులు జగన్‌మోహన్‌రావు, ప్రవీణ్‌కుమార్, టీఎన్‌జీఓలు ఆకుల రాజేందర్, బైరి సోమయ్య, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

ముల్కనూర్ బ్యాంకు ఎన్నికల్లో 11 నామినేషన్లు


ముల్కనూర్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న బ్యాంకు అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి

భీమదేవరపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సహకార బ్యాంకులో ఐదు డైరెక్టర్ స్థానాలకు 11 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి కోదండరాములు తెలిపారు. సోమవారం సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లను స్వీకరించారు. జనరల్‌కు కేటాయించిన 1వ డైరెక్టర్ స్థానానికి ప్రస్తుత బ్యాంకు అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, దొంగల చిన్నవెంకట్రాజం, ఎస్సీకి రిజర్వేషన్ అయిన 2వ డైరెక్టర్ స్థానానికి బొల్లంపల్లి కుమారస్వామి, కడారి ఆదామ్, జనరల్‌కు కేటాయించిన 5వ డైరెక్టర్ స్థానానికి గనవేని శ్రీనివాస్, కూన కనకయ్య, జనరల్‌కు కేటాయించిన 9వ డైరెక్టర్ స్థానానికి గుర్రాల భాస్కర్‌రెడ్డి, మార్పాటి జైపాల్‌రెడ్డి, బోయినపల్లి రత్నాకర్ రావు, మహిళలకు కేటాయించిన 15వ డైరెక్టర్ స్థానానికి కాశిరెడ్డి వసంత, కంకల భాగ్యలు నామినేషన్లు దాఖలు చేశారు. ఐదు డైరెక్టర్ స్థానాలకు 10 మంది ప్రవీణ్ రెడ్డి ప్యానల్ నుంచి దరఖాస్తులు చేసుకున్నారు. 9వ డైరెక్టర్ స్థానం నుంచి మాత్రమే బోయినపల్లి రత్నాకర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన ఉంటుందని, 18న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని ఎన్నికల అధికారి కోదండరాములు తెలిపారు. ప్రస్తుత బ్యాంకు అధ్యక్షుడు అల్లిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తన ఇంటి నుంచి బ్యాంకు వద్దకు నడుచుకుంటూ వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. పలువురు రైతులు ప్రవీణ్‌రెడ్డికి మద్దతుగా ర్యాలీగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి, ముల్కనూర్ బ్యాంకు జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి పాల్గొన్నారు.

గుడిసెల కోసం తిరగబడిన ఆదివాసీలు

అటవీ భూమిలో గుడిసెలను తొలగించేందుకు అటవీశాఖ యత్నం

కారం చల్లి కర్రలు, కత్తులతో దాడికి యత్నం

అడ్డుకున్న పోలీసులు

పోలీసుస్టేషన్‌లో అటవీశాఖ ఫిర్యాదు


గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్న జేసీబీని అడ్డుకుంటున్న గుడిసెవాసులు

ఏటూరునాగారం రూరల్, జూన్ 16, (ఆంధ్రజ్యోతి) : గుడిసెలను తొలగించొద్దంటూ ఆదివాసులు తిరగబడ్డారు. పోడుభూమిలో నివాసం కోసం ఏర్పాటు చేసుకున్న గుడిసెల స్థలం మాదేనంటూ దానిపై హక్కులు ఆదివాసులకే ఉన్నాయంటూ గుడిసెలను తీసివేసేందుకు వచ్చిన అటవీశాఖ అధికారులపై కారం చల్లుతూ కర్రలు, కత్తులతో దాడికి యత్నించడం సంచలనంగా మారింది. ఏటూరునాగారం మండలంలోని రొయ్యూర్-చల్పాక ప్రధాన రహదారిని ఆనుకొని కొంత మంది ఆదివాసులు పోడుభూమిలో గుడిసెలను ఏర్పాటు చేసుకున్నారు. ఆదివాసులు పలుమార్లు గుడిసెలు వేసుకోవడం ఆ తర్వాత అటవీశాఖాధికారులు వాటిని తొలగించడం రెండేళ్లలో పలుమార్లు జరిగింది. అటవీశాఖ తొలగించిన ప్రతిసారి మరల ఆదివాసులు గుడిసెలు వేసుకోవడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో ఇక్కడ వేసుకున్నా గుడిసెలను సోమవారం ఫారెస్టు డివిజన్ ఆఫీసర్(ఎఫ్‌డీవో) రమేష్ ఆధ్వర్యంలోని సుమారు 60 మంది అటవీశాఖ సిబ్బందితో కలిసి పోలీసు సహాయంతో గుడిసెలను తొలగించేందుకు వెళ్లారు. సంఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు జేసీబీ సహాయంతో గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నించగా గుడిసె వాసులు అడ్డుకొని అటవీశాఖాధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కోపోద్రిక్తులైన గుడిసె వాసులు గుడిసెలను తొలగించే ప్రసక్తే లేదని, కారంపొడి., పెట్రోల్‌ను అటవీశాఖ అధికారులపై చల్లుతూ కర్రలు, కత్తులతో వారిపై దాడికి యత్నించారు. పలువురు ఫారెస్టు అధికారులపై పెట్రోల్ పడింది. జేసీబీ అడ్డుకొని దాని అద్దాలు ధ్వంసం చేసి డ్రైవర్‌పై దాడి చేశారు. స్థానిక ఎస్సై రాజ్‌కుమార్ వారికి నచ్చచెప్పేందుకు ప్రయత్నించిన వినకుండా ఫారెస్టు అధికారులపై దాడికి యత్నించారు. ఇరువర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు దాడిని నిరవధించేందుకు ప్రయత్నించి ఫలితం లేకుండా పోయింది. దీంతో అటవీశాఖాధికారులు అటవీశాఖాధికారులు విధి లేని పరిస్థితిలో అక్కడి నుంచి వెళ్లిపోయారు. సుమారు మూడు గంటల పాటు ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు ఆదివాసులు మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన గొత్తికోయలు వందలాది ఎకరాలను పోడుచేసినా పట్టించుకొని అటవీశాఖాధికారులు ఇక్కడే ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న ఆదివాసుల పోడుభూములను లాక్కోవడం విడ్డూరంగా ఉందన్నారు. పోడుభూములో నివాసం ఉండేందుకు గుడిసెలు ఏర్పాటు చేసుకుంటే అటవీశాఖ అధికారులు వేధింపులకు గురిచేస్తూ ఇబ్బంది పెడుతున్నారని, భూమిని కాపాడేందుకు ఏమి చేయాలో పాల్పడకనే ఎదురు తిరగడం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా అటవీభూమిలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నించగా గుడిసె వాసులు మాపై దాడికి పాల్పడినట్లు అటవీశాఖాధికారులు తెలిపారు. పెట్రోలు, కారం చల్లుతూ కర్రలు, కత్తులను చేతి లో పట్టుకొని మాపై దాడికి ప్రయత్నించారని వా రు తెలిపారు. అటవీశాఖ సంఘటనకు సంబంధించిన విషయంపై స్థానిక పోలీసులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని అటవీశాఖ పేర్కొంది.

జింబోకు సహృదయ సాహిత్య పురస్కారం రేపు ప్రదానం



హనుమకొండ కల్చరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ సాహితీ సంస్థల్లో ఒకటైన సహృదయ ఆధ్వర్యంలో ప్రతియేటా ఒక ప్రముఖ కవికి రాళ్లబండి కవితా ప్రసాద్ స్మారకార్థం ప్రదానం చేసే పురస్కారాన్ని ఈసారి జింబోకు ప్రదానం చేస్తున్నట్లు సహృదయ సాహిత్య కార్యదర్శి మల్యాల మనోహర్‌రావు, అధ్యక్షుడు గిరిజా మనోహర్‌బాబు చెప్పారు. ఈ నెల 18న వడ్డేపల్లిలోని పీఆర్.రెడ్డి భవన్‌లో నిర్వహించే సభలో ప్రముఖ కవి, రచయిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జ్యూడిషియల్ అకాడమి విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ మందాడి రాజేందర్ (జింబో)కు ప్రదానం చేస్తున్నామన్నారు. చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య సూర్య ధనుంజయ్, జాతీయ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సూర్యనారాయణమూర్తిలు అతిథులుగా పాల్గొంటారని వారు వివరించారు.

నేటి నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డిప్లమా విద్యార్థులకు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించే టీజీఈసెట్ కౌన్సెలింగ్ మంగళవారం నుంచి ప్రారంభం అవుతుందని వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌లో మంగళవారం 19 వరకు సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ప్రారంభ మవుతుందని, 17 నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 25న సీట్ల కేటాయింపు, 25 నుంచి 29 వరకు అడ్మిషన్లు పొందిన కాలేజీల్లో విద్యార్థులు ఫీజుల చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని ఆయన పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో

అక్కడికక్కడే మహిళ మృతి

చిన్నారులు సహా నలుగురికి గాయాలు

జిల్లా ప్రధాన ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు

తెల్లవారితే పండుగ జరగాల్సిన ఇంట్లో విషాదం



మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో రోదిస్తున్న బంధువులు, అమల (ఫైల్)

మహబూబాబాద్ క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తెల్లవారితే ఇంటిదేవత పండుగ జరుపుకోవాల్సిన ఆ ఇంట్లో విషాదం నెలకొంది. జాతీయ రహదారి 365పై వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయడంతో ప్రయాణికులతో వెనుకాల వస్తున్న ఆటో బస్సుకు ఢీకొంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం అల్లిగూడెం శివారు బోటితండాకు చెందిన మాలోతు గణేష్ (ఆటోడ్రైవర్) సతీమణి అమల దంపతులు ఈ నెల 17న ఇంట్లో కులదేవత ఎల్లమ్మతల్లి పండుగను జరుపుకునేందుకు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో గణేష్, ఆయన భార్య అమల, ఇద్దరు కుమారులు గౌతమ్, గగన్, అక్క మంజు, భావ రంగ, అన్న సురేష్‌తో కలిసి తన సొంత ఆటోలో సోమవారం మహబూబాబాద్‌కు వచ్చారు. కిరాణం, ఇతర సరుకులు, నూతన దుస్తులు కొనుగోలు చేశారు. అనంతరం మేకను కొనేందుకు ఆటోలో కుటుంబ సమేతంగా మానుకోట నుంచి కురవి సంతకు బయలు దేరారు.

ఈ క్ర మంలో బేతోలు శివారు భజన తండా వ ద్ద 365 జాతీయ రహదారిపై మరిపెడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయడంతో వెనుకాల వెళ్తున్న ఆటో బస్సును ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న ఆటో డ్రైవర్ భార్య అమల (27) అక్కడికక్కడే మృతి చెందింది. మిగతా వారు తీవ్రంగా గాయ పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న కురవి ఎస్సై సతీష్ ఘటన స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని, అమల మృతదేహాన్ని జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు.

కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అమల మృతి వార్త తెలిసిన బంధువులు మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి చేరుకోగా వారి రోదనలు మిన్నంటాయి. తల్లిని కోల్పోయిన చిన్నారులు గగన్, గౌతమ్‌లను చూసిన ప్రతి ఒక్కరు కంట తడి పెట్టారు. ఇది ఇలాఉండగా తెల్లవారితే ఇంటి దేవత ఎల్లమ్మతల్లి పండుగ చేసుకోవాల్సిన బయ్యారం మండలం అల్లిగూడెం బోడ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆరు గ్యారంటీల అమలుకు సర్కార్ కృషి

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం

కాంగ్రెస్ పార్టీలో అందరిని కలుపుకుపోతాం

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్


మహబూబాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్

మహబూబాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల హామీలైన ఆరుగ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా పరిపుష్టిగా లేకున్నా.. ఇబ్బందులు ఎదురైనా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ సూచన మేరకు రాష్ట్రంలో .కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయడమే కాకుండా, వారి జనాభా ప్రాతిపదికగా న్యాయం జరిగేలా చూడాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను అన్ని విధాలుగా కాపాడుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాగునీటి అవసరాల కోసం మిగిలి పోయిన ప్రాజెక్టుల పూర్తి కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు.

కాంగ్రెస్‌లో కొత్త, పాత కలయికలో ఇబ్బందులు వస్తున్న కలుపుకుపోతూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. తాము ప్రభుత్వానికి, పార్టీ కార్యకర్తలకు మధ్య వారధిలా పని చేస్తామని స్పష్టం చేశారు. ఎస్సీల్లో మాల, మాదిగలకు మంత్రి వర్గంలో చోటు కల్పించిన విధంగా గిరిజనుల్లో ఆదివాసీ, లంబాడలకు మంత్రి పదవుల్లో అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పటిష్టతకు పార్టీ శ్రేణులు అహర్నిశలు శ్రమించాలని విజ్ఞప్తి చేశారు. కాం గ్రెస్ కార్యకర్తలు కాస్త నిరుత్సాహంగా ఉన్నారని, దానిని సరిదిద్దుకుంటామన్నారు. ఈ సమావేశంలో గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్నయాదవ్, మాజీ జడ్పీటీసీ జిన్నారెడ్డి పద్మజ వెంకటేశ్వర్లు, గుగులోతు వెంకట్‌నాయక్, వెంకన్న, బానోత్ ప్రసాద్, రాంచంద్రు, యుగేందర్, భూక్య లక్ష్మి, పద్మ, ప్రభాకర్, సీతారాములు పాల్గొన్నారు.

ఆస్తులు పంచాక వృద్ధులకు ఎక్కువైన వేధింపులు

న్యాయ సహాయానికి మా సంస్థ సిద్ధం

జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే


సదస్సులో మాట్లాడుతున్న క్షమాదేశ్ పాండే

హనుమకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధులకు వారి కుటుంబంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి న్యాయ సలహాల కోసం తమను సంప్రదించవచ్చునని జిల్లా న్యాయ సేవాసాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే అన్నారు. సోమవారం హనుమకొండలోని జిల్లా పరిషత్ హాల్‌లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ సదస్సుకు ముఖ్య అతిథిగా క్షమా దేశ్‌పాండే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో వయోవృద్ధులు తమ కుటుంబంలో కొడుకులు, కోడళ్లు, కూతుళ్లతో అనేక విధాల వేధింపులకు గురవుతున్నారని, తమకు ఉన్న ఆస్తులను పంచి ఇచ్చిన తర్వాత వేధింపులు మరీ ఎక్కువవుతున్నాయని అన్నారు. అలాంటి సమస్యల పరిష్కారానికి న్యాయ సహాయానికి న్యాయ సేవాసాధికర సంస్థను సంప్రదించవచ్చునని అన్నారు. ట్రిబ్యునల్ సభ్యురాలు అనితా రెడ్డి మాట్లాడుతూ వయోవృద్ధులను కొడుకులు, కోడళ్లు ఎక్కువగా ఇబ్బందులు పెడుతున్నట్లు తమ వద్దకు వచ్చే కేసులను బట్టి తెలుస్తోందని అన్నారు. అందువల్ల వయోవృద్ధులు తొందరపడి తమ ఆస్తులను కొడుకులు, కూతుళ్లపేర రాయకుండా తమ తదనంతరం మాత్రమే చెందేలా వీలునామా రాయాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధగా కృషి చేస్తూనే తల్లిదండ్రుల పట్ల పిల్లలు గౌరవంగా ఉండేలా వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

హెల్పేజ్ ఇండియా సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్యాం కుమార్ మాట్లాడుతూ హె ల్పేజ్ ఇండి యా దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో పలు ఆసక్తికర అంశాలు వెలుగు చూశా యన్నారు. వల్లంపట్ల నాగేశ్వర్ రావు, అంచూరి చంద్రమౌళి, బన్ను ఆరోగ్య స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఇంద్రజిత్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. ఎంజీఎంలో ప్రత్యేక వయోవృద్ధులకు ప్రత్యేక వార్డును, వృద్ధులకు డేకేర్ సెంటర్లను, పోలీసు స్టేషన్‌లో వృద్ధమిత్ర సెల్‌లను ఏర్పాటు చేయా లని సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ తమ సంస్థ చేపడుతున్న వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు రిటైర్డ్ డిఎస్‌పి దామెర నర్సయ్య అధ్యక్షత వహించారు. ఉపాధ్యక్షుడు నాగులగాం నర్సయ్య, కార్యవర్గ సభ్యులు మార్క రవీందర్ గౌడ్, తాడూరి లక్ష్మీనారాయణ, గంగారపు యాదగిరి, రాజేందర్, గంటి సాంబయ్య, కజాంపురం దామోదర్, చిదిరాల సత్యనారాయణ, పలు సీనియర్ సిటిజన్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మరమ్మతుల్లో బాధ్యతాయుతంగా ఉండాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతులు చేసే క్రమంలో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం హనుమకొండ కార్పొరేట్ కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈ, డీఈ టెక్నికల్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న లూజ్ లైన్లు, వంగిన పోల్స్, తుప్పుపట్టిన పోల్స్‌ను తక్కువ ఎత్తులో ఉన్న డీటీఆర్ ప్లింత్‌లను, లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్ వచ్చే వాటిని గుర్తించి మార్చాలన్నారు.

అందుకు తగ్గట్టు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. రైతు లు, గృహ వినియోగదారులు స్వతహాగా విద్యుత్ పనులుచేయకుండా 1912 ద్వా రా సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి. అశోక్‌కుమార్, టి. మధుసూదన్, సీఈలు రాజుచౌహాన్, అశోక్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గతేడాది గెస్ట్ ఫ్యాకల్టీకే అవకాశం కల్పించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో గతేడాది పాఠ్యాంశాలు బోధించిన గెస్ట్ ఫ్యాకల్టీకే మళ్లీ అవకాశం కల్పించాలని గెస్ట్ ఫ్యాకల్టీ బృందం డిమాండ్ చేసింది. ఈ మేరకు వారు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 26 వరకు సమయం ఉన్నప్పటికీ కళాశాల ప్రిన్సిపాల్ తమను కావాలనే టర్మినేట్ చేశారని కలెక్టర్‌కు విన్నవించినట్లు వారు పేర్కొన్నారు. ఈ నెల 30 నుంచి విద్యార్థులకు పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో వారికి పాఠ్యాంశాల బోధనతో పాటు విషయ నివృత్తి చేసేందుకు అనుమతించాలని కోరినట్లు తెలిపారు. గతలో మూడు నెలల పాటు ఉచితంగా పాఠ్యంశాలు బోధించిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళుతూ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన వారిలో సూర్యనారాయణ, జంగ గోపాల్‌రెడ్డి, బూర విద్యాసాగర్ శంకరనారాయణ, రవీందర్, రామ్మూర్తి, అరుణాచారి, నాగరాజు గెస్ట్ ఫ్యాకల్టీ ఉన్నారు.

అప్పుల బాధతో చిరు వ్యాపారి ఆత్మహత్య


పిల్లి సత్యం (ఫైల్)

తాడ్వాయి, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో చిరువ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల రాజన్న జిల్లా, ముస్తాబాద్ మండలం, ముస్తాబాద్ గ్రామానికి చెందిన సత్యం(50) తన భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు పవన్, అఖిల్‌లతో కలిసి 10 ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం మేడారం తరలివచ్చారు. జాతరలో చిన్న కిన్న గాజులు, పూసల దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. . అయితే ఏడేళ్ల క్రితం పెద్ద కొడుకు పవన్ జీవనోపాధి కోసం సౌదీకి వెళ్లాడు. అదేవిధంగా చిన్నకొడుకు అఖిల్ కూడా మూడేళ్లుగా అదే దేశం వెళ్ళగా సత్యంకు 10లక్షలకు పైగా అప్పులు అయ్యాయి. సౌదీకి వెళ్లిన వారికి పని దొరకకపోవడం, డబ్బులు పంపించకపోవడంతో అప్పుల బాధలు తాళలేక మనస్తాపంలో తన దుకాణంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేసి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం కోసం ఏటూర్‌నాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు.

ఆదర్శ కాలనీలో పిట్టగూళ్ల పంపిణీ



పిట్టగూళ్లతో ఆదర్శ కాలనీ వాసులు

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 53వ డివిజన్ ఆదర్శ కాలనీలో సోమవారం చింతగట్టు మహర్షి గోశాల, ఎస్ఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆదర్శ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పిట్టగూళ్ల పంపిణీ చేశారు. ఆధునిక సమాజంలో కాంక్రీటు జంగల్‌గా మారిన తరుణంలో పక్షులు తమ గూళ్లను కట్టుకోవడానికి ఇబ్బందులకు గురై అంతరించిపోతున్న తరుణంలో పర్యావరణ పరిరక్షణ కోసం పిట్టగూళ్లు పంపిణీ చేయడం జరిగిందని ఆదర్శ కాలనీ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు తూడి విద్యాసాగర్‌రెడ్డి, కోశాధికారి తౌటం నర్సింహస్వామి, కార్యవర్గ సభ్యులు పేరేశ్వర్‌రావు, రమణయ్య, శ్రీనివాసు, రమేష్‌బాబు, మహిళలు మంజుల, వనజ, మహర్షి గోశాల వ్యవస్థాపక అధ్యక్షుడు తేరాల యుగంధర్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతోనే ప్రజలకు రక్షణ

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే సమాజంలోని ప్రజలకు రక్షణ ఉంటుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పలివేల్పుల గ్రామానికి చెందిన వివిధ పార్టీల వారు 40కుటుంబాలు సోమవారం సీపీఐ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి శ్రీనివాస్‌రావు సీపీఐ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, నాయకులు మద్దెల ఎల్లేష్, బిక్షపతి, తదితరులు ఉన్నారు.

గిరి వికాసానికి నిధులేవి?



ఐటీడీఏ కార్యాలయం

పథకం అమలు కోసం గిరిజన రైతుల ఎదురుచూపులు

- ఏడాదిగా దరఖాస్తుల స్వీకరణకే పరిమితం
- నిధుల విడుదల లేక పడకేసిన పనులు
- ఇందిరా గిరి జల వికాసంగా పేరు మారినట్లేనా ?
- సాగునీటి కోసం అన్నదాతలు ఇక్కట్లు

ఏటూరునాగారం రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నిర్లక్ష్యం మాటునా గిరి వికాసం వాడిపోతోంది. ఏడాదిగా సీఎం గిరి వికాసానికి నిధుల కొరత వేధిస్తోంది. గిరిజన రైతుల పొలాల్లో నీళ్ల పారించే ఈ పథకానికి నిధులేమీ వెంటాడుతోంది. గిరిజన రైతన్నకు అదెరువుగా నిలిచే సీఎం గిరి వికాసానికి ప్రభుత్వం మొండిచూపుతోంది. ప్రభుత్వం ఐటీడీఏలపై చిన్నచూపు చూస్తోందని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఐటీడీఏ శాఖల పనితీరు, పథకాల పురోగతి, గిరిజనుల స్థితిగతులపై ఒక్క సమీక్ష సమావేశం కూడా నిర్వహించకపోవడం విడ్డూరంగా ఉంది. నిధులలేమీతో ఐటీడీఏలో పలు శాఖలు నిర్వీర్యం దిశగా సాగుతున్నాయి. ఏడాది కాలంగా సీఎం గిరి వికాసానికి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయకపోవడం గిరిజన రైతులకు శాపంగా మారింది. గిరిజన రైతుల భూముల్లో ఉచితంగా బోర్లు వేయించడం, మోటార్లు అందించడం, విద్యుత్తు సౌకర్యం కల్పించడం వంటివి గిరి వికాసం పథకం ఉద్దేశం.

దరఖాస్తుల వెల్లువ.. అమలు నిల్

వ్యవసాయాన్నే ఆదెరువు చేసుకొని జీవిస్తున్న పేద గిరిజన రైతులకు గిరి వికాసం పథకం వరం లాంటింది. ఐదెకరాల్లోపు చిన్న, సన్న కారు రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉండే పథకం అమలులో మాత్రం ముందుకు సాగడం లేదు. ఐటీడీఏ పరిధిలోని ములుగు, భూపాలపల్లి, హనుమకొండ , మహబూబాబాద్, తదితర జిల్లాల్లోని రైతులు పథకానికి దరఖాస్తులు చేసుకుంటున్నారు. ప్రతియేటా వందల సంఖ్యలో ఈ పథకానికి గిరిజన రైతులు దరఖాస్తులు సమర్పిస్తున్నారు. గిరి విసాసం పథకం ద్వారా ఇప్పటి వరకు గిరిజన రైతులకు 1617 యూనిట్లకు బోర్లు తీయడం, 949 మందికి మోటార్లు, 1017 మందికి విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగింది. కానీ గత సంవత్సర కాలంలో యూనిట్లు మంజూరై బడ్జెట్ విడుదల కాక పెండింగ్ ఉన్న దరఖాస్తులు జిల్లాల వారీగా ఇలా ఉన్నాయి. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ మొత్తం 256 బోర్‌వెల్ డ్రిల్లింగ్స్ ఉన్నాయి. మోటార్ల యూనిట్లు 553 ఉన్నాయి, విద్యుత్ సౌకర్యం 540 మోటార్లకు విద్యుత్ అందించాల్సి ఉంది. ఈ యూనిట్ల మంజూరుకై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కానీ నిధుల విడుదల కాలేదు. దీంతో పథకం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన వాటికే నిధులు మంజూరు పెండింగ్‌లో ఉన్న కూడా మరల రైతుల వద్ద నుంచి గిరి వికాసానికి దరఖాస్తుల స్వీకరణ జరుగుతూనే ఉంది. మరల గిరి వికాసానికి దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ మొత్తం బోర్‌వెల్ డ్రిల్లింగ్స్ 322 ఉన్నాయి. మోటార్ల యూనిట్లు 320 ఉన్నాయి. విద్యుత్ సౌకర్యం 315 మోటార్లకు ఇవ్వాలని దరఖాస్తులు అందాయి.

'ఇందిరా గిరి జల వికాసం'గా పేరు మారినట్లేనా ?

ప్రభుత్వం సీఎం గిరి వికాసం పథకాన్ని ఇందిరా గిరి జల వికాసంగా మార్చినట్లు వినికిడి. కానీ దానికి సంబంధించిన స్పష్టమైన ప్రకటన ప్రభుత్వం ఇప్పటి వరకు చేయలేదు. ఈ పథకాన్నే ఇందిరా గిరి జల వికాసంగా మార్చుతారా లేదా రెండు పథకాలు వేర్వేరుగా కొనసాగిస్తారన్నా స్పష్టం రాలేదు. పథకాల పేరు మార్చిన వేర్వేరు పథకాలుగా కొనసాగిన నిధుల కేటాయింపు లేకపోతే లాభం ఏమి ఉంటుందని గిరిజనులు వాపోతున్నారు. ప్రభుత్వం చొరవ చూపి గిరిజన రైతులకు చేయూతనందించాలని కోరుకుంటున్నారు.

నిధుల కేటాయింపు కాగితాలకే పరిమితం

గిరి వికాస పథకం అమలుకు గతేడాది ప్రభుత్వం కొంత మొత్తాన్ని మంజూరు చేసింది. కానీ మంజూరు చేసిన నిధుల నుంచి ప్రభుత్వం పథకం అమలుకై ఏడాదిగా రూపాయి కూడా విడుదల చేయని వైనం నెలకొంది. ప్రభుత్వం నిధుల కేటాయింపులు జరిపినప్పటికిని వాటిని విడుదల చేయడంలో సర్కార్ నిర్లక్ష్యంగా వ్యహరించడం గిరిజన రైతులకు సాగు గుదిబండగా మారింది. గిరి వికాస పథకం అమలు జరిగితే గిరిజన చిన్న, సన్నకారు రైతుల ఎంతో ప్రయోజకరంగా ఉంటుంది. గిరిజన రైతులకు ఆసరాగా నిలిచే పథకంపై ప్రభుత్వం కనికరించకపోవడంతో గిరిజన రైతులు అవస్థలు పడుతున్నారు. నీళ్ల లేక రైతుల పొలాలు బీడులుగా మారుతున్నాయి. పొలాల్లో బోర్లు వేసి విద్యుత్తు సౌకర్యం కల్పిస్తే ఏడాదిలో రెండు పంటలు రైతులు సాగుచేసే అవకాశం ఉంటుంది. గిరి వికాస పథకానికి రైతులు దరఖాస్తులు సమర్పించి పథకం అమలుకై ఆశగా ఎదురుచూస్తున్నారు.



కార్పొరేట్ స్కూల్ తరహాలో రంగులు వేసిన కల్వల ప్రాథమిక పాఠశాల భవనం

కల్వల ప్రాథమిక పాఠశాల రికార్డు

» విద్యార్థుల సంఖ్య రెట్టింపు » ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు అడ్మిషన్

కేసముద్రం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సంఖ్య తగ్గుతూ ప్రభుత్వ పాఠశాలలు మూసివేసే దశలో ఉన్న స్కూళ్లలో ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు నానా తంటాలు పడుతుండగా ఇందుకు భిన్నంగా కేసముద్రం మండలం కల్వల ప్రాథమిక పాఠశాల అడ్మిషన్లలో రికార్డు సృష్టించింది. ఈ పాఠశాలలో 65 మంది విద్యార్థులుండగా మూడు రోజుల్లోనే విద్యార్థుల సంఖ్య 130కి చేరడం గమనార్హం. అంతేకాకుండా కల్వలకు చెందిన నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఎస్‌కె. సయ్యద్ తన కూతురు తయ్యబాను ఇదే పాఠశాలలో ఐదో తరగతిలో సోమవారం చేర్పించారు. గూడూరులో వీఆర్ఏగా పనిచేస్తున్న పెసర మహేష్ తన కుమారుడు వర్షిత్‌ను ఒకటో తరగతిలో, పాలేరు నవోదయ పాఠశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న పెద్దారపు సంపత్ తన కూతురు స్మృతికను రెండో తరగతిలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వం అందించే యూనిఫామ్‌తో పాటు హెచ్ఎం కళ్లెం వీరారెడ్డి తన సొంత ఖర్చులతో వారంలో రెండు రోజులు ధరించేందుకు ప్రత్యేక యూనిఫామ్, షూ, బెల్టు, బ్యాడ్జి, టై అందజేశారు. అలాగే రూ.40వేలు వెచ్చించి రంగులు వేయించి కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దారు. గ్రామపెద్దలు, ఆరుగురు ఉపాధ్యాయుల సమష్టి కృషితో పాఠశాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని హెచ్ఎం తెలిపారు.


హెచ్ఎం వీరారెడ్డి అందజేసిన యూనిఫామ్‌లో విద్యార్థులు

కౌలు రైతుల కన్నీటి సాగు..!



- నేటికి అందని 'రైతు భరోసా'
- అమలు కాని కాంగ్రెస్ ప్రభుత్వ హామీ
- రుణాలు ఇచ్చేందుకు బ్యాంకుల విముఖత
- పెట్టుబడి కోసం అప్పులపాలు
- పాలకులు మాట నిలుపుకోవాలని విన్నపం

వరంగల్ వ్యవసాయం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఎవరిని కదిలించినా కన్నీటిని ఆపుకోలేరు. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్నా వారిని ఎవరూ పట్టించుకోవడం లేదు. పాలకులు సైతం ఎన్నికల సమయంలో హామీల వరాలు గుప్పించి తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేస్తున్నారు. గత ఎన్నికల్లో పట్టాదారు రైతులకు ఇస్తున్నట్టుగానే రైతు భరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సీజన్లు గడిచినా ఇంతవరకు రూపాయి సాయం చేసిన పాపాన పోలేదు. కనీసం వారిని రైతులుగా కూడా గుర్తించడం లేదు. దీంతో వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదు. బ్యాంకులు సైతం రుణాలు ఇవ్వడం లేదు. దీంతో పెట్టుబడి కోసం వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక నానా అవస్థలు పడుతున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు ఎనభై వేల మంది వరకు ఉన్నట్లు అధికారులు 2013-14లోనే గుర్తించినా.. గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ మాత్రం జరుగలేదు. కనీసం ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా కైలు రైతులను గుర్తించి రైతు భరోసా అందేలా చూడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం పెట్టిబడి సాయం కింద ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

అమలు కానీ కౌలు చట్టం

2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతుల చట్టాన్ని తీసుకువచ్చింది. వారికి బ్యాంకుల ద్వారా పంట రుణాలు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వండతో పాటు ప్రకృతి వైపరిత్యాల వల్ల నష్టపోతే పరిహారం అందే విధంగా చట్టాన్ని రూపొందించారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎనభై వేల మంది వరకు కౌలు రైతులు ఉన్నట్లు గుర్తించిన అధికారులు గుర్తింపు కార్డులను మాత్రం అందజేయలేదు. ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని ప్రొత్సహిస్తూ అనేక పథకాలను రూపొందించినప్పటికీ కౌలు రైతులను ఆదుకోవడంలో మాత్రం శ్రద్ధ పెట్టడం లేదు.

చివరికి మిగిలేది చెమట మాత్రమే..

కౌలు రైతులు ఆరుగాలం కష్టపడి పంటలు పండించినా... కష్టమంతా కౌలు కింద పట్టాదారులకే చెల్లించాల్సి వస్తోంది. కొందరు పట్టాదారులు ముందుగా సొమ్ము మొత్తం చెల్లించిన వారికే భూమిని కౌలు ఇస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల సోకి పంట నష్టపోయినా పట్టాదారులకు మాత్రం కౌలు సొమ్ము చెల్లించాల్సిందే. విత్తనాలు, ఎరువుల ధరలతో పాటు ట్రాక్టర్లతో దున్నడం, వరినాట్లు, కలుపుతీత, కూలీల రేట్లు పెరుగడంతో పెట్టుబడి పెరిగిపోతోంది. పంట నష్ట పోతే నష్ట పరిహారం పట్టాదారులకే ఇస్తున్నారు. బ్యాంకులో పంట రుణాలు, ఇతర సబ్సిడీ పథకాలు వారికే అందుతాయి. దీంతో కౌలు రైతులకు చెమట చుక్కలు తప్ప ఏమీ మిగలడం లేదు. దీంతో అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కూడా ఉన్నాయి.

కౌలు రైతులను ఆదుకోవాలి



గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతు చట్టం తీసుకువచ్చింది. అది అమలు కాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందించడంతో పాటు పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.15 వేలు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలి. అంతేగాకుండా కౌలు రైతులకు పంట రుణాలు, పంట నష్ట పరిహారం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, యంత్రాలు, ఇతర పరికరాలు అందేలా చూడాలి.

- రాములు నాయక్, గాంధీనగర్, కౌలు రైతు

ఓసీ-3లో ఓబీ పనుల నిలిపివేత

మూడు నెలలుగా బిల్లులు చెల్లించని సింగరేణి యాజమాన్యం

గణపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని గణపురం మండలం మాధవరావుపల్లి ఓపెన్‌కాస్టు-3లో ఓబీ పనుల సోమవారం నిలిపివేశారు. బొగ్గు ఉత్పత్తిలో భాగంగా ఓబీ పనుల నిర్వహణ కోసం ఎస్‌వీఈసీ ప్రైవేటు సంస్థ టెండరు దక్కించుకుని పనులు చేపడుతుంది. అయితే సదరు కాంట్రాక్టర్‌కు సింగరేణి యాజమాన్యం గత 3నెలలుగా బిల్లులుగా చెల్లించడం లేదని ఓబీ పనులను నిలిపివేశారు. దీంతో ఉదయం షిఫ్టు నుంచి స్వచ్ఛందంగానే పనులను నిలుపుదల చేసినట్లు కాంట్రాక్టు అధికారులు పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం బిల్లులు చెల్లించకపోయిన తాము ప్రతీ నెల డ్రైవర్లకు వేతనాలు అందజేసినట్లు పేర్కొన్నారు. మూడు నెలల నుంచి సుమారు 4కోట్ల రూపాయలు యాజమాన్యం చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఓబీ పనుల నిలిపివేతతో బొగ్గు ఉత్పత్తిపై, సింగరేణి సంస్థపై నష్ట ప్రభావం పడనుంది.


ఓబీ పనులు నిలిపివేయడంతో ఖాళీగా ఉన్న ట్రక్కులు

డిసెంబరులో 'సూపర్' సేవలు

(5వ పేజీ తరువాయి)

కేటాయించారు. అలాగే ఆస్పతి భవన నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.18,32,16,292లు, జీఎస్టీలతో పాటు ఇతర పన్నుల కోసం రూ.228,04,43,579లు కేటాయించారు. మొత్తంగా రూ.1,558 కోట్లు కేటాయించారు. అయితే గతంలో ఆర్‌అండ్‌బీ పర్యవేక్షణ చార్జీలు లేవు. అలాగే వివిధ రకాల చట్టబద్ధమైన అనుమతుల కోసం గతంలో కేవలం రూ.6,34,35,260లు మాత్రమే కేటాయించారు. సవరణ అంచనా వ్యయంలో ప్రస్తుతం రూ. 44,72,09,134లు కేటాయించారు. అంటే రూ.38,37,73,874లు అదనంగా ఖర్చులు పెరిగాయి. అయితే గత ప్రభుత్వం ఇలాంటి ఖర్చులు పెరుగుతున్నాయనే అంచనా వ్యయాన్ని ఏలాంటి అనుమతులు లేకుండా రూ.1,725.95 కోట్లకు పెంచింది. దీన్ని పక్కన పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1,558కోట్లకే పరిమితం చేసింది. అంటే 2022-23లో కంటే ప్రస్తుతం నిర్మాణ వ్యయం పెరిగినప్పటికి అంచనా వ్యయాన్ని రూ.167.95కోట్లకు తగ్గించింది. నిధులను కూడా విడుదల చేస్తుండటంతో పనుల్లో వేగం పెరిగింది.

జైలు స్థలం తాకట్టుపై విజిలెన్స్ విచారణ

ఆస్పత్రి నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు లేకపోవటంతో గత ప్రభుత్వం తెలంగాణ స్టేట్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్)ను ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్‌కు వరంగల్ సెంట్రల్ జైలు భూమి సర్వే నెంబరు 31,32లోని 2,75,759 గజాల స్థలాన్ని (56ఎకరాలు) బదిలీ చేస్తు జీవో నెం.81ని జారీ చేసింది. టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్ జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, హైదరాబాద్ నుంచి రూ.1,173 కోట్ల రుణం తీసుకుంది. అయితే ఈ మొత్తాన్ని ఆస్పత్రి నిర్మాణానికి ఖర్చు చేయకుండా, ఇతర వాటికి మళ్లించారు. దీనిని సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. జైలు భూమిని తాకట్టు పెట్టడం ఏమిటని.. తీసుకున్న రుణాన్ని ఆస్పత్రికి కాకుండా ఇతర వాటికి మళ్లించటం ఏమిటని గత ప్రభుత్వ విధానాన్ని తప్పు పట్టారు. దీనిపై గత ఏడాది ఆగస్టు 30వ తేదీన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో విచారణకు ఆదేశించారు. దీంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఆస్పత్రి నిర్మాణంలో భాగస్వామ్యం ఉన్న ఇంజనీర్లు, కాంట్రాక్టు కంపెనీతో పాటు పలువురు ప్రభుత్వ వైద్యులను కూడా విజిలెన్స్ అధికారులు విచారించారు. విజిలెన్స్ అధికారులు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి త్వరలోనే నివేదించనున్నట్టు సమాచారం. కాగా, ఆస్పత్రి నిర్మాణానికి విజిలెన్స్ విచారణ అడ్డంకిగా ఉండకూడదనే ఆలోచనతో సూపర్ స్పెషాలిటీ సేవలను పంద్రాగస్టులోగా నార్త్ తెలంగాణ ప్రజలకు అందించాలనే లక్ష్యంతో పనుల్లో వేగం పెంచారు.

శిథిలావస్థలో చిన్నకోవెల


హనుమకొండలోని సీతారామచంద్రస్వామి గుడి (చిన్నకోవెల)

- పెచ్చులూడిన పైకప్పు
- ఉరుస్తున్న మండపం
- కోట్ల విలువ చేసే ఆలయ భూమి అన్యాక్రాంతం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

హనుమకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని సీతారామచంద్రస్వామి దేవాలయం (చిన్నకోవెల) శిథిలావస్థకు చేరుకుంది. 300 ఏళ్లనాటి పురాతన ఆలయం పట్ల దేవాదాయ శాఖ చిన్నచూపు చూస్తోంది. ఈ ఆలయం ద్వారా ఆదాయం రావడం లేదన్న కారణంతో పట్టించుకోవడం లేదు. చారిత్రకంగా విశిష్టమైన నేపథ్యం కలిగిన ఈ ఆలయం పునరుద్ధరించే విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దేవాదాయశాఖ పరిధిలో 6సీ జాబితాలో ఉన్న ఈ గుడిని ఇలాగే వదిలేస్తే కూలే ప్రమాదం ఉందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ చౌరస్తాకు సమీపంలో రాగన్నదర్వాజ ప్రాంతంలో చిన్న కోవెల, పెద్ద కోవెల దేవాలయాలు అంటే తెలియనివారు ఉండరు. ఈ ఆలయాల పరిణామాన్ని బట్టి వీటికి ఈ పేర్లు వచ్చాయి. ఈ రెండు విష్ణు ఆలయాలే. చిన్న కోవెల సీతారామ చంద్రస్వామి, పెద్ద కోవెల రంగనాథస్వామి ఆలయాలు. నిత్యం ఎంతో మంది భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు. శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహించే ఆలయాల్లో చిన్న కోవెల ఒకటి.

కురుస్తున్న మండపం

ఆలయ మండపం వర్షం వస్తే ఉరుస్తోంది. రాతి పైకప్పు, స్తంభాల మధ్య ఏర్పడిన ఖాళీల మధ్య నుంచి వర్షపునీరు కారి ఆలయ ఆవరణం జలమయమవుతోంది. ఆలయ మండపం బలహీనపడింది. ఆవరణలోని పైకప్పు శిథిలమం కావడంతో పెచ్చులూడుతున్నది. ఎప్పుడు, ఎక్కడ ఊడి తలపై పడతాయోనని భక్తులు భయపడుతున్నారు. వర్షం నీరుకారి గోడలు దెబ్బతిన్నాయి. కప్పు క్రమంగా కుంగుతుంది. చాలాకాలంగా మరమ్మతులు లేకపోవడంతో పైకప్పుతో పాటు లోపలిగదీ దెబ్బతింది.

పట్టించుకోని దేవాదాయ శాఖ

ఐదో తరం అనువంశిక అర్చకుడు చెరుకుపెల్లి నర్సింహచారి భక్తులు ఇచ్చే కానుకలతోనే ఆలయం నిర్వహణను నెట్టుకొస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులతో ఆలయాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. చిన్న కోవెల దేవాదాయశాఖ పరిధిలో ఉన్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఆలయ దుస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని భక్తులు విమర్శిస్తున్నారు. ఆలయానికి మరమ్మతులు చేయాల్సిందిగా ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదంటున్నారు. ప్రజాప్రతినిధులు సైతం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

భూములు అన్యాక్రాంతం

చిన్న కోవెల ఆలయ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. ఈ ఆలయానికి హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతంలో ఉన్న మూడెకరాల భూమి ఆక్రమణకు గురైంది. కబ్జా చేసి దర్జాగా ఇళ్లను నిర్మించుకున్నారు. ఆలయానికి మరమ్మతులు చేయలేని దేవాదాయ శాఖ.. భూమిని కూడా కాపాడలేకపోతుంది. ఆక్రమణదారులపై ట్రిబ్యునల్‌లో కేసులు వేసి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ భూమి విలువ రూ.50 కోట్లకుపైనే ఉంది. ఇందులో ఏ కొంతభాగం విక్రయించినా ఆ వచ్చే ఆదాయంతో ఆలయాన్ని పునరుద్ధరించవచ్చునని భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సీతారామ చంద్రస్వామి ఆలయానికి తక్షణం మరమ్మతు చేసి కాపాడాలని భక్తులు కోరుతున్నారు.


ఆలయంలో పెచ్చులూడిన పైకప్పు


తేమతో దెబ్బ తింటున్న ఆలయ గది

లంచగొండుల ఆటకట్టు

(5వ పేజీ తరువాయి)

రూ.5వేలు ఇచ్చాడు. అదే సమయంలో అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు డీఈవోను, జూనియర్ అసిస్టెంట్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ ట్రాప్ అనంతరం కార్యాలయ రికార్డులు పరిశీలించగా, ఉపాధ్యాయుడి పోస్టింగ్ ఉత్తర్వులు గత ఫ్రిబవరిలోనే సిద్ధమైనట్టుగా తేలిందని, కానీ లంచం డబ్బుల కోసం డీఈవో, జూనియర్ అసిస్టెంట్ ఆ కాపీని ఇవ్వకుండా కాలయాపన చేశారని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. కాగా, ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నామని, మంగళవారం వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

ఇదిలావుండగా, ములుగు డీఈవో కార్యాలయంలో డీఈవో పాణిని, జూనియర్ అసిస్టెంట్ టి.దిలీప్‌కుమార్ ఏసీబీ వలలో చిక్కడం విద్యాశాఖ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. అనారోగ్య కారణాలతో సెలవులో వెళ్లిన ఉపాధ్యాయుడికి తిరిగి పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వడానికి లంచం డబ్బులు డిమాండ్ చేసి వేధింపులకు గురిచేయడం ఉపాధ్యాయ వర్గాలను నివ్వెరపరుస్తోంది. ఏసీబీ వలలో ఏకంగా డీఈవో చిక్కడం సంచలనమైతే, ఆయనతో పాటు దొరికిపోయిన జూనియర్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్ చరిత్ర కూడా తక్కువేమీ కాదని తెలిసింది. హనుమకొండ డీఈవో కార్యాలయంలో పనిచేసిన సమయంలో అతడు వేర్వేరు ఉదంతాల్లో రెండుసార్లు సస్పెండ్ అయ్యాడని తెలిసింది.



కాజీపేటలో 'సఖి' సేవలను వివరిస్తున్న శ్రీదేవి

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కాజీపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. సోమవారం కాజీపేటలోని కమ్యూనిటీ హాల్‌లో సఖి వన్‌స్టాప్ సెంటర్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సిలర్ శ్రీదేవి న్యాయ, వైద్య, పోలీసు, తాత్కాలిక వసతి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలకు 181, చైల్డ్‌లైన్‌కు 1098, 0870 - 2452112, 73829 83088 అనే నంబర్లకు బాధితులు ఫోన్ చేసి సలహాలు తీసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సీఈవో శ్రీనివాస్, సఖి కేసు వర్కర్ అనూష పాల్గొన్నారు.

కౌన్సిల్ హాల్ పనులు పూర్తి చేయాలి

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్‌తో కలిసి కౌన్సిల్ హాల్ పనుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బల్దియా ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న కౌన్సిల్ హాల్ పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కౌన్సిల్ హాల్ పనుల పురోగతిని కమిషనర్ చహత్ బాజ్ పాయితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. ఇప్పటికే కౌన్సిల్ హాల్ పునరుద్ధరణ పనులు చివరి దశకు చేరకున్నాయన్నారు. కౌన్సిల్ హాల్ పనులను వారం రోజుల్లోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఈఈలు రవికుమార్, మాధవిలత, డీఈలు రాజ్ కుమార్, కార్తీక్‌రెడ్డి, ఏఈలు రాగుల శ్రీకాంత్, నరేష్‌లు పాల్గొన్నారు.

చెత్తను బల్దియా ట్రాక్టర్‌లకే అందించాలి



బట్టల బజార్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

దుకాణదారులు ఇకపై చెత్తను బల్దియా ట్రాక్టర్లకే అందించాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 28వ డివిజన్ బట్టల బజార్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో పర్యటించి సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. కమర్షియల్ షాపుల యజమానులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. ఇంకా డ్రైన్‌లలో చెత్తను వేసే వారిని గుర్తించి ముందస్తు నోటీసులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ పసునూరి భాస్కర్‌లతో పాటు జవాన్లు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి దయాకర్




అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యూడెమోక్రసీ నేతలు

వడ్డేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో భేషరతుగా చర్చలు జరపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్, గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల17న హైదరాబాద్‌లోని ఇందిర పార్కు ధర్నా చౌక్ వద్ద శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగంలోని చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తున్నదని దుయ్యబట్టారు. అటవీ ప్రాంతంలోని ప్రకృతి వనరులు, ఖనిజ సంపదను స్వదేశీ కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే మధ్య భారతంలో మారణకాండను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు జయంత్, పాణి, వెంగళ్‌రెడ్డి, ఓంబ్రహ్మం, కరేటి శంకర్‌రావు యాదవ్, రాంబ్రహ్మం, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్

కేయూ క్యాంపస్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జూలై 9న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ పిలుపునిచ్చారు. సోమవారం కేయూ సీఐటీయూ వర్సిటీ ఉద్యోగుల కమిటీ సమావేశం జరిగింది. ఎ. శోభన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాగుల రమేశ్ హాజరై మాట్లాడారు. వర్సిటీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో వర్సిటీలోని ఖాళీలను నింపాలన్నారు. సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చుకాయల చిరంజీవి, సీఐటీయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి దేశిని రవికుమార్, ఆఫీస్ బేరర్ ఎరెల్లి శోభన్‌కుమార్, దైనంపల్లి రణధీర్, దామెర కృష్ణ, ఎం. మధు, శోభ, సందీప్, ప్రభాకర్‌లతో పాటు కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాగుల రమేశ్

'ప్రజావాణి' వినతులను పరిష్కరించాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్
- 145 ఫిర్యాదులు



బాధితుల సమస్యలు వింటున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 145 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రజల వినతులు స్వీకరించి సంబంధిత అధికారులను పిలిచి వెంటనే సమస్యపై ఎంక్వైరీ చేసి పరిష్కరించాలన్నారు. నూతనంగా జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన స్నేహ శబరీష్ బాధితుల సమస్యలను ఓపికగా వింటూ సమస్య పరిష్కారం అవుతుందనే భరోసా బాధితులకు కల్పించారు. రెవెన్యూ, గృహనిర్మాణ, భూ రికార్డుల సర్వే, విద్యుత్, మునిసిపల్, విద్య, పోలీస్, సాగునీటిపారుదల ఆర్‌అండ్‌బీ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, వైద్య ఆరోగ్యం, కుడా, ఉపాధి కల్పన, వ్యవసాయశాఖ, మైన్స్ శాఖలతో పాటు, వివిధ విద్యార్థి సంఘాల నాయకుల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఏఈపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ రికార్డుల ప్రకారం లేని నాలాను డిజిటల్ సర్వే అంటూ మ్యాప్‌లో ఉన్నట్లు చూపిస్తూ తాను నిర్మించుకున్న ఫంక్షన్‌హాల్ అనుమతిని అర్థాంతరంగా రద్దు చేసిన ఇరిగేషన్ ఈఈ శంకర్‌నాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఐనవోలు మండలం పంథిని గ్రామానికి చెందినమేరుగు రమేష్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేత

వరంగల్ స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్నేహ శబరీష్‌ను హనుమకొండ జిల్లా యువజన క్రీడల అధికారి (డీవైఎస్‌వో) అశోక్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం, పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ జిల్లాలోని క్రీడా వసతులపై కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డీటీ విజయలక్ష్మి, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణం

తరలివచ్చిన భక్తులు.. ప్రత్యేక పూజలు



నాగరాజరాజేశ్వర స్వామి దేవాలయంలో భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వడ్డేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డేపల్లి టీఎన్జీవోస్ కాలనీలోని శ్రీనాగరాజ రాజేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం అష్టాదశ 18వ వార్షిక త్రయాహ్నిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం రుద్రహోమం, మూలమంత్ర హోమాన్ని ఆలయ ప్రధానార్చకులు గొడపర్తి జీవన్‌శర్మ పర్యవేక్షణలో అర్చకులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రదోషకాల ఆరాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భద్రకాళి- భద్రేశ్వరుల కల్యాణ మహోత్సవంలో పాల్గొని కొలిచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుందూరు అనిల్‌రెడ్డి, కార్యదర్శి ఇ.కొండల్‌రావు, కోశాధికారి పి.విద్యాసాగర్, ఉపాధ్యక్షులు ఎన్.సురేందర్, సభ్యులు వరప్రసాద్, సదానందరావు, పబ్బ రవీందర్, కక్కెర్ల రమేష్, వీర రమేష్, సారయ్య, సురేందర్‌శర్మతో పాటు భక్తులు, వివిధ కాలనీల ప్రజలు పాల్గొని అర్చనలు, అభిషేకాలు చేశారు.

ఆర్థిక సాయం అందజేత

హనుమకొండ చౌరస్తా, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన బైరి నితిన్‌కుమార్ ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులను ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ (మెపా)వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ సోమవారం కలిసి రూ. 30 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నితిన్‌కుమార్ అకాల మృతితో ఆ కుటుంబం ఇబ్బందుల్లో ఉందని తెలుసుకొని రాష్ట్రవ్యాప్తంగా 60మంది ముదిరాజ్ ఉద్యోగులు సహకారంతో రూ. 30వేలు జమ చేసి గుడిబండల్‌లోని మృతుడి ఇంటికి వెళ్లి అతడి తల్లి సునీతకు అందజేశామన్నారు. మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, కార్యదర్శి దండు చిరంజీవి ముదిరాజ్, జిల్లా అధ్యక్షులు పులి రాజేష్ ముదిరాజ్, సభ్యులు విజేందర్, సమ్మయ్య, మహేష్, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దేవేందర్

బల్దియా కమిషనర్‌ను కలిసిన జేఏసీ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం బల్దియా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన బాజ్‌పాయ్‌ని సోమవారం బల్దియా జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు కలిశారు. కమిషనర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు ధర్మరాజు యాదవ్, అధ్యక్షుడు బొట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి బాకం సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, కోశాధికారి స్వర్ణన్‌రాజు, కార్యదర్శి బానోత్ బాలునాయక్, కార్యవర్గ సభ్యులు రమేష్, దయాకర్, రఘు, ఏలియా, ఆదాం, గట్టయ్య, సత్యం తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి

మట్టెవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకో వాలని వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సూచించారు. సోమవారం వరంగల్ చైతన్య హైస్కూల్ విద్యార్థులకు పోచమ్మమైదాన్ సెంటర్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవ గాహన కల్పించారు. ట్రాఫిక్ సింబల్స్, ట్రాఫిక్ వాయిలే షన్ వల్ల వచ్చే సమస్యలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మికులకు అన్యాయం

కాజీపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లతో కార్మికులకు ప్రయోజనం శూన్యమని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య అన్నారు. లేబర్ కోడ్‌లను నిరశిస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సోమవారం కాజీపేట ఇంపీరియల్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ మండల కమిటీ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పలయ్య హాజరై మాట్లాడారు. కార్మిక వర్గం 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం కార్మికులను బానిసలుగా మార్చడమే అన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిన మోదీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. వరంగల్ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మృతి చెందిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని తీర్మానం చేసినా ఇప్పటి వరకు పరిహారం అందలేదని ఆవేదన వెలిబుచ్చారు. సమావేశంలో యూనియన్ మండల అధ్యక్షుడు రొంటాల కోటేశ్వర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అరికెళ్ల వెంకటస్వామి, నాయకులు సతీష్,భాస్కర్, సుధాకర్, సవర్ణ తదితరులు పాల్గొన్నారు.



లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నినాదాలు చేస్తున్న కార్మికులు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం 53వ డివిజన్‌లోని లష్కర్ సింగారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎన్నో వాగ్దానాలు చేశారు కాని పేదల కష్టాలను తీర్చలేదని విమర్శించారు. పేదలకు న్యాయం చేయడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తుందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పక్కా ఇళ్లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజీజ్,రహిముస్నీసా, మట్టెడ అనిల్, మహేందర్, శ్యామ్, ప్రవీణ్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఈ క్రమంలోనే ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఇంటర్ పూర్తైన తర్వాత శ్రుతి బీటెక్‌లో చేరగా, వినయ్‌కుమార్ డిగ్రీలో చేరాడు. బీటెక్ పూర్తికావడంతో శ్రుతి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ చేస్తోంది. వినయ్‌ఞ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో జాబ్ చేస్తున్నాడు. కాగా, వీరు పదేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు.

పెళ్లి సంబంధాలు చూస్తున్నారని..

శ్రుతికి జాబ్ రావడడంతో కుటుంబ సభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలో శ్రుతి తన ప్రేమ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీనికి వారు నిరాకరించారు. సంబంధాలు వస్తుండడంతో ఎలాగైనా తనకు వివాహం చేస్తారని, ఈ విషయాన్ని వినయ్‌కు తెలిపింది. ఇదిలాఉండగా, స్వగ్రామానికి వచ్చిన శ్రుతి శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్లింది. శనివారం ఉదయం వినయ్ యథావిధిగా విధులకు వెళ్లాడు. శనివారం ఇంటి నుంచి వెళ్లిన వినయ్ ఆదివారం మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా పనిమీద భువనగిరి వచ్చానని తెలిపాడు. కాగా, శ్రుతి, వినయ్‌లు భువనగిరి వద్ద కలుసుకున్నారు. ఇంట్లో జరిగిన విషయాన్ని వినయ్‌కు చెప్పడంతో, తమకు వివాహం కాదేమోనని భావించి, ఆదివారం అర్ధరాత్రి భువనగిరి రైల్వేస్టేషన్ సమీపంలో ఎల్లమ్మ గుడి వద్ద గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో శ్రుతి, వినయ్‌కుమార్‌లుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అప్పగించారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు రోదనలు అక్కడివారిని కంటతడి పెట్టించింది.

డ్రంకెన్ డ్రైవ్‌లో 30 మందికి జరిమానా

మట్టెవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 30 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ సోమవారం రూ. 38,900 జరిమానా విధించారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరికి రూ. 1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

మినరల్ వాటర్ కూలర్ వితరణ



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

వరంగల్ లీగల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది కొక్కొండ రమేష్ మినరల్ వాటర్ కూలర్‌ను బార్ అసోసియేషన్‌కు బహూకరించారు. సోమవారం మహాత్మాగాంధీ బార్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన కూలర్‌ను హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు పులి సత్యనారాయణ, వలుస సుధీర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు రొండ్ల భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్దన్ వాటర్ కూలర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొక్కొండ రమేష్‌ను న్యాయవాదులు అభినందించారు. అదే విధంగా బార్ అసోసియేషన్ హాల్‌లోని టేబుల్స్‌పైకి రెగ్జిన్ కార్పెట్‌ను బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్స జనార్దన్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు డి. రమాకాంత్, కె. రవి, ఉపాధ్యక్షులు మైదం జయ పాల్, కార్యవర్గ సభ్యులు ఎం. శ్రీధర్, శశిరేఖ, ఆర్. నాగేంద్ర, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసం నడుం బిగించాలి

కవితా సంపుటి ఆవిష్కరణలో రచయిత్రి వాణిదేవి



'ఆమె మారింది' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న వాణిదేవి తదితరులు

హనుమకొండ కల్చరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళా సాధికారత కోసం ఇంకా ముఖ్యంగా కవయిత్రులు నడుం బిగించి రచనలు చేయాలని సమాజంలో మహిళల చైతన్యానికి రచనలు అవసరమని ప్రముఖ కథ రచయిత్రి, విమర్శకురాలు డాక్టర్ దేవులపల్లి వాణిదేవి పిలుపునిచ్చారు. హనుమకొండలోని అశోక్ హోటల్‌లో ఆదివారం రాత్రి అక్షరయాన్ ఉమెన్స్ రైటర్స్ ఫోరం వరంగల్ శాఖ అధ్యక్షురాలిగా వాణిదేవి తెలుగు రాష్ట్రాల మహిళా కవుల వివరాలతో కూడిన ప్రత్యేక డైరెక్టరీని విడుదల చేసింది. ఈ సందర్భంగా వృత్తిరీత్యా భాషోపాధ్యాయురాలిగా పని చేస్తున్న తిరునగరి వకుళవాసు కలం నుంచి జాలువారిన రెండో కవితా సంపుటి 'ఆమె మారింది' సంకలనాన్ని కూడా దేవులపల్లి వాణి ఆవిష్కరించారు. కవయిత్రి ప్రకృతి కవిగానే ఇంతకాలం చూశామని ఈ సంకళనంలో ఆమె సాధికారతను ఎలా కోరుకుంటుందో తన సాహిత్యం ద్వారా అద్భుతంగా ఆవిష్కరింపజేసిందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న నెల్లుట్ల రమాదేవి మాట్లాడుతూ కవిత్వం సున్నితంగానే ఉంటున్నా సమాజాన్ని మందలించినట్లుగా ఉంటుందని, తాను ఎంపిక చేసుకునే కవితా వస్తువు కూడా ప్రత్యేకంగా ఉంటుందని పేర్కొంటూ వకుళవాసు సాహిత్యాన్ని అభినందించారు. మాదారపు వాణిశ్రీ ఆమె మారింది సంకళనాన్ని పరిచయం చేస్తూ మొదటి కవితా సంపుటి వాసంత సమీరాలులో పెద్ద దర్వాజ లాంటి కవితలు సంస్కృతి సాంప్రదాయాలపై ప్రకృతి తత్వంతో రాసిందని, ఈ సంపుటిలో భావకవిత్వంతో పాఠకులను చదివింపజేసే సాహిత్యం సృజించిందన్నారు. మెరుగు అనురాధ, ఉదయశ్రీ ప్రభాకర్, అరుణ కీర్తిపతాక, అడ్డగూడి ఉమాదేవి తదితరులు వకుళవాసు సాహిత్య ప్రతిభపై ప్రసంగించారు. బాలబోయిన రమాదేవి, స్వాతి, శైలజ, రామ రత్నమాల, రాధిక నరేన్, వనపర్తి పద్మావతి, నిర్మళ తదితర అనేక మంది మహిళా కవయిత్రులు పాల్గొన్నారు. వకుళవాసును ఘనంగా సత్కరించారు.

హెచ్ఆర్‌టి

నడివయసులో నెలసరి ఆగడం సహజమే! కాబట్టి మహిళలు దాన్నొక సహజసిద్ధ మార్పుగా అంగీకరించి సర్దుకుపోతూ ఉంటారు. కానీ నడి వయసులో సైతం మునుపటి చురుకుదనం తగ్గకుండా ఉండాలన్నా, దీర్ఘకాలం పాటు అంతర్గత అవయవాలన్నీ నిక్షేపంగా ఉండాలన్నా, 'హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ'ని ఆశ్రయించక తప్పదు.



మెనోపాజ్‌కు ముందస్తుగానే సర్వసన్నద్ధం

ఆయుర్దాయం పెరిగింది. కాబట్టి మహిళల నడి వయసు 45 నుంచి 60 ఏళ్లకు పెరిగింది. ఇది సంతోషించవలసిన విషయమే! అయితే పిల్లల బాధ్యతలు తగ్గి, కాస్త సేద తీరదామనుకునే ఈ వయసులోనే మహిళల మీద మెనోపాజ్ అనే అతి పెద్ద పిడుగు పడుతూ ఉంటుంది. ఒళ్లంతా ఆవిర్లు, చమటలు పట్టడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, నిస్సత్తువ, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, నీరసం, భావోద్వేగాలు అదుపు తప్పడం... లాంటి అసౌకర్యాలన్నీ ఒక్కసారిగా నడి వయసు మహిళలను అతలాకుతలం చేయడం మొదలుపెడతాయి. ఎక్కువ మంది మహిళలు ఇవన్నీ పైబడే వయసులో మామూలే అని సర్దుకుపోతూ ఉంటారు. కానీ మెనోపాజ్ లక్షణాలు భౌతికంగా మాత్రమే వేధిస్తున్నాయనుకుంటే పొరపాటు. ఈ మెనోపాజ్ దశ, ఎముకలు, కండరాలు, జననావయవాలు, గుండె మొదలైన అవయవాలన్నిటినీ దెబ్బతీస్తుంది. అప్పటి వరకూ ఆయా అవయవాలకు రక్షణ కల్పించే ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ పరిమాణాలు మెనోపాజ్‌తో క్షీణించడమే ఇందుకు కారణం. అయితే ఈ పరిస్థితిని తప్పనిసరిగా భరించవలసిన అవసరం ఏమాత్రం లేదు.

కుటుంబంలో వైద్యపరమైన సహాయాన్ని అందుకునే సభ్యుల వరుసలో మహిళలు చివర్లో ఉంటారు. మొత్తం కుటుంబ అవసరతలను కనిపెట్టుకుని ఉండే మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. ఈ ధోరణికి చరమగీతం పలకాలి. మరీ ముఖ్యంగా హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ పట్ల మహిళల్లో భయాలను పెంచి, ఆ చికిత్సతో అందే ప్రయోజనాలను దక్కకుండా చేయడం కూడా సరి కాదు. కీలకమైన అంతర్గత అవయవాలన్నిటినీ ఆరోగ్యంగా ఉంచే ఈ థెరపీని తీసుకోగలిగితే, ప్రతి మహిళా తన నడి వయసును చలాకీగా, ఆరోగ్యంగా, ఆనందంగా గడపగలుగుతుంది.

పెరి మెనోపాజ్‌లోనే మొదలుపెట్టాలి

మెనోపాజ్ దశకు ముందు, నెలసరి స్రావం తగ్గడం, నెలసరి క్రమం తప్పడం, ఒంటి నుంచి వేడి ఆవిర్లు వెలువడడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది మెనోపాజ్ ముందరి దశ అయిన పెరి మెనోపాజ్. ఈ పెరి మెనోపాజ్ దశ నుంచే 'హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ' మొదలుపెట్టాలి. ఈ థెరపీని పదేళ్ల వరకూ కొనసాగించవచ్చు. శరీరంలో తగ్గిన హార్మోన్ పరిమాణాలను భర్తీ చేసే ఈ చికిత్సతో, మెనోపాజ్ అసౌకర్యాలకు అడ్డుకట్ట పడడంతో పాటు, అంతర్గత అవయవాలన్నీ దీర్ఘకాలం పాటు ఆరోగ్యంగా ఉంటాయి. అయితే మెనోపాజ్‌కు చేరుకుని, ఐదు నుంచి పదేళ్ల కాలం గడిచిపోయిన వాళ్లకు ఈ థెరపీతో అంతగా ప్రయోజనం ఉండదు. అన్నేళ్ల పాటు హార్మోన్ల లోపం ప్రభావానికి గురైన అవయవాలు ఈ థెరపీతో మళ్లీ కోలుకునే పరిస్థితి ఉండదు. కాబట్టి పెరి మెనోపాజ్‌లో, లేదంటే మెనోపాజ్‌కు చేరుకున్న రెండేళ్ల లోపే థెరపీ మొదలుపెట్టుకోవాలి. అయితే కొందరికి మెనోపాజ్‌లో ఆలస్యంగా లక్షణాలు బయల్పడవచ్చు. అలాంటి వాళ్లకు ఈ థెరపీ ప్రయోజనకరంగా ఉంటుంది. పదేళ్లుగా మెనోపాజ్‌లో ఉండి, ఎముకలు, కండరాల నొప్పులు, నిస్సత్తువలాంటి లక్షణాలతో బాధపడుతున్నవాళ్లు హెచ్ఆర్‌టికి బదులు, లక్షణాల ఆధారంగా చికిత్స తీసుకుని, పరిస్థితిని మెరుగుపరుచుకోవచ్చు.



హెచ్ఆర్‌టితో ప్రయోజనాలు

- పెరి మెనోపాజ్‌లోనే హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ మొదలుపెడితే...
- యోని పొడిబారే సమస్య తొలగిపోతుంది
- మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు అదుపులోకొస్తాయి
- లైంగిక జీవితం మెరుగుపడుతుంది
- గుండెకు రక్షణ దక్కుతుంది
- ఎముకలు దృఢంగా ఉంటాయి
- జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉంటుంది

ప్రస్తుతం మన ఆయుష్షు పెరిగింది. దాంతో జీవిత దశల నిడివి, పరిభాష కూడా మారింది. మునుపు 45 నుంచి 50 ఏళ్లను నడి వయసుగా పరిగణించేవారు. కానీ ప్రస్తుతం, నడి వయసు నిడివి 45 నుంచి 65 ఏళ్లకు పెరిగింది. ఫలితంగా 1/3 వంతు జీవితాన్ని మహిళలు మెనోపాజ్‌లోనే గడపవలసి ఉంటుంది. కాబట్టి ఆ జీవితాన్ని చలాకీగా, ఆరోగ్యంగా గడపగలిగేలా ఉండాలి. అందుకోసం హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీని పెరి మెనోపాజ్ దశ నుంచి కనీసం పదేళ్ల పాటు తీసుకోవాలి.

ఈ పరీక్షలు తప్పనిసరి

హార్మోన్ థెరపీతో క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుందనే అపోహలు ప్రచారంలో ఉండడంతో మహిళలు వెనకడుగు వేస్తూ ఉంటారు. కానీ ఈ థెరపీ విషయంలో వైద్యులు కొన్ని ప్రమాణాలను పాటిస్తూ ఉంటారు. ముందస్తు పరీక్షలతో, క్రమం తప్పని పర్యవేక్షణతో క్యాన్సర్ ముప్పు దరి చేరే అవకాశాలు లేకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తారు. ఈ థెరపీకి ముందు కొన్ని పరీక్షలు చేయించుకోవాలి. అవేంటంటే...

- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను గుర్తించే పాప్‌స్మియర్
- ఎండోమెట్రియల్ క్యాన్సర్‌ను గుర్తించే అల్ట్రాసౌండ్ పరీక్ష
- రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించే మామోగ్రామ్
- లిపిడ్ ప్రొఫైల్
- థైరాయిడ్ పరీక్ష
- కాలేయ పనితీరు పరీక్ష
- ఎముకల దృఢత్వాని పరీక్షించే డెక్సా స్కాన్
- కండరాల పటుత్వానికి సంబంధించిన పరీక్ష



కుటుంబ చరిత్రలో క్యాన్సర్ ఉంటే?

కుటుంబ చరిత్రలో క్యాన్సర్ ఉంటే ఈ థెరపీని ఇవ్వలేని పరిస్థితి మునుపు ఉండేది. కానీ ఇప్పుడు అలా కాదు. కుటుంబంలో క్యాన్సర్ ఉన్నప్పటికీ, నిర్దిష్ట మహిళకు క్యాన్సర్ లేనప్పుడు, కచ్చితంగా థెరపీ తీసుకోవచ్చు. అయితే ఈ చికిత్స తీసుకుంటున్నంత కాలం ప్రతి మహిళా క్రమం తప్పకుండా వైద్యులు సూచించే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. రొమ్ముల పరీక్ష, మామోగ్రామ్, అల్ట్రాసౌండ్ పరీక్షలు ప్రతి ఏటా చేయించుకోవాలి.

హెచ్ఆర్‌టి ఇలా...

మాత్రలు, ప్యాచెస్, చర్మం అడుగున అమర్చే వీలుండే ఇంప్లాంట్స్ రూపాల్లో హెచ్ఆర్‌టి తీసుకోవచ్చు. శరీర తత్వం ఆధారంగా ఒక్కొకరికి ఒక్కొక చికిత్స సరిపడుతుంది. మాత్రలతో పోలిస్తే ప్యాచెస్, ఇంప్లాంట్స్‌తో దుష్ప్రభావాలు తక్కువ. ఆరోగ్య కారణాలతో గర్భాశయాన్ని తొలగించిన మహిళలు ప్యాచెస్, లేదా ఈస్ట్రోజన్ మాత్రలు వాడుకోవచ్చు. కానీ గర్భాశయం కలిగి ఉన్న మహిళలకు ఈస్ట్రోజన్‌తో పాటు ప్రొజెస్టరాన్ కూడా అవసరమవుతుంది కాబట్టి రెండు రకాల మాత్రలు వాడుకోవాలి. కేవలం ఈస్ట్రోజన్ మాత్రమే అవసరమున్న మహిళలు, ఖర్చును భరించే స్థోమత కలిగినవాళ్లు ప్యాచెస్ వాడుకోవచ్చు.

మెనోపాజ్‌లో...

నడి వయసు మహిళల్లో కండర శక్తి తగ్గిపోతుంది. దాంతో నొప్పులు వేధించడం మొదలుపెడతాయి. సాధారణంగా ఈ నొప్పులను కీళ్ల అరుగుదలగా పొరబడుతూ ఉంటారు. కానీ కండరాలను బలపరిచే వ్యాయామాలు చేస్తూ, ఆరోగ్యకరమైన ఆహారశైలిని అనుసరించగలిగితే నొప్పులు అదుపులోకొస్తాయి. నడి వయసుకు చేరుకున్న కొందరికి తరచూ మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు వేధిస్తూ ఉంటాయి. ఇలాంటి వాళ్లు కొంత కాలం పాటు వెజైనల్ క్రీమ్స్ వాడుకోవచ్చు. అలాగే అవసరాన్ని బట్టి ఎముకలను దృఢంగా ఉంచే కొన్ని సప్లిమెంట్లు వాడుకోవాలి. వంట చేయడం, ఇంటి పనులు వ్యాయామం కోవలోకి రావు. కాబట్టి నడక లాంటి వ్యాయామాలతో పాటు బరువులను ఎత్తే వ్యాయామాలు కూడా కొనసాగించాలి. అలాగే పౌష్టికాహారం తీసుకోవాలి. ఎముకల మీద బరువు పడకుండా ఉండేలా వ్యాయామాలతో కండరాలను బలపరుచుకోగలిగితే కీళ్ల నొప్పులు అదుపులోకొస్తాయి.


డాక్టర్ ఎ.మహిత రెడ్డి
అబ్‌స్టెట్రిషియన్ అండ్ గైనకాలజిస్ట్,
అపోలో క్రేడిల్, జూబ్లీహిల్స్, హైదరాబాద్

మీకు తెలుసా?

వీటితో క్యాన్సర్ ముప్పు

మనం రోజూ తీసుకునే ఆహారపదార్థాలు క్యాన్సర్ కారకాలు కావచ్చని హార్వర్డ్ వైద్యులు, డాక్టర్ సురభ్ సేథీ హెచ్చరిస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం!

ప్రాసెస్ చేసిన మాంసం: సాసేజ్‌లు, ముందస్తుగా ఉడికించి ఉంచిన మాంసాలను గ్రూప్ 1 క్యాన్సర్ కారకాలుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వర్గీకరించింది. వీటితో ప్రత్యేకించి పెద్ద పేగు క్యాన్సర్ ముప్పు ఉందనే స్పష్టమైన ఆధారాలున్నట్టు తేలిపోయింది. ఈ మాంసాల నిల్వ కోసం ఉపయోగించే నిల్వ పదార్థాలు, నైట్రేట్స్ పేగుల్లోని కణాలను దెబ్బతీసి, దీర్ఘకాలంలో క్యాన్సర్ కారక ఉత్పరివర్తనాలకు దారి తీస్తాయి. కాబట్టి ఈ రకం మాంసాహారానికి దూరంగా ఉండడం ఉత్తమం

తీపి పానీయాలు: శీతల పానీయాలు, తీయని ద్రవపదార్థాలు రక్తంలో చక్కెర మోతాదులను పెంచడానికి మించి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. వీటితో శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ పెరిగి, రొమ్ము, పెద్దపేగు, క్లోమ క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది. కాబట్టి తీయని పానీయాలకు బదులుగా కొబ్బరినీళ్లు, హెర్బల్ టీలు లాంటి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి

వేపుళ్లు: ఫ్రెంచ్ ఫ్రైస్, సమోసాలు, బజ్జీలను వేయించడం కోసం ఒకే నూనెను పదే పదే ఉపయోగిస్తూ ఉంటారు. దాంతో ఈ నూనెల్లో క్యాన్సర్ సంబంధిత కాంపౌండ్, అక్రిలమైడ్ తయారవుతుంది. కాబట్టి ఇలాంటి పదార్థాలను పదే పదే తినడం వల్ల ఆక్సిడేటివ్ స్ట్రెస్, తీవ్రమైన ఇన్‌ఫ్లమేషనుల పెరిగి, క్యాన్సర్ వృద్ధికి అనువైన పరిస్థితులు శరీరంలో చోటు చేసుకుంటాయి. కాబట్టి ఇలా నూనెలో వేయించడానికి బదులుగా బేక్ చేయడం లేదా ఎయిర్ ఫ్రైయింగ్ పద్ధతులను అనుసరించడం ఆరోగ్యకరం

కాల్చిన మాంసం: అత్యధిక ఉష్ణోగ్రతలను కలిగి ఉండే గ్రిల్స్ మీద మాంసాన్ని కాల్చే సమయంలో డిఎన్ఎను దెబ్బతీసే హానికారక కాంపౌండ్లు విడుదల అవుతాయి. ఇవి క్యాన్సర్‌ను పెంచుతాయి. అలాగే గ్రిల్ చేయడానికి ముందు మాంసాన్ని నానబెట్టడం, రోజ్‌మేరీ లాంటి మూలికలను ఉపయోగించడం వల్ల ఈ ముప్పు కొంతమేరకు తగ్గుతుంది. అయితే



గ్రిల్‌కు బదులుగా ఆవిరి మీద ఉడికించడం, బేక్ చేయడం లేదా చిన్న మంట మీద ఎక్కువ సమయం పాటు ఉడికించడం సురక్షితం

మద్యపానం: మద్యంతో ఈస్ట్రోజన్ హార్మోన్ మోతాదు పెరిగి ఫోలేట్ శోషణ కుంటుపడుతుంది. ఈ పరిస్థితి డిఎన్ఎ మరమ్మతు యంత్రాంగాన్ని ప్రభావితం చేస్తుంది. దీంతో హార్మోన్ సంబంధిత రొమ్ము, కాలేయ క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది. కాబట్టి మద్యానికి బదులుగా పులియబెట్టిన నాన్ ఆల్కహాలిక్ పానీయాలైన బీట్‌రూట్ కాంజి, కంబూచ లాంటి సురక్షితమైన ఆరోగ్య ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి.

అధ్యయనం

అవి డిమెన్షియా సంకేతాలు కావచ్చు

మలి వయసు భావోద్వేగ సమస్యలు ముందస్తు డిమెన్షియా లాంటి నాడీక్షీణత జబ్బులకు సంకేతాలని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే....

40 ఏళ్ల తర్వాత తలెత్తే ఉన్మాదం, బైపోలార్ డిజార్డర్, మానసిక కుంగుబాటు లాంటి రుగ్మతలు కేవలం మానసిక రుగ్మలు మాత్రమే కావనీ, వివిధ నాడీక్షీణత వ్యాధుల లక్షణాలకు ముందు బయల్పడే ముందస్తు సంకేతాలు కావచ్చని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. జ్ఞాపకశక్తి క్షీణత బయల్పడడానికి ఎన్నో సంవత్సరాల ముందుగానే బయల్పడే ఈ లక్షణాలు నాడీక్షీణత రుగ్మత అయిన డిమెన్షియా ముప్పును సూచిస్తాయని, జపాన్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు పేర్కొంటున్నారు. అల్జీమర్స్ అండ్ డిమెన్షియాలో ప్రచురితమైన అధ్యయనంలో పరిశోధకులు, నాడీక్షీణత రుగ్మతలకు కారణమయ్యే అసాధారణ టౌ ప్రొటీన్, దాని ప్రభావాల గురించి ప్రస్తావించారు. ఈ ప్రొటీన్ ఉనికిని కనిపెట్టడం కోసం పెట్ స్కాన్‌ను ఉపయోగించిన పరిశోధకులు, నాడీక్షీణత రుగ్మతకు గురైన రోగుల్లో ఈ టౌ ప్రొటీన్ అధిక మొత్తంలో ఉన్నట్టు గుర్తించారు. భావోద్వేగ సమస్యలున్న వీరిలో ఎలాంటి ముందస్తు నాడీక్షీణత రుగ్మతల లక్షణాలు కనిపించలేదు కాబట్టి టౌ ప్రొటీన్ ఉనికి ఆధారంగా నాడీక్షీణత రుగ్మతలు ప్రారంభంలో మానసిక రుగ్మతల లక్షణాల రూపంలోనే బయల్పడతాయనే విషయాన్ని పరిశోధకులు నిర్ధారించారు.



తెలుసుకుందాం

రెండింతలు ఎక్కువ తినేస్తున్నాం

ఒక మనిషి రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పు తినాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాతీయ పోషకాహార సంస్థలు సూచిస్తున్నాయి. కానీ మన ఉత్తరాది రాష్ట్రాల్లో సగటున ఒక మనిషి రోజుకు 12 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకుంటున్నారు. ఇలా అధిక ఉప్పు తీసుకోవడం వలన అధిక రక్తపోటు, గుండె జబ్బులు, గుండెపోటు, మూత్రపిండాల సమస్యలు పెరిగే ప్రమాదం ఉంటుంది. రక్తపోటును పరిష్కరించే లక్ష్యంతో ఇటీవల నిర్వహించిన ఓ జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో వైద్యులు ఈ విషయాలను ప్రస్తావించారు. రెస్టారెంట్లు, హోటళ్లతో పాటు ఇంట్లో వండే వంటల్లోనూ ఉప్పును అధికంగా వాడుతున్నారని వైద్యులు అంటున్నారు. 80 శాతం ఉప్పు ఇంటి వంటల ద్వారానే తీసుకుంటున్నామనీ, ముఖ్యంగా ఊరగాయలు, అప్పడాలు, చట్నీలు, సలాడ్, మజ్జిగ, సాస్‌ల ద్వారా ఉప్పు అధిక మోతాదులో తీసుకుంటున్నట్టు తెలిపారు. గులాబీ ఉప్పు, రాతి ఉప్పు, సముద్రపు ఉప్పు తక్కువగా ఉఉంటుందన్నది అపోహ మాత్రమేనని వైద్యులు అంటున్నారు. కాకపోతే వాటిలోని ఖనిజాల పరిమాణాల్లో స్వల్ప వ్యత్యాసం ఉంటుందని స్పష్టం చేశారు.



పారాహుషార్

చల్లనీళ్ల స్నానం వీళ్లకు చేటు

చల్లనీళ్ల స్నానంతో వాపులు, నొప్పులు తగ్గుతాయి. చర్మపు దురదలు అదుపులోకొస్తాయి. కానీ చల్లనీళ్ల స్నానం అందరికీ ప్రయోజనాలను అందించదు. ప్రత్యేకించి కొందరికి చల్లనీళ్ల స్నానంతో చేటు కలుగుతుంది. వాళ్లెవరంటే...



చల్లనీళ్ల స్నానంతో రక్తనాళాలు సంకోచిస్తాయి. దాంతో రక్తపోటు, గుండె కొట్టుకునే వేగం పెరుగుతాయి. కాబట్టి కొరొనరీ ఆర్టెరీ డిసీజ్, లేదా గుండె వైఫల్యం లాంటి గుండె జబ్బులున్నవాళ్లు చల్లనీళ్లతో స్నానం చేస్తే గుండె పోటు లేదా స్ట్రోక్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గుండెపోటు చరిత్ర కలిగిన వ్యక్తులు, లేదా సెరెబ్రోవ్యాస్క్యులర్ వ్యాధి ఉన్న రోగులు కూడా చల్లనీళ్లకు దూరంగా ఉండాలి. నీటి ఉష్ణోగ్రతల్లో అకస్మాత్తుగా చోటుచేసుకునే వ్యత్యాసాలతో రక్తపోటు పెరుగుతుంది. కాబట్టి గుండెపోటు చరిత్ర కలిగిన వ్యక్తులు చల్లనీళ్లకు దూరంగా ఉండాలి. చేయి, కాలి వేళ్లలోని రక్తనాళాలు కుంచించుకుపోయే రేనాడ్స్ జబ్బు ఉన్న వ్యక్తులు చల్లనీళ్లతో స్నానం చేస్తే, విపరీతమైన బాధ, మొద్దుబారిపోవడం, అసౌకర్యాలకు లోనయ్యే అవకాశాలుంటాయి. కాబట్టి ఈ కోవకు చెందిన వాళ్లు కూడా చల్లనీళ్లకు దూరంగా ఉండాలి. సహజంగానే పెద్దలకు హృద్రోగ ముప్పు ఎక్కువ. పైగా శరీర ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించే సామర్థ్యం కూడా పెద్దల్లో తక్కువగా ఉంటుంది. కాబట్టి చల్లనీళ్ల స్నానంతో వాళ్ల శరీరాలు షాక్‌కు గురయ్యే అవకాశాలుంటాయి. దాంతో గుండె సమస్యలు తలెత్తుతాయి లేదా కళ్లు తిరిగి పడిపోవడం లాంటి ప్రమాదాలు కూడా జరుగుతాయి.

హెయిర్ ఫాల్

వెంట్రుకలు రాలుతున్నాయా?

వెంట్రుకలు ఊడుతున్నాయనే ఆందోళన ఎంతో కొంత ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. అయితే ఎన్ని వెంట్రుకలు ఊడితే సమస్యగా పరిగణించాలి? ఆ సమస్యను ఎలా చక్కదిద్దుకోవాలి? తెలుసుకుందాం!

వెంట్రుకలు ఊడడం, పెరగడం సహజం. అయితే కొన్ని సందర్భాల్లో ఊడిపోవడమే తప్ప, తిరిగి పెరిగే పరిస్థితి ఉండదు. అయితే వెంట్రుకలు అడపాదడపా రాలుతూనే ఉంటాయి కాబట్టి దాన్ని సమస్యగా పరిగణించాలో, లేదో తెలియక అయోమయానికి గురవుతూ ఉంటాం. నిజానికి దువ్వినప్పుడు, తలస్నానం చేసినప్పుడు రాలిపోయే 10 నుంచి 15 వెంట్రుకలను చూసుకుని కంగారు పడిపోకూడదు. తలలో ఒకే చోట వెంట్రుకలు కుచ్చులా ఊడిపోవడం, ప్యాచ్‌లాగా ఏర్పడడం, మొటిమలు లాంటివి తలెత్తినా, రోజుకు వందకు మించి వెంట్రుకలు రాలిపోతున్నా వెంటనే అప్రమత్తం కావాలి. అయితే కొన్ని సందర్భాల్లో తాత్కాలికంగా వెంట్రుకలు రాలతాయి. ఎప్పుడంటే...

వైరల్ జ్వరాలు: ఈ జ్వరాలు వచ్చి తగ్గిన తర్వాత కూడా వెంట్రుకలు రాలతాయి. ఇలాంటి సందర్భాల్లో ఆందోళనపడవలసిన అవసరం లేదు. మాంసకృత్తులతో కూడిన పోషకాహారం తీసుకోగలిగితే ఈ పరిస్థితి నెమ్మదిగా సర్దుకుంటుంది

ప్రసవానంతరం: ప్రసవం తర్వాత కూడా వెంట్రుకలు రాలతాయి. ఇది సహజం. అయితే సప్లిమెంట్లతో, పౌష్టికాహారంతో ఈపరిస్థితిని చక్కదిద్దుకోవచ్చు

థైరాయిడ్: వెంట్రుకలు రాలడంతో పాటు అకారణంగా బరువు తగ్గినా, పెరిగినా థైరాయిడ్ సమస్యగా అనుమానించి వైద్యులను కలవాలి

పిల్లల్లో: సాధారణంగా పిల్లల్లో పోషకాహార లోపాల వల్ల వెంట్రుకలు రాలతాయి. కాబట్టి ఇనుము ఎక్కువగా ఉండే నట్స్, పప్పుధాన్యాలు, గుడ్లు, మాంసాహారం ఇవ్వాలి

సౌందర్య చికిత్సలు: స్ట్రెయిటెనింగ్ లాంటి చికిత్సలతో వెంట్రుకలు రాలతాయి. అలర్జీలు కలిగి ఉండి హెయిర్ డై వేసుకున్నప్పుడు వెంట్రుకలు రాలతాయి

పిసిఒఎస్: పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ ఉన్న మహిళల్లో వెంట్రుకలు రాలే సమస్య తీవ్రంగా ఉంటుంది



వెంట్రుకలు రాలకుండా...

- కంటినిండా నిద్రపోవాలి. నిద్రవేళలు క్రమం తప్పకుండా చూసుకోవాలి
- పోషకాహారం తీసుకోవాలి
- శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి
- హార్మోన్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి
- శిరోజాల సౌందర్య చికిత్సలకు దూరంగా ఉండాలి
- శిరోజాల శుభ్రత పాటించాలి

వాటి వాడకం వ్యర్థం

కొందరు జుట్టు రాలే సమస్యను అరికట్టడం కోసం తరచూ షాంపూలు, నూనెలను మార్చేస్తూ ఉంటారు. నిజానికి జుట్టు పెరగడానికీ, రాలకుండా ఉండడానికీ షాంపూలు, నూనెలు ఏ విధంగానూ ఉపయోగపడవు. చుండ్రు, తలలో మొటిమలు లాంటి సమస్యలకు మాత్రమే కొన్ని షాంపూలు ఫలితాన్నివ్వగలుగుతాయి.

వైద్యులను ఎప్పుడు కలవాలి?

- రోజుకు వంద కంటే ఎక్కువ వెంట్రుకలు రాలుతున్నప్పుడు
- నుదుటి దగ్గరి వెంట్రుకలు వెనక్కి వెళ్లిపోతున్నప్పుడు
- మహిళల్లో పాపిట వెడల్పుగా మారిపోయినప్పుడు
- వెంట్రుకలు పలుచబడి మాడు కనిపిస్తున్నప్పుడు
- తలలో ఒకే చోట పేను కొరుకుడు తలెత్తినప్పుడు
- దురద, మొటిమలు ఉన్నప్పుడు

ఈ పరీక్షలు తప్పనిసరి

డెర్మోస్కోపిక్ ఎగ్జామినేషన్, రక్త పరీక్షలతో వెంట్రుకలు రాలే సమస్య తీవ్రతను వైద్యులు అంచనా వేయగలుగుతారు. డెర్మోస్కోపిక్ పరీక్షతో వెంట్రుకల కుదుళ్లు, వాటిలో నాటుకున్న వెంట్రుకల పరిస్థితి, రాలే వెంట్రుకల తీవ్రత, చుండ్రు, సెబోరిక్ డెర్మటైటిస్ లాంటి ఇన్‌ఫెక్షన్లను వైద్యులు తెలుసుకోగలుగుతారు. రక్తపరీక్షతో విటమిన్ డి, ఐరన్, బి12 లోపాలతో పాటు థైరాయిడ్, అనీమియా, ఇతరత్రా అంతర్గత ఆరోగ్య సమస్యలను కూడా కనిపెట్టగలుగుతారు.

ఆధునిక చికిత్సలొచ్చాయి

మునుపు బట్టతల కోసం మోనాక్సిడిల్ అనే పైపూత మందు వినియోగంలో ఉండేది. ఇప్పుడు బట్టతలను అడ్డుకునే డిహెచ్‌టి ఇన్హిబిటర్ లోషన్లు కూడా అందుబాటులోకొచ్చాయి. అలాగే కాంబినేషన్‌తో కూడిన క్రీములు, లోషన్లు కూడా అందుబాటులోకొచ్చాయి. మునుపు మోనాక్సిడిల్‌తో దురద, మంట సమస్య ఉండేది. కానీ ఇప్పుడు ఇది మాత్రలు, ఇంజెక్షన్ల రూపంలో దొరుకుతోంది. మూల కణాల నుంచి విడుదలయ్యే ఎక్సోజోమ్స్ వెంట్రుకల కుదుళ్లను ప్రేరేపించి, వెంట్రుకల పెరుదలకు తోడ్పడతాయి. ప్రస్తుతం జంతువులు, సముద్ర జీవుల నుంచి సేకరించిన ఎక్సోజోమ్స్‌ను వెంట్రుకల పెరుగుదలకు ఉపయోగిస్తున్నారు. అలాగే మునుపటి పిఆర్‌పి చికిత్సకు బదులుగా ఇప్పుడు గ్రోత్ ఫ్యాక్టర్ కాన్‌సెంట్రేట్ పిఆర్‌పి అనే సమర్థమైన, ఆధునిక చికిత్స అందుబాటులో కొచ్చింది. అలాగే మునుపు హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ కోసం వెంట్రుకలను పొట్టిగా కత్తిరించి ఉపయోగించేవారు. కానీ ఇప్పుడు పొడవాటి వెంట్రుకలను కూడా ట్రాన్స్‌ప్లాంట్ చేయగలుగుతున్నారు.


డాక్టర్ స్వప్నప్రియ
కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్, హైదరాబాద్

అక్రమ నిర్మాణాలకు అవకాశం ఇచ్చి.. ఆపై కూల్చివేతల పేరుతో డ్రామా!

» జీహెచ్ఎంసీ అధికారులపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అధికారుల అవినీతి, నిర్లక్ష్యంపై హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమ నిర్మాణం జరుగుతోందని తెలిసినప్పటికీ ఏ చర్యలు తీసుకోకుండా భవన నిర్మాణం పూర్తయిన తర్వాత కూల్చివేస్తామంటూ డ్రామాలు ఆడుతుంటారని పేర్కొంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేట్ గ్రామంలోని సర్వే నెంబర్ 32లో ఉన్న భవనం ఐదో అంతస్తుకు నోటీసు ఇవ్వడం చెల్లదని పేర్కొంటూ కే రఘువీరాచారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. ' భవన నిర్మాణం మొత్తం పూర్తయ్యే వరకు జీహెచ్ఎంసీ అధికారులు ఏం చేస్తున్నారు? నిర్మాణం జరుగుతున్నప్పుడు కళ్లు మూసుకున్నారా? జీహెచ్ఎంసీ సిబ్బంది అక్రమ నిర్మాణాలకు అవకాశం కల్పించి.. భవన యజమానులు హైకోర్టుకు వచ్చిన తర్వాత తీరిగ్గా ఆర్డర్ ఇస్తారు. ఈలోపు అక్కడ నిర్మాణం మొత్తం పూర్తవుతుంది. ఇక కూల్చివేస్తామంటూ డ్రామా మొదలుపెడతారు. జీహెచ్ఎంసీలో ప్రతి ప్రాంతానికి అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా ఉన్నారు కదా ? అలాంటప్పుడు అక్రమ నిర్మాణాలకు అవకాశం ఎలా లభిస్తోంది. వేలసంఖ్యలో అక్రమ నిర్మాణాలు ఎలా వెలుస్తున్నాయి. పన్ను వసూళ్లు చేసేటప్పుడు మాత్రం ఏదీవదలకుండా చూస్తారు ' అని వ్యాఖ్యానించింది. ప్రస్తుత పిటిషనర్ బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీం (బీఆర్ఎస్) కింద పెట్టుకున్న దరఖాస్తుపై నిర్ణయం తీసుకునే వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పేర్కొంటూ యథాతథ స్థితి విధించింది. విచారణను జూలై 15కు వాయిదా వేసింది.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ

» క్వారీ యజమానిని బెదిరించిన కేసులో విచారణ ఎదుర్కోవాలని స్పష్టీకరణ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. క్వారీ నడవాలంటే రూ. 50 లక్షలు ఇవ్వాలని యజమాని మనోజ్‌రెడ్డిని బెదిరించిన కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టంచేసింది. మనోజ్‌రెడ్డిని బెదిరించిన వ్యవహారంపై హనుమకొండ సుబేదారి పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం డిస్మిస్ చేసింది. డబ్బుల కోసం తన భర్తను కౌశిక్ రెడ్డి తీవ్రంగా వేధిస్తున్నారని పేర్కొంటూ క్వారీ యజమాని మనోజ్‌రెడ్డి భార్య కట్టా ఉమాదేవి హనుమకొండ సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ కేసును కొట్టేయాలని పేర్కొంటూ కౌశిక్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం ఈనెల 10వ తేదీన తీర్పు రిజర్వు చేసింది. విచారణను ఎదుర్కోవాలంటూ తాజాగా తీర్పు వెలువరించింది. కాగా, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై నమోదైన ఓ ఎన్నికల కేసులో కరీంనగర్ మేజిస్ట్రేటు కోర్టులో ప్రత్యక్ష హాజరు నుంచి ఆయనకు మినహాయింపు ఇచ్చింది.

టీజీ పీజీఈసెట్ పరీక్షలు షురూ

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న టీజీ పీజీఈసెట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ పరీక్షలకు హైదరాబాద్ రీజియన్‌లో 8, వరంగల్ రీజియన్‌లో రెండు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. తొలిరోజు పరీక్షలకు మొత్తం 12,446మంది నమోదు చేసుకోగా, 11,626 మంది (93.41శాతం) అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో నిర్వహించిన ఫార్మసీ పరీక్షకు 96.17 శాతం మంది హాజరు కాగా, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన సివిల్, ఎలక్ట్రికల్, ఏరోస్పేస్, ఫుడ్ టెక్నాలజీ తదితర పరీక్షలకు కలిపి 88.56 శాతం మందే హాజరయ్యారు.

జనగణనకు నోటిఫికేషన్

విడుదల చేసిన కేంద్ర హోంశాఖ.. మంచు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో 2026 అక్టోబరు 1 నాటికి పూర్తి

న్యూఢిల్లీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో జనాభా లెక్కింపు కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 16వ జనగణను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు అందులో స్పష్టం చేసింది. మొదటి దశ 'హౌజ్ లిస్టింగ్ ఆపరేషన్ (హెచ్ఎల్ఓ)'లో భాగంగా.. ప్రజల ఇంటి పరిస్థితులు, వారి ఆస్తులు, ఇళ్లల్లో ఉండే సౌకర్యాల వివరాలను సేకరిస్తారు. ఈ ప్రక్రియను 2026 ఏప్రిల్‌లోనే ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇక, రెండో దశ (పాపులేషన్ ఎన్యూమరేషన్)లో భాగంగా ప్రజల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వివరాలను సేకరిస్తారు. మంచు ఎక్కువగా ఉండే జమ్ము, కశ్మీర్, లద్దాఖ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో 2026 అక్టోబరు 1 నాటికి, దేశంలోని మిగతా ప్రాంతాల్లో 2027 మార్చి 1 నాటికి జనగణనను పూర్తిచేయనున్నట్లు కేంద్రం తన నోటిఫికేషన్‌లో వివరించింది. అలాగే.. ప్రజలు తమ వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో, యాప్‌లో స్వయంగా నమోదు చేసుకునే (సెల్ఫ్ ఎన్యూమరేషన్) వీలునూ కల్పిస్తున్నట్టు తెలిపింది. 34 లక్షల మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, 1.3 లక్షల మంది సిబ్బందితో.. ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించే ఈ భారీ కార్యక్రమానికి రూ.13 వేల కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా. సమాచార సేకరణకు సంబంధించి ఈ ఏడాది అక్టోబరు నుంచే ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించే సిబ్బందికి, సూపర్‌వైజర్లకు 45 వేల మందికి పైగా ఫీల్డ్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారు. వారికి 1800 మంది మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారు. వారికి శిక్షణ ఇవ్వడానికి జాతీయస్థాయిలో 100 మంది శిక్షకులు ఉంటారు. జనగణనలో భాగంగా ఎన్యూమరేటర్లు 30కి పైగా ప్రశ్నలు అడిగి పౌరుల నుంచి సమాధానం రాబడతారు. వారు ఎలాంటి ఇంట్లో ఉంటున్నారు? ఇంట్లో ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉందా? వాడే వాహనాలేంటి? తినే తిండి, నీటి వనరులేంటి? ఇంటి పెద్ద స్త్రీయా? పురుషుడా? తదితర వివరాలను ఈ గణనలో భాగంగా సేకరించనున్నారు. సేకరించిన సమాచారం లీక్ కాకుండా అత్యంత కట్టుదిట్టమైన



ఏర్పాట్లు చేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

2020లో వాయిదా..

సాధారణంగా కేంద్రం పదేళ్లకొకసారి జనాభా లెక్కింపు కార్యక్రమాన్ని చేపడుతుంది. అలా స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటిదాకా ఏడుసార్లు జనగణన చేపట్టారు. చివరిసారిగా 2011లో.. జనాభాను లెక్కించారు. ఆ తర్వాత పదేళ్లకు.. అంటే 2021లో మళ్లీ జనగణన చేపట్టాల్సి ఉన్న నేపథ్యంలో 2020లో అందుకు సంబంధించిన సన్నాహాలు చేశారు. ఆ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొన్ని రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి పనులు చేపట్టడానికి ప్రణాళికలు కూడా రూపొందించారు. కానీ.. కొవిడ్ కారణంగా జనగణన కార్యక్రమం వాయిదా పడింది. కాగా.. 2021 జనాభా లెక్కల ఆధారంగా.. జాతీయ జనాభా పట్టికను (ఎన్‌పీఆర్) సైతం నవీకరించాలని 2020లో నిర్ణయించిన సర్కారు.. తాజా నోటిఫికేషన్‌లో దాని గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం. ఇక.. జనగణనలో భాగంగానే కులగణన కూడా చేపట్టనున్నట్టు కేంద్ర మంత్రివర్గం గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా.. జనాభా లెక్కల సన్నాహాలపై ఆదివారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సమావేశం జరిగింది. అందులో కేంద్ర హోం కార్యదర్శి, రిజిస్ట్రార్ జనరల్, భారత్ జనాభా లెక్కల కమిషన్ (ఆర్జీ, సీసీఐ), ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ భేటీ దరిమిలా సోమవారం కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

ఇది మరో యూ టర్నా?

జనగణనకు సంబంధించి కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఎక్కడా కుల గణన ప్రస్తావనే లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రస్తావన లేకపోవడమంటే.. మోదీ ప్రభుత్వం యూ టర్న్ తీసుకోవడమేనని ఎక్స్ వేదికగా ఆయన ఆరోపించారు. జనభా లెక్కింపు కేవలం కుల గణనే కాకుండా కులాల వారీగా సామాజిక, ఆర్థిక, రాజకీయలతో కూడిన వివరణాత్మ సమాచారంతో ఉండాలని, తెలంగాణ నమూనాను అనుసరించాలని సూచించారు. కాగా.. జైరామ్ రమేశ్ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర హోం శాఖ అధికార ప్రతినిధి స్పందించారు. కులగణన కూడా జనగణనలో భాగంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 30న, జూన్ 4న, జూన్ 15న వెల్లడించినట్టు గుర్తుచేశారు.

ఆంగ్లేయుల పాలనలో..

మనదేశంలో సమగ్ర కుల గణనను బ్రిటిషర్లు 1881-1931 నడుమ రెగ్యులర్‌గా నిర్వహించారు. అయితే, స్వాతంత్ర్యం వచ్చాక జనగణన నుంచి కులాన్ని మినహాయించారు. కులగణన నిర్వహించాలంటూ విపక్షాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 30న ప్రధాని మోదీ నేతృత్వంలో నిర్వహించిన రాజకీయ వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ భేటీలో.. ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నిజానికి.. కులగణన అంశంపై క్యాబినెట్‌లో చర్చిస్తామని 2010లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ లోక్‌సభకు హామీ ఇచ్చారు. దీనిపై చర్చించేందుకు మంత్రుల బృందాన్ని కూడా ఏర్పాటు చేశారు. మెజారిటీ రాజకీయ పార్టీలు కులగణకు మద్దతిచ్చాయి. అయితే.. 2011లో యూపీఏ హయాంలో నిర్వహించిన జనగణనలో కులాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించినప్పటికీ దాన్ని పూర్తిస్థాయిలో ప్రచురించలేదు. ఇటీవలికాలంలో బిహార్, తెలంగాణ రాష్ట్రాలు కులగణన నిర్వహించడం.. విపక్షాల డిమాండ్లతో కేంద్రంపై ఒత్తిడి పెరిగింది.

మెట్రో రైలు 'పార్ట్–బీ' పరుగులు!

(మొదటిపేజీ తరువాయి)

రెండో దశ విస్తరణలో భాగంగా పార్ట్-ఏ కింద ప్రతిపాదించిన 5 కారిడార్లలోని 76.4 కి.మీ.కు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నెలల క్రితం రూ.24,269 కోట్లను కేటాయించిన సంగతి తెలిసిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్ (50:50)గా ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించాయి. ఇందులో రాష్ట్ర వాటా 30 శాతం, కేంద్ర వాటా 18 శాతం పోగా.. అంతర్జాతీయ బ్యాంకుల నుంచి 48 శాతం, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో 4 శాతం నిధులు తీసుకొని పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం డీపీఆర్ కేంద్రం పరిశీలనలో ఉంది.

కిలోమీటరుకు రూ.227.39 కోట్లు!

పార్ట్-ఏ మాదిరిగానే పార్ట్-బీ కింద ప్రతిపాదించిన మూడు కారిడార్లను కూడా జాయింట్ వెంచర్‌గా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తాజాగా కేటాయించిన నిధులే దీనికి నిదర్శనం. కారిడార్-9 కింద శంషాబాద్ ఎయిర్‌పోర్టు- ఫ్యూచర్‌సిటీ (స్కిల్స్ యూనివర్సిటీ) 39.6 కిలోమీటర్లు చేపడుతున్నారు. కారిడార్-10 కింద జేబీఎస్-మేడ్చల్ (24.5 కి.మీ.), కారిడార్-11 కింద జేబీఎస్-శామీర్‌పేట్ (22 కి.మీ.) నిర్మిస్తున్నారు. మొత్తం 86.1 కి.మీ.కు పాలనా అనుమతులు ఇచ్చారు. ఇందులో ఒక్కో కి.మీ.కు రూ.227.39 కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఫ్యూచర్‌సిటీ మార్గంలో భూసేకరణ సమస్య లేకపోవడంతో ఖర్చు తగ్గిన పరిస్థితి కనిపిస్తోంది. జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట్‌లో ఖర్చు పెరుగుతోందని అధికారులు తెలిపారు. పాలనా అనుమతులు రావడంతో మెట్రో రెండో దశ పనుల టెండర్ ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంటుందని చెప్పారు.

కారిడార్లలో నిర్మాణం జరిగేదిలా..

జేబీఎస్-మేడ్చల్‌లో 24.5 కి.మీ. మార్గం పూర్తి ఎలివేటెడ్ కారిడార్ (ఆకాశమార్గం)లో నిర్మించనున్నారు. జేబీఎస్-శామీర్‌పేట్ కారిడార్‌లో 20.35 కి.మీ. వరకు ఎలివేటెడ్, 1.65 కి.మీ. భూగర్భంలో ఉండనుంది. హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మార్గంలో ట్రాక్ ఉంటుందని అధికారులు తెలిపారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు-ఫ్యూచర్ సిటీ 39.6 కి.మీ.లో ఎయిర్‌పోర్టు నుంచి 1.5 కి.మీ. భూగర్భ మార్గంలో, 21 కి.మీ. ఎలివేటెడ్, 17 కి.మీ. భూమిపై ట్రాక్ ఉంటుందని వివరించారు.

సుప్రీంకోర్టులో అధికార భాషగా తమిళం

» తమిళనాడు సీఎం స్టాలిన్ డిమాండ్

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు, మద్రాసు హైకోర్టులో తమిళాన్ని అధికారిక భాషగా అమలు చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. సోమవారం తంజావూరులో జరిగిన డీఎంకే ప్రముఖుడి వివాహ వేడుకలో పాల్గొన్న సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ సుందరేశ్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుగళేంది వధూవరులను ఆశీర్వదిస్తూ తమిళంలో ప్రసంగించారు. అనంతరం స్టాలిన్ ప్రసంగిస్తూ... తన చేతులమీదుగా జరిగిన ఆదర్శవివాహ వేడుకలో న్యాయమూర్తులిద్దరూ తమిళంలో ప్రసంగించి వధూవరులను ఆశీర్వదించడం సంతోషంగా ఉందన్నారు. ప్రాచీన భాష అయిన తమిళం ఔన్నత్యాన్ని మరింతగా పెంచేలా దానిని సుప్రీంకోర్టు, మద్రాసు హైకోర్టులో అధికారభాషగా, వినియోగ భాషగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పాతబస్తీ మెట్రో పనులకు ఊతం

» రూ.125 కోట్లు విడుదల

» పనులు, పరిహారానికి దోహదం

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాత బస్తీలో చేపట్టిన మెట్రో కారిడార్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఊతమిచ్చింది. 2025-26 బడ్జెట్‌లో కేటాయించిన రూ.500 కోట్లలో రూ.125 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ సోమవారం ఉత్తర్వులు మంజూరు చేసింది. రెండో దశ విస్తరణలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల కారిడార్‌ను చేపడుతున్న విషయం తెలిసిందే. కాగా, పనులకు మొత్తం రూ.2,741 కోట్లు కేటాయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా 30 శాతం ఉంది. మిగతా నిధులు కేంద్రం, అంతర్జాతీయ బ్యాంకుల నుంచి సేకరించనున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా రూ.822 కోట్లను కారిడార్‌కు వెచ్చించాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ.106.88 కోట్లను చెల్లించింది. కాగా, ఈ ఏడాది సవరించిన బడ్జెట్‌తో కలుపుకుని రూ.125 కోట్లను తాజాగా విడుదల చేసేందుకు అనుమతులిచ్చింది.



ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన రూ.125 కోట్లు పాతబస్తీలో నివాసాలు కోల్పోతున్న బాధితులకు అందించే పరిహారంతో పాటు కూల్చివేతలు, ఇతర పనులకు దోహదపడుతాయని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) వర్గాలు చెబుతున్నాయి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అందుకే పాకిస్థాన్‌లో విడుదల చేయలేదు



ఆమిర్‌ఖాన్

ఆమిర్‌ఖాన్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'దంగల్'. 2016లో విడుదలైన ఈ సినిమా ఎంతటి ఘనవిజయం సాధించిందో తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా రెండు వేల కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించింది. ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని ఆమిర్‌ఖాన్ వెల్లడించారు. తాజాగా ఓ టెలివిజన్ షో పాల్గొన్న ఆయన 'దంగల్'ను పాకిస్థాన్‌లో విడుదల చేయకపోవడం వెనుకున్న కారణాన్ని వివరించారు. 'గీతా ఫొగట్ విజయం సాధించిన అనంతరం జాతీయ పతాకం నింగిలోకి ఎగురుతూ ఉండగా... జాతీయ గీతం వినిపించే దృశ్యాలు సినిమా నుంచి తొలగించండి లేదంటే చిత్ర ప్రదర్శనకు అంగీకరించం' అని పాకిస్థాన్ సెన్సార్ బోర్డు షరతు విధించింది. ఇదే విషయమై చిత్ర సహ నిర్మాణ సంస్థ డిస్నీ నన్ను సంప్రదించగా నష్టం వచ్చినా సరే.. మనం సినిమాని పాకిస్థాన్‌లో విడుదల చేయడం లేదు అని ఖరాఖండిగా చెప్పేశాను' అని ఆమిర్‌ఖాన్ వివరించారు. 'మీ జాతీయ పతాకాన్ని తొలగించండి, మీ జాతీయ గీతాన్ని తీసివేయండి అనే వారితో నాకు పనేంటి. అలాంటి వ్యాపారం అక్కర్లేదని చెప్పేశాను' అంటూ ఆయన ఆ నాటి విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

'కన్నప్ప'కు రజనీ అభినందనలు



దిగ్గజ నటులు రజనీకాంత్, మోహన్‌బాబు కలసి నటించిన 'పెదరాయుడు' విడుదలై 30 ఏళ్లు పూర్తయ్యాయి. 1995 జూన్ 15న విడుదలైన ఆ చిత్రం సంచలన విజయం సాధించి, వసూళ్ల చరిత్రలో సరికొత్త అధ్యాయం సృష్టించింది. ఈ నేపథ్యంలో ఆదివారం రజనీకాంత్ ఇంట్లో ఆయన్ని కలిశారు మోహన్‌బాబు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ క్రమంలోనే మోహన్‌బాబు నిర్మించిన 'కన్నప్ప' చిత్రాన్ని రజనీకాంత్ చూశారు. విష్ణుని అక్కున చేర్చుకుని సినిమా బాగుందంటూ అభినందించారు. ఈ ఆనందాన్ని ఎక్స్ వేదికగా పంచుకున్నారు విష్ణు. 'ఈ క్షణం కోసమే 22 ఏళ్లుగా ఎదురు చూస్తున్నాను. నా నటనని రజనీ అంకుల్ మెచ్చుకోవాలని నా కల. అది ఇప్పుడు నెరవేరింది. ఈ రోజు చాలా సంతోషంగా, గర్వంగా ఉంది' అని అందులో పేర్కొన్నారు. అలాగే మోహన్‌బాబు కూడా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ' నేను నిర్మించిన 'పెదరాయుడు' చిత్రానికి 30 ఏళ్లు పూర్తైన రోజునే నా ప్రియ మిత్రుడు రజనీకాంత్ 'కన్నప్ప' చిత్రాన్ని తన కుటుంబ సభ్యులతో కలసి చూశారు. సినిమా చూసిన అనంతరం ఆయన కురిపించిన ప్రేమ, అభిమానం, ప్రశంసలు, ఇచ్చిన ప్రోత్సాహం ఎప్పటికీ మరచిపోలేను. థాంక్యూ మిత్రమా' అని పేర్కొన్నారు. 'కన్నప్ప' చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది.

నాపై ప్రభాస్‌కు ఉన్న నమ్మకమే 'రాజాసాబ్'





ప్రభాస్ కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తున్న హారర్ కామెడీ 'రాజాసాబ్'. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్ కథానాయికలు. సంజయ్‌దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. డిసెంబరు 5న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సోమవారం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. వింటేజ్ లుక్‌లో ప్రభాస్ చేసిన హంగామా, అదిరిపోయే విజువల్స్, నేపథ్య సంగీతం సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి. ముఖ్యంగా ప్రభాస్ సంభాషణలు, ఆయన చేసిన కామెడీ అభిమానులను ఖుషీ చేశాయి. మారుతి టేకింగ్ ప్రధానాకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మారుతి మాట్లాడుతూ 'ఓ రోజు యువీ వంశీ నిన్ను ప్రభాస్ పిలుస్తున్నారు అని చెప్పారు. ఆయన్ని కలిసేందుకు ముంబై వెళ్లా. 'నువ్వు చేసిన 'ప్రేమకథా చిత్రమ్', 'భలేభలే మగాడివోయ్' లాంటి వినోదాత్మక కథ రెడీ చెయ్యి. సినిమా చేద్దాం' అని అన్నారు. 'పక్కా కమర్షియల్' చిత్రం ఫ్లాప్ అవ్వడంతో నాతో సినిమా చెయ్యాలనుకున్న నిర్మాత వెనక్కి వెళ్లారు. అయినా నాపై నమ్మకంతో ప్రభాస్ ఈ సినిమాను చేశారు. ఆయనకు నాపై ఉన్న నమ్మకమే ఈ సినిమా. షూటింగ్ మొదలయ్యాక కూడా 'ఈ టైమ్‌లో ప్రభాస్‌కు మారుతితో సినిమా అవసరమా'.. 'అయినా ప్రభాస్ కామెడీ చేయడమేంటి' వంటి సందేహాలు వినిపించాయి. అన్ని సవాళ్లనూ స్వీకరిస్తూ ఈ సినిమాను మరింత పట్టుదలతో కొనసాగించా. అభిమానులు ఆయన్ని ఎంతగా ప్రేమిస్తారో తెలిసిందే. అంతకు వెయ్యిరెట్లు ఆయన వారిని ప్రేమిస్తారు" అని అన్నారు. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ "ఆరంభం నుంచి ముగింపు వరకూ సినిమా మీ అందర్నీ ఒక్క క్షణం కూడా చూపు తిప్పుకోనివ్వకుండా ఎంటర్టైన్ చేస్తుంది. 40 నిమిషాల క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుంది" అని చెప్పారు. నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ "ఈ చిత్రం మొదలైనప్పుడు ఓ నిర్మాత దీనిపై నెగెటివ్‌గా మాట్లాడారు. సినిమా విడుదలయ్యాక ఆయనే పొగుడుతారు" అని తెలిపారు.

రెగ్యులర్ షూట్ షురూ



రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఇటీవలె ఓ చిత్రం ప్రారంభమైన సంగతి తెలిసిందే. 'ఆర్‌టీ 76' వర్కింగ్ టైటిల్. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. సోమవారం రెగ్యులర్ షూట్‌ను మొదలెట్టారు. హైదరాబాద్‌లో నిర్మించిన ఓ ప్రత్యేక సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇందులో రవితేజతో పాటు ఇతర తారాగణం పాల్గొంటున్నారు. ఇది రవితేజ మార్క్ కామెడీతో పూర్తి స్థాయి కుటుంబ కథా చిత్రంగా ఉండనుంది. ఇందులో ఆయన సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, డీఓపీ: ప్రసాద్ మూరెళ్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

విభిన్న కథతో...



'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సుహాస్, శివానీ నగరం మరోసారి జంటగా తెరపై కనిపించనున్నారు. వీరిద్దరూ కలసి నటించనున్న కొత్త చిత్రం సోమవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. గోపీ అచ్చర ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తం షాట్‌కు సత్యదేవ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నాగ్ అశ్విన్ క్లాప్ కొట్టారు. వంశీ నందిపాటి ఫస్ట్ షాట్‌కు దర్శకత్వం వహించారు. విభిన్న కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. షణ్ముఖ ప్రశాంత్ ఈ చిత్రానికి కథను అందించారు.

మళ్లీ వస్తున్న 'హనుమాన్ జంక్షన్'



అర్జున్, జగపతి బాబు, వేణు హీరోలుగా 2001లో వచ్చిన 'హనుమాన్ జంక్షన్' చిత్రం మళ్లీ ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఎడిటర్ మోహన్ నిర్మించిన ఈ చిత్రంతోనే ఆయన తనయుడు మోహన్ రాజా దర్శకుడిగా పరిచయమయ్యారు. లయ, స్నేహ, విజయలక్ష్మి హీరోయిన్లుగా నటించిన 'హనుమాన్ జంక్షన్' చిత్రాన్ని ఈ నెల 28న మళ్లీ థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్స్ తక్కువగా వస్తున్న ప్రస్తుత తరుణంలో 'హనుమాన్ జంక్షన్' మళ్లీ తన మ్యాజిక్‌తో మెస్మరైజ్ చేస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

సస్పెన్స్ థ్రిల్లర్



రోహిత్ సహాని, అబిద్ భూషణ్, రియా కపూర్, మేఘనా రాజ్ ప్రధాన పాత్రలు పోషించిన 'మిస్టీరియస్' చిత్రం టైటిల్ పోస్టర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విడుదల చేశారు. సినిమా విజయం సాధించాలని ఆయన కోరుకున్నారు. చిత్ర దర్శకుడు మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ 'సస్పెన్స్ మిస్టరీ కథాంశంతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ప్రేక్షకులను కట్టి పడేస్తుంది. యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలు అలరిస్తాయి' అని చెప్పారు. చిత్ర నిర్మాత జయ్ వల్లందాస్ (అమెరికా) మాట్లాడుతూ 'ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని నిర్మించాం.త్వరలో ఆడియో విడుదల చేస్తాం. సినిమాను ఆదరించాలని కోరుతున్నాను' అన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రామ్ ఉప్పు.

ఆర్చరీలో తెలుగమ్మాయి రెండు ప్రపంచ రికార్డులు


షణ్ముఖి నాగసాయి

విజయవాడ స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో జరుగుతున్న ఆసియాకప్ స్టేజ్ 2 అండర్-21 ఆర్చరీ ర్యాంకింగ్ రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి బుద్ధె షణ్ముఖి నాగసాయి రెండు ప్రపంచ రికార్డులు నెలకొల్పింది. 50 మీటర్ల కాంపౌండ్ మహిళల టీమ్ ఈవెంట్‌లో షణ్ముఖి, తేజల్ సాల్వే, తనిష్కలతో కూడిన భారత జట్టు 2101 పాయింట్లు స్కోరుచేసి వరల్డ్ రికార్డు సాధించింది. ఈ క్రమంలో 2076 పాయింట్ల రికార్డును అధిగమించింది. ఇక మిక్స్‌డ్ టీమ్ విభాగంలో షణ్ముఖి, కుషాల్ దలాల్ ద్వయం 1420 పాయింట్లు స్కోరు చేసి గత వరల్డ్ రికార్డు (1419)ను అధిగమించింది.

నేడు జట్టుతో చేరనున్న గంభీర్

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతం గంభీర్ మంగళవారం జట్టుతో చేరనున్నాడు. తల్లి సీమా గంభీర్ గుండెపోటుకు గురైనందున అతడు ఈనెల 12న స్వదేశానికి వచ్చాడు. గౌతీ తల్లి ఐసీయూలో చికిత్స పొందుతున్నప్పటికీ..ఆమె ఆరోగ్యం మెరుగైందని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం కెంట్‌లో ఉన్న భారత జట్టు శుక్రవారం నుంచి ఇంగ్లండ్‌తో జరిగే తొలి టెస్టు కోసం మంగళవారం హెడింగ్లీకి బయల్దేరి వెళ్లనుంది.

బాల్ ట్యాంపరింగ్ వివాదంలో అశ్విన్



కోయంబత్తూరు: భారత మాజీ ఆఫ్ స్పిన్నర్ ఆర్.అశ్విన్ మరో వివాదంలో చిక్కుకున్నాడు. గతవారం మహిళా అంపైర్‌తో గొడవకు దిగిన అతను తాజాగా బంతి స్వరూపాన్ని మార్చేందుకు ప్రయత్నించాడంటూ మదురై పాంథర్స్ జట్టు ఫిర్యాదు చేసింది. తమిళనాడు ప్రీమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్)లో అశ్విన్ దుండిగల్ డ్రాగన్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈనెల 14న ఇరుజట్ల మధ్య మ్యాచ్ జరిగింది. 'డ్రాగన్స్ జట్టు ఆటగాళ్లు రసాయనాల్లో ముంచిన టవళ్లతో బంతిని పదే పదే తుడిచారు. తద్వారా బంతి బరువును పెంచాలని చూశారు' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు ఇందుకు తగిన ఆధారాలను చూపడంలో మధుర జట్టు విఫలమైందని టీఎన్‌పీఎల్ ప్రకటించింది.

విశాఖలో ఐదు మ్యాచ్‌లు

మహిళల వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్

సెప్టెంబరు 30న టోర్నీ ఆరంభం

కొలంబోలో అక్టోబరు 5న భారత్-పాక్ పోరు



న్యూఢిల్లీ: భారత్, శ్రీలంక ఆతిథ్యమివ్వనున్న మహిళల వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్‌ను ఐసీసీ సోమవారం విడుదల చేసింది. సెప్టెంబరు 30 నుంచి జరిగే ఈ మెగా టోర్నీ నవంబరు 2న ముగుస్తుంది. మొత్తం 8 జట్లు రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిన మిగతా అన్ని టీమ్స్‌తోనూ ఆడాల్సి ఉంటుంది. ఇక బెంగళూరులో జరిగే ఆరంభ మ్యాచ్‌లో భారత్-శ్రీలంక తలపడనున్నాయి. ఇక, టోర్నీలో ఐదు మ్యాచ్‌లకు విశాఖపట్నం వేదిక కానుండడం విశేషం. కాగా, అందరి దృష్టిని ఆకర్షించే పాకిస్థాన్‌తో హర్మన్‌ప్రీత్ సేన పోరు కొలంబోలో అక్టోబరు 5వ తేదీన జరగనుంది. చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారత పురుషుల జట్టు పాక్‌కు వెళ్లకపోవడంతో భవిష్యత్‌లో ఇరు జట్ల మ్యాచ్‌లను హైబ్రిడ్ పద్ధతిన ఆడించాలనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంట్లో భాగంగా పాక్ జట్టు శ్రీలంకలోనే తమ వరల్డ్‌కప్ గ్రూప్ మ్యాచ్‌లను ఆడబోతోంది. అంతేకాకుండా శ్రీలంక మొత్తంగా 11 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, పాకిస్థాన్ జట్లతో తమ మ్యాచ్‌లను శ్రీలంక స్వదేశంలోనే ఆడనుంది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా అక్టోబరు ఒకటిన కివీస్‌తో మ్యాచ్‌తో తమ ప్రస్థానాన్ని ఆరంభించనుంది. రౌండ్ రాబిన్ దశలో టాప్-4లో నిలిచిన జట్లు సెమీస్‌కు వెళతాయి. ఇందులో తొలి స్థానంలో నిలిచిన జట్టు నాలుగో స్థానం జట్టుతో.. రెండో స్థానంలో నిలిచిన జట్టు మూడో స్థానం జట్టుతో తలపడతాయి. అలాగే తొలి సెమీస్ అక్టోబరు 29న గువాహటి/కొలంబోలో నిర్వహించనున్నారు. మర్నాడే మరో సెమీస్ బెంగళూరులో జరుగుతుంది. నవంబరు 2న జరిగే ఫైనల్‌కు బెంగళూరు లేదా కొలంబో వేదిక కానుంది. పాక్ జట్టు అర్హత సాధించడాన్ని బట్టి ఈ రెండింట్లో ఓ వేదికను ఖరారు చేస్తారు.

భారత జట్టు షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి	వేదిక
సెప్టెంబరు 30	శ్రీలంక	బెంగళూరు
అక్టోబరు 5	పాకిస్థాన్	కొలంబో
అక్టోబరు 9	దక్షిణాఫ్రికా	విశాఖపట్నం
అక్టోబరు 12	ఆస్ట్రేలియా	విశాఖపట్నం
అక్టోబరు 19	ఇంగ్లండ్	ఇండోర్
అక్టోబరు 23	న్యూజిలాండ్	గువాహటి
అక్టోబరు 26	బంగ్లాదేశ్	బెంగళూరు

విశాఖలో మ్యాచ్‌లు ఇవీ..

మహిళల వన్డే వరల్డ్‌కప్‌నకు భారత్‌లో బెంగళూరు, ఇండోర్, గువాహటిలతో పాటు విశాఖపట్నం కూడా ఆతిథ్యమివ్వనుంది. విశాఖలో ఐదు మ్యాచ్‌లు జరగనుండగా.. అక్టోబరు 9న మొదట భారత్-దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. అలాగే అక్టోబరు 10న న్యూజిలాండ్-బంగ్లాదేశ్, 12న భారత్-ఆస్ట్రేలియా, 13న దక్షిణాఫ్రికా-బంగ్లాదేశ్, 16న ఆస్ట్రేలియా-బంగ్లాదేశ్ మ్యాచ్‌లను కూడా ఇక్కడే నిర్వహిస్తారు.

డుప్లాంటిస్ 12వ సారి..

పోల్‌వాల్ట్‌లో ప్రపంచ రికార్డు



స్టాక్‌హోమ్: ఒలింపిక్ చాంపియన్ ఆర్మండ్ డుప్లాంటిస్ పోల్‌వాల్ట్‌లో తన వరల్డ్ రికార్డును మరోసారి తానే బద్దలుగొట్టాడు. స్వదేశం (స్వీడన్)లో జరిగిన డైమండ్ లీగ్‌లో 6.28 మీటర్లు లంఘించిన 25 ఏళ్ల డుప్లాంటిస్ అభిమానుల హర్షధ్వానాల నడుమ 12వ సారి నయా ప్రపంచ రికార్డు నమోదు చేశాడు. స్వదేశంలో అతడు వరల్డ్ రికార్డు సాధించడం ఇదే తొలిసారి. ఇక.గత ప్రపంచ రికార్డు (6.27 మీటర్ల)ను ఫిబ్రవరిలో వరల్డ్ అథ్లెటిక్ ఇండోర్ టూర్ మీట్ సందర్భంగా డుప్లాంటిస్ నెలకొల్పాడు. 2020లో 6.17 మీ.తో మొదటిసారి ప్రపంచ రికార్డు సాధించిన ఆర్మండ్ అప్పటినుంచి ప్రతిసారీ ఒక్కో సెంటీమీటరు పెంచుకుంటూ రికార్డులు సృష్టిస్తున్నాడు.

భారత్-ఇంగ్లండ్ సిరీస్ నెగ్గేదెవరంటే ?

గెలుపు చాన్సులపై మాజీల మాట

న్యూఢిల్లీ: భారత్-ఇంగ్లండ్ మధ్య టెస్ట్ సిరీస్‌లో ఎవరు విజేతగా నిలుస్తారన్న విషయంపై మాజీ క్రికెటర్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఐదు మ్యాచ్‌ల ఈ సుదీర్ఘ సిరీస్‌లో భారత జట్టు గెలిచే అవకాశాలు బలంగా ఉన్నాయని ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ మాథ్యూ హేడెన్ అభిప్రాయపడ్డాడు. అది జరగాలంటే లీడ్స్‌లో జరిగే తొలి టెస్ట్, మాంచెస్టర్‌లో జరిగే నాలుగో మ్యాచ్‌లో గిల్ సేన విజయం సాధించాల్సి ఉంటుందని అన్నాడు. మరోవైపు దక్షిణాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ మాత్రం ఇంగ్లండ్ 3-2తో సిరీస్ సొంతం చేసుకుంటుందని జోస్యం చెప్పాడు. 2025-27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ కొత్త సైకిల్‌ను ఐదు టెస్ట్‌ల సిరీస్‌తో భారత్-ఇంగ్లండ్ ప్రారంభించనున్నాయి. ఇందులో తొలి టెస్ట్ ఈనెల 20న లీడ్స్‌లో మొదలుకానుంది. అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీని ఇంగ్లండ్ చేజిక్కించుకొనే చాన్సుందని భారత మాజీలు దీప్‌దాస్ గుప్తా, సంజయ్ మంజ్రేకర్ అన్నారు.

కెనడియన్ గ్రాండ్ ప్రీ విజేత జార్జ్



మాంట్రియల్: ఫార్ములావన్ స్టార్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్‌కు కెనడియన్ గ్రాండ్ ప్రీలో చుక్కెదురైంది. ఫైనల్ రేసులో వెర్‌స్టాపెన్‌కు షాకిస్తూ.. మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రస్సెల్ చాంపియన్‌గా నిలిచాడు. మ్యాక్స్ రెండోస్థానానికి పరిమితమవగా.. మెర్సిడెస్‌కే చెందిన కిమి అంటోనెలి మూడోస్థానంతో పోడియం ఫినిష్ చేశాడు. బ్రిటన్‌కు చెందిన 27 ఏళ్ల జార్జ్‌కిది ఎఫ్-1 కెరీర్‌లో నాలుగో విజయం.

అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ ఆవిష్కరణ వాయిదా

లండన్: అహ్మదాబాద్ విమాన దుర్ఘటన నేపథ్యంలో అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ ఆవిష్కరణ వాయిదాపడింది. గతంలో ఇంగ్లండ్-భారత్ మధ్య సిరీస్‌ను పటౌడీ ట్రోఫీగా వ్యవహరించేవారు. అయితే, ఇంగ్లండ్ బోర్డు ఆ పేరు మార్చి ఆధునిక దిగ్గజాలు అండర్సన్-టెండూల్కర్ పేరున ట్రోఫీని తీసుకురావాలనే నిర్ణయం తీసుకొంది. సిరీస్ ఆరంభమయ్యే ముందే ట్రోఫీ ఆవిష్కరణ జరుగుతుందని బీసీసీఐ తెలిపింది.

సచిన్ కాదు.. కోహ్లీతోనే కష్టం

ఇంగ్లండ్ మాజీ పేసర్ అండర్సన్



లండన్: సచిన్ టెండూల్కర్‌తో పోల్చితే.. కోహ్లీకి బౌలింగ్ చేయడం తనకు ఎంతో కష్టంగా అనిపించేదని ఇంగ్లండ్ మాజీ పేసర్ జిమ్మీ అండర్సన్ చెప్పాడు. విరాట్ టెక్నిక్, పోరాటపటిమను కొనియాడాడు. కోహ్లీ, అండర్సన్ మధ్య వైరం ఎంతో ఆసక్తిగా ఉండేది. 36 ఇన్నింగ్స్‌లో ఏడుసార్లు విరాట్‌ను అండర్సన్ అవుట్ చేశాడు. 'సచిన్‌తో పోల్చితే కోహ్లీ తత్వం భిన్నం. ఆరంభంలో విరాట్‌ను సులువుగానే అవుట్ చేసినా.. ఆ తర్వాత అతడిపై ఆధిపత్యం సాధించడం కష్టమైంది. దూకుడుగా ఉండే విరాట్.. దేనికైనా సై అన్నట్టుగా ఉంటాడ'ని అండర్సన్ చెప్పాడు. టెస్ట్‌లకు కోహ్లీ ఇటీవలే రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

అవి చీకటి రోజులు


కరుణ్ నాయర్

న్యూఢిల్లీ: లండన్: గత దేశవాళీ సీజన్‌లో పరుగుల వరద పారించిన కరుణ్ నాయర్‌కు ఎట్టకేలకు ఎనిమిది సంవత్సరాల విరామం తర్వాత జాతీయ జట్టులో చోటు లభించింది. ఈనేపథ్యంలో తన క్రికెట్ కెరీర్‌లో ఎత్తుపల్లాలను తలుచుకుంటూ 33 ఏళ్ల నాయర్ ఉద్వేగానికి గురయ్యాడు. '2022 ఏడాది చివరి రోజులు నా కెరీర్‌లో అత్యంత చీకటిమయం. ఎంత క్లిష్టమైన రోజులంటే.. 2018 కంటే కూడా ఎంతో భారమైనవి' అని ఆర్.అశ్విన్ యుట్యూబ్ చానెల్‌తో మాట్లాడుతూ నాయర్ తెలిపాడు. దేశవాళీ పోటీల్లో సత్తా చాటినా జాతీయ జట్టులో చోటు దక్కకపోవడంతో తీవ్ర ఆవేదనకు లోనైన కరుణ్ 'డియర్ క్రికెట్. నాకు మరో అవకాశం ఇవ్వు' అని 2022 డిసెంబరులో సోషల్ మీడియాలో నాయర్ చేసిన పోస్ట్ సంచలనం రేపింది. 'గత రెండు మూడు సంవత్సరాలుగా నాకు అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు. ఈ సమయంలో ప్రతి అంశము, ప్రతి క్షణమూ ఎంత విలువైనదో తెలుసుకున్నా. దాంతో ప్రతి రోజును కొత్త రోజుగా భావించా' అని తెలిపాడు. సెహ్వాగ్ తర్వాత టెస్ట్‌ల్లో త్రిశతకం బాదిన భారత క్రికెటర్‌గా రికార్డులకెక్కిన నాయర్‌ను 2018లో ఎలాంటి కారణం చూపకుండా టీమిండియానుంచి తప్పించడం గమనార్హం.

అండమాన్‌లో ఓఎన్‌జీసీకి జాక్‌పాట్



1,160 కోట్ల బ్యారళ్ల చమురు నిక్షేపాలు

పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ వెల్లడి

న్యూఢిల్లీ: అండమాన్ సముద్ర జలాల్లో భారీ చమురు నిక్షేపాలు బయటపడినట్టు సమాచారం. ఈ సముద్రంలో చమురు, సహజవాయు నిక్షేపాల కోసం ప్రభుత్వ రంగంలోని ఆయిల్ ఇండియా, ఓఎన్‌జీసీ జరుపుతున్న అన్వేషణ ఒక కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ సముద్ర జలాల్లో దాదాపు 1,84,440 కోట్ల లీటర్ల (సుమారు 1,160 కోట్ల బ్యారళ్ల)కు సమానమైన భారీ చమురు నిక్షేపాలు గురించిన శుభవార్త త్వరలోనే దేశ ప్రజలకు అందిస్తామని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ నిక్షేపం ఇటీవల దక్షిణ అమెరికాలోని గయానాలో కనుగొన్నంత భారీ స్థాయిలోనే ఉంటుందన్నారు. దీంతో దేశ చమురు, గ్యాస్ ఉత్పత్తిలో అండమాన్ నికోబార్ దీవులు కూడా చేరనున్నాయి.

హెస్ కార్పొరేషన్, చైనాకు చెందిన సీఎన్‌ఓఓసీ కంపెనీలు గయానాలో ఇటీవల 1,160 కోట్ల పీపాల భారీ చమురు నిక్షేపాన్ని కనుగొన్నాయి. దీంతో చమురు నిక్షేపాలపరంగా గయానా ప్రపంచంలో 17వ స్థానానికి చేరింది.

చమురుకు ఢోకా లేదు

మరోవైపు మన దేశంలో ముడి చమురుకు ఎలాంటి కొరత లేదని అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం మూడు నెలల అవసరాలకు సరిపడా ముడి చమురు నిల్వలు ఉన్నట్టు తెలిపాయి. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో అధికార వర్గాలు ఈ విషయం వెల్లడించడం విశేషం. అయితే ఇరాన్ హార్మోజ్ జలసంధిని మూసివేస్తే మాత్రం మన చమురు సరఫరాలకు ముప్పు తప్పకపోవచ్చన్నారు. ఆ ప్రమాదం లేనంత వరకు పీపా చమురు ధర కూడా 75 డాలర్లు మించక పోవచ్చని అధికార వర్గాలు తెలిపాయి.

వెలికితీత ఖర్చే

అయితే అండమాన్ సముద్రంలో చమురు, గ్యాస్ నిక్షేపాల వెలికితీత అంత తేలిక కాదని కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ తెలిపారు. ఇందుకోసం ఒక్కో బావి తవ్వకం కోసం ఎంతలేదన్నా 10 కోట్ల డాలర్ల (సుమారు రూ.850 కోట్లు) వరకు ఖర్చవుతుందన్నారు. గయానాలోనూ కొత్త చమురు, గ్యాస్ నిక్షేపాల ఆచూకీ కోసం 44 బావులు తవ్వాల్సి వచ్చింది. ఇందుకోసం అధునాతన టెక్నాలజీతో పాటు ఒక్కో బావి తవ్వకం కోసం 10 కోట్ల డాలర్ల వరకు ఖర్చు చేశారు. గత ఆర్థిక సంవత్సరం ఓఎన్‌జీసీ దేశంలోని వివిధ ప్రాంతాల్లో చమురు, గ్యాస్ నిక్షేపాల అన్వేషణ, ఉత్పత్తి కోసం రూ.37,000 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో పెద్ద మొత్తం అండమాన్, నికోబార్ సముద్ర జలాల్లో బావుల తవ్వకం కోసం ఖర్చు చేసినట్టు అధికార వర్గాలు చెప్పాయి.

ఈ వారం కీలక భేటీ

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంపై అధికార, వాణిజ్య వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై చర్చించేందుకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ వారం కీలక సమావేశం నిర్వహిస్తోంది. నౌకాయాన కంపెనీలు, కంటైనర్ కంపెనీలు, ఎగుమతిదారుల, వాణిజ్యంతో సంబంధం ఉన్న ఇతర సంస్థల ప్రతినిధులనూ ఈ సమావేశానికి ఆహ్వానించినట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి సునీల్ బర్త్‌వాల్ చెప్పారు. తాత్కాలిక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కోసం భారత-అమెరికా మధ్య జరుగుతున్న చర్చలు జూలై 9 లోగానే ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

బిజినెస్

ఎగుమతుల్లో మళ్లీ క్షీణత

మే నెలలో 2.17% పతనం

న్యూఢిల్లీ: వరుసగా రెండు నెలల పాటు సానుకూల వృద్ధిని నమోదు చేసిన ఎగుమతుల రంగం మే నెలలో మరోసారి ప్రతికూల వృద్ధిలోకి దిగజారింది. ప్రపంచ విపణిలో పెట్రోలియం ఉత్పత్తుల ధరల తగ్గుదల, అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావంతో మే నెల ఎగుమతులు 2.17% పడిపోయి 3,873 కోట్ల డాలర్లకు (రూ.3.33 లక్షల కోట్లు) పరిమితం అయ్యాయి. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం వాణిజ్య లోటు 2,188 కోట్ల డాలర్లకు (రూ.1.88 లక్షల కోట్లు) తగ్గింది. దిగుమతులు కూడా 1.7% తగ్గి 6,061 కోట్ల డాలర్లుగా (రూ.5.21 లక్షల కోట్లు) నమోదయ్యాయి. ఇదిలా ఉండగా ఏప్రిల్-మే నెలల్లో మొత్తం ఎగుమతులు 3.11 శాతం పెరిగి 7,719 కోట్ల డాలర్లకు (రూ.66.4 లక్షల కోట్లు) చేరగా దిగుమతులు 8 శాతం వృద్ధితో 12,552 కోట్ల డాలర్లుగా (రూ.10.79 లక్షల కోట్లు) నమోదయ్యాయి. రెండు నెలల వాణిజ్య లోటు 4,833 కోట్ల డాలర్లుగా (రూ.4.16 లక్షల కోట్లు) ఉంది. మే నెలలో ప్రతికూల వృద్ధి నమోదైన వస్తువుల్లో బియ్యం, ఇనుప ఖనిజం, వజ్రాభరణాలు, ఇంజనీరింగ్, కొన్ని రకాల టెక్స్‌టైల్ ఉత్పత్తులు ఉన్నాయి. క్రూడాయిల్ దిగుమతులు 26.14%, బంగారం దిగుమతులు 12.6% తగ్గినప్పటికీ టీ, కాఫీ, సుగంధ ద్రవ్యాలు, రసాయనాలు, మెరైన్ ఉత్పత్తులు, ఫార్మా విభాగాల్లో మాత్రం సానుకూల వృద్ధి నమోదైంది.

టోకు ద్రవ్యోల్బణం 0.39%

ఆహార వస్తువుల ధరలు తగ్గడంతో దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం మే నెలలో 0.39 శాతానికి దిగి వచ్చింది. ఇది 14 నెలల కనిష్ఠ స్థాయి. గత ఏడాది ఇది మే నెలలో 2.74 శాతంగా ఉంది. కూరగాయల ధరలు 21.62 శాతం, ఇంధన విభాగం 2.27 శాతంతో ప్రతి ద్రవ్యోల్బణ స్థితిని నమోదు చేశాయి.

ప్రమాదం గుండెలు పిండేస్తోంది

- అయినా ఎయిర్ ఇండియాను నిలబెడదాం
- టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్



ముంబై: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం తన గుండెలు పిండేస్తోందని టాటా సన్స్, ఎయిర్ ఇండియా చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తెలిపారు. తన ఉద్యోగ జీవితంలో ఇది అత్యంత విషాదకర సంక్షోభ సంఘటన అన్నారు. ఎయిర్ ఇండియాకు చెందిన దాదాపు 700 మంది ఉద్యోగులు, అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రమాదంతో నీరుగారి పోకుండా ఎయిర్ ఇండియాను సురక్షిత విమానయాన సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఉద్యోగి దృఢ నిర్ణయంతో కట్టుబడి పనిచేయాలని చంద్రశేఖరన్ కోరారు. 'నా ఉద్యోగ జీవితంలో ఎన్నో సంక్షోభాలు చూశా. అయితే అహ్మదాబాద్ విమాన ప్రమాదం మాత్రం గుండెలు పిండేసే అత్యంత విషాదకర సంఘటన. జీవితంలో మళ్లీ ఇలాంటి ప్రమాదాన్ని చూస్తానని అనుకోను' అన్నారు. ఈ నెల 12 అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లే ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమాన టేకాఫ్ తీసుకున్న కొద్ది సేపటికే కూలిపోయింది. దీంతో 270 మంది వరకు మరణించిన సంగతి తెలిసిందే.

తాన్లా ప్లాట్‌ఫామ్స్ రూ.175 కోట్ల షేర్ల బైబ్యాక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బహిరంగ మార్కెట్ నుంచి సొంత షేర్లను తిరిగి కొనుగోలు చేసే (బైబ్యాక్) ప్రతిపాదనకు తాన్లా ప్లాట్‌ఫామ్స్ బోర్డు సోమవారం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా కంపెనీ 1.49 శాతం వాటాకు సమానమైన 20 లక్షల ఈక్విటీ షేర్లను ఒక్కొక్కటి రూ.875 చొప్పున బైబ్యాక్ చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ లెక్కన కంపెనీ బైబ్యాక్ కోసం రూ.175 కోట్ల వరకు వెచ్చించనుంది. బైబ్యాక్ తేదీని మాత్రం ఇంకా ప్రకటించాల్సి ఉంది. తాన్లా ప్లాట్‌ఫామ్ సొంత షేర్లను తిరిగి కొనుగోలు చేయనుండటం గడిచిన ఐదేళ్లలో ఇది మూడోసారి. 2020లో రూ.154 కోట్లు, 2022లో రూ.170 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేసింది. కాగా సోమవారం బీఎస్ఈలో కంపెనీ షేరు 1.31 శాతం నష్టంతో రూ.656.90 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	500
చిత్తూరు	583	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

యుద్ధ భయాలు బేఖాతరు

678 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

రూ.3.31 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధ భయాలను పక్కన పెట్టి మదుపరులు కొనుగోళ్లపై దృష్టి సారించడంతో స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం మంచి లాభాలను నమోదు చేశాయి. ఒక దశలో 747 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 677.55 పాయింట్ల లాభంతో 81,796.15 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 227.90 పాయింట్ల వృద్ధితో 24,946.50 వద్ద ముగిసింది. గత వారాంతంలో భారీగా పెరిగిన ముడి చమురు ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆయిల్ అండ్ గ్యాస్, ఐటీ రంగ షేర్లలో వాల్యూ బైయింగ్‌కు పాల్పడటం ర్యాలీకి దోహదపడింది. కాగా ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.31 లక్షల కోట్ల పెరుగుదలతో రూ.450.52 లక్షల కోట్లకు (5.24 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

నెలాఖరుకు హెచ్‌డీబీ ఫైనాన్షియల్ ఐపీఓ: హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.12,500 కోట్ల ఐపీఓ ఈ నెలాఖరులో (25-27తేదీల్లో) మార్కెట్లోకి రానున్నట్లు సమాచారం. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల్లో ఇప్పటివరకిదే అతిపెద్ద ఐపీఓ కానుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.62,000 కోట్ల మార్కెట్ విలువను ఆశిస్తోంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	91	విజయవాడ	95
వరంగల్	91	గుంటూరు	100
కరీంనగర్	91	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	92
కర్నూలు	91	నెల్లూరు	97
విశాఖపట్నం	85	అనంతపురం	97
గోదావరి	95		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,510 ▼	93,500 ▲	1,19,000 ▼
విజయవాడ	1,00,250 ▼	94,000 ▼	1,09,500 ▼
విశాఖపట్నం	1,00,215 ▼	93,050 ▼	1,19,900 ▼
రాజమండ్రి	1,01,510 ▼	93,950 ▲	1,09,200 ▼
ప్రొద్దుటూరు	98,500 ▼	90,620 ▼	1,00,060 ▼
ముంబై	99,373 ▲	91,026 ▲	1,06,700 ▲

రూపీ ఇంట్రెస్ట్ రేట్ డెరివేటివ్‌లకు ముసాయిదా నిబంధనలు జారీ

ముంబై: మార్కెట్ పరిణామాలకు అనుగుణంగా నియంత్రణ నియమావళిని విస్తరించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సోమవారం రూపీ ఇంట్రెస్ట్ రేట్ డెరివేటివ్స్ (ఐఆర్‌డీ)కు సంబంధించిన ముసాయిదా నిబంధనలు జారీ చేసింది. ఐఆర్‌డీ నియమావళిని ఆర్‌బీఐ తొలుత 2019 జూన్‌లో జారీ చేసింది. అప్పటి నుంచి మార్కెట్లో కొత్త సాధనాలు అందుబాటులోకి రావడం, ప్రవాసులు సైతం వీటిలో ట్రేడింగ్ చేపట్టేందుకు అనుమతించడం సహా పలు కొత్త పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఐఆర్‌డీ నియమాళిని సమగ్రంగా సమీక్షించిన అనంతరం ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ముసాయిదా నిబంధనలను జారీ చేసినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. వచ్చేనెల 7లోగా తమ అభిప్రాయాలు తెలపాల్సిందిగా బ్యాంకులు, మార్కెట్ వర్గాలు, ఇతర సంబంధిత వర్గాలను కోరింది.

కార్ల ధరలు సెప్టెంబరు నెలలో మరోసారి పెంచే ఆస్కారం ఉందని జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ప్రకటించింది. రూపాయి-యూరో మారకంలో ప్రతికూల కదలికల నేపథ్యంలో ధరల పెంపు తప్పకపోవచ్చని కంపెనీ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ చెప్పారు. కంపెనీ ఈ ఏడాదిలో ఇప్పటికే జనవరి, జూన్ నెలల్లో రెండు విడతలుగా 1.5% వంతున కార్ల ధరలు పెంచింది.

ఆర్థిక మోసాలను అరికట్టేందుకు ఆర్‌బీఐతో ట్రాయ్ జట్టు

న్యూఢిల్లీ: దేశంలో స్పామ్ కాల్స్ లేదా మెసేజ్‌ల ద్వారా పెరుగుతున్న ఆర్థిక మోసాలను అరికట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)తో భారత టెలికాం నియంత్రణాధికార సంస్థ (ట్రాయ్) జట్టు కట్టింది. ఈ భాగస్వామ్యం ద్వారా ట్రాయ్ వినియోగదారుల వారసత్వ డిజిటలీకరణతో పాటు కాల్స్, మెసేజ్‌ల స్వీకరణకు పత్రాల ఆధారిత సమ్మతికి సంబంధించి పైలట్ ప్రాజెక్టును ప్రారంభించింది. గతంలో స్పామ్ కాల్స్, మెసేజ్‌లపై కస్టమర్ల ఫిర్యాదుల్లో చాలావరకు వారు గతంలో ఉత్పత్తులు కొనుగోలు చేసిన లేదా సేవలందుకున్న సంస్థలకు వ్యతిరేకంగానేనని ట్రాయ్ పేర్కొంది. ఈ విషయంపై ట్రాయ్ దర్యాప్తు చేయగా.. కస్టమర్ల సమ్మతితోనే కాల్స్, మెసేజ్‌లు చేయడం జరిగిందని ఆ వ్యాపార సంస్థలు వెల్లడించాయి.

ఫ్యూచర్‌సిటీలో.. ఎఫ్‌సీడీఏ ద్వారానే లేఅవుట్ అనుమతులు

» డీటీసీపీ నుంచి ఎఫ్‌సీడీఏ, హెచ్‌ఎండీఏకు అధికారాలు

» పరిధి ఆధారంగా పరిష్కారానికి ప్రభుత్వం ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, జూన్16 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్‌సిటీ, హెచ్‌ఎండీఏ పరిధిలోని ఇతర ప్రాంతాల్లో లేఅవుట్ల తుది అనుమతి విషయంలో ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు హెచ్‌ఎండీఏ పరిధిలోని గ్రామాల్లో డ్రాఫ్ట్, తుది లేఅవుట్లను డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) జారీ చేసేది. అయితే.. 7,257 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో ఉన్న హెచ్‌ఎండీఏ పరిధిని ప్రభుత్వం 10,472 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. నల్లగొండ, వికారాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని 300 గ్రామాలను హెచ్‌ఎండీఏ పరిధిలోకి తీసుకువచ్చింది. అదే సమయంలో 36 గ్రామాలను హెచ్‌ఎండీఏ పరిధి నుంచి తొలగిస్తూ.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ(ఎఫ్‌సీడీఏ)ను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత డీటీసీపీ డ్రాఫ్ట్ లేఅవుట్లను జారీ చేస్తున్నా.. తుది లేఅవుట్ అనుమతికి ఎవరిని ఆశ్రయించాలనే సందిగ్ధత నెలకొని ఉండేది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టతనిస్తూ.. హెచ్‌ఎండీఏ, ఎఫ్‌సీడీఏలకు ఆ అధికారాలను దఖలుపరిచింది. దీని ప్రకారం.. హెచ్‌ఎండీఏ, ఫ్యూచర్‌సిటీ పరిధిలోని గ్రామాల్లో డ్రాఫ్ట్, తుది లేఅవుట్లకు డీటీసీపీకి ఎలాంటి అధికారాలు ఉండవు. అయితే.. ఇప్పటికే డీటీసీపీ ఇచ్చిన డ్రాఫ్ట్ లేఅవుట్ల ఆధారంగా తుది లేఅవుట్లకు అనుమతి ఇవ్వాలని హెచ్‌ఎండీఏ, ఎఫ్‌సీడీఏలను మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఆదేశించింది. పరిధి ఆధారంగా లేఅవుట్ల దరఖాస్తులను పరిష్కరించాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఒకవేళ ఈ పంచాయతీ పోర్టల్ ద్వారా డీటీసీపీకి చేసిన డ్రాఫ్ట్ లేఅవుట్ దరఖాస్తులను ప్రాసెస్ చేయకుంటే.. వాటిని దరఖాస్తుదారులకు తిప్పి పంపాలని తెలిపింది. అలాంటి దరఖాస్తులను పరిధిని బట్టి హెచ్‌ఎండీఏ లేదా ఎఫ్‌సీడీఏకు తిరిగి సమర్పించాలని తన ఆదేశాల్లో వివరించింది.

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌పై బురదజల్లే యత్నం

» రేవంత్‌కు పాలనపై శ్రద్ధ లేదు: బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడిన కేసీఆర్, ప్రజల పక్షాన పోరాడుతున్న కేటీఆర్, హరీశ్‌రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం బురద జల్లే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ మహిళా నేతలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, పద్మా దేవేందర్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం పేరిట మొన్న కేసీఆర్, హరీశ్‌ను విచారణకు పిలిపించారని, ఇప్పుడు ఫార్ములా ఈ రేస్ అంశంలో కేటీఆర్‌ను ఏసీబీ విచారణకు రప్పించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అందాల పోటీల పేరుతో రూ.200కోట్లు వృథా చేయడం తప్ప చేసిందేముందని ప్రశ్నించారు. కాగా, ప్రతిపక్షాన్ని వేధించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం సమయం వెచ్చిస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డికి పాలనపై ఏ మాత్రం శ్రద్ధ లేదని బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ విమర్శించారు.

సివిల్ వివాదాల్లో ఎందుకు తలదూరుస్తారు?

» కోర్టులు చేయాల్సిన పనులను మీరే చేసేస్తున్నారు

» పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సివిల్ కోర్టు చేయాల్సిన పనులన్నీ పోలీసులే చేసేస్తున్నారని హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సివిల్ వివాదాల్లో ఎందుకు తలదూరుస్తారని ప్రశ్నించింది. "పోలీసుల కారణంగానే కక్షిదారులు న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి వస్తోంది. న్యాయస్థానాలు చేసే పనులు కూడా పోలీసులే నిర్వహించాలని చూస్తున్నారు. శాంతి భద్రతలు, దర్యాప్తు కంటే గిఫ్ట్ డీడ్, విల్లు లాంటి సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోవడమే ఎక్కువగా కనిపిస్తోంది. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను, దావాలను ఉపసంహరించుకోమని ఎలా చెబుతారు? ఆ అధికారం పోలీసులకు ఎక్కడ ఉంది" అని తీవ్రంగా వ్యాఖ్యానించింది. బార్కాస్‌లోని ఇంటి స్థలంపై కోర్టులో ఉన్న దావాను వెనక్కు తీసుకోవాలని పోలీసులు బెదిరింపులకు గురిచేస్తున్నారని హైకోర్టులో పిటిషన్ దాఖలయింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఎన్నిసార్లు చెప్పినా పోలీసుల తీరు మాత్రం మారడం లేదని వ్యాఖ్యానించింది. ఎండల్లో వచ్చిన బాధితులకు కనీసం మంచినీళ్లైనా ఇవ్వరని, చాలా స్టేషన్లలో ఫిర్యాదు చేయడానికి పేపర్లు సహా స్టేషనరీ తెచ్చుకోవాలని చెబుతున్నారని తెలిపింది. పోలీసుల చట్టం ఏం చెబుతుందో చదువుకోవాలని, తమకు నచ్చిన విధంగా తక్షణ న్యాయం అందించాలనుకోవడాన్ని మానుకోవాలని హితవు పలికింది. తాజా పిటిషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌పై విచారణకు ఆదేశిస్తామని వ్యాఖ్యానించింది. సివిల్ విషయాల్లో జోక్యం చేసుకోబోమని ప్రభుత్వ న్యాయవాది హామీ ఇవ్వడంతో విచారణను ముగించింది.

ఏడు జిల్లాల్లో కొత్తగా జవహర్ నవోదయ విద్యాలయాలు

రాష్ట్రానికి మంజూరైన ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలు ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభం కానున్నాయి. కొత్తగూడెం, జగిత్యాల, మహబూబ్‌నగర్, మేడ్చల్, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాలకు వీటిని మంజూరుచేశారు. వీటి ప్రారంభంపై సోమవారం విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్‌తోపాటు నవోదయ విద్యాలయ సమితి ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ టి.గోపాలకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్లు టి.సూర్యప్రకాశ్, బి.చక్రపాణి చర్చలు జరిపారు. వచ్చే నెల 14 నుంచి అన్ని వసతులతో పూర్తిస్థాయిలో తరగతులు ప్రారంభిస్తామని, త్వరలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభిస్తామని యోగితా రాణా తెలిపారు.

రేవంత్ పాలనలో వైద్య కళాశాలల భవితవ్యం ప్రశ్నార్థకం

» ఎన్ఎంసీ తాఖీదులు ప్రభుత్వం చేతగాని తనానికి నిదర్శనం

» మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో ఎంతో ముందుచూపుతో ప్రారంభించిన ప్రభుత్వ వైద్య కళాశాలల భవితవ్యం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రశ్నార్థకంగా మారిందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సోమవారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సౌకర్యాలు, వసతులు నిబంధనల ప్రకారం లేవని పేర్కొంటూ.. ఈనెల 18న హెల్త్ సెక్రటరీ, డీఎంఈ ఇద్దరూ జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ముందు ప్రత్యక్షంగా హాజరుకావాలని ఆదేశాలివ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పరిపాలనా వైఫల్యం వైద్య విద్యార్థులకు శాపంగా మారుతోందని విమర్శించారు. సీఎం రేవంత్ ఇప్పుడు మేల్కొని దానిపై కమిటీ వేయడం హాస్యాస్పదమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనను గాలికొదిలేసి ప్రతీకార రాజకీయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వందలాది వైద్య విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు భరోసానిస్తారో చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తక్షణమే మెడికల్ కళాశాలలకు నిధులు విడుదల చేసి, వైద్య విద్యార్థుల జీవితాలను నిలబెట్టాలని కోరారు.

కొమ్మినేనికి షరతులతో బెయిల్

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసులో సాక్షి టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మంగళగిరి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లరాదని స్పష్టం చేసింది. ప్రతి నెలా రెండు, నాలుగు శనివారాల్లో తుళ్లూరు ఎస్‌హెచ్‌ఓ ఎదుట హాజరై సంతకం చేయాలని, పోలీసుల విచారణకు సహకరించాలని ఆదేశించింది. సాక్షులను ప్రభావితం చేయడం, బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడరాదని హెచ్చరించింది. కేసుకు సంబంధించిన విషయాలు మాట్లాడరాదని, అసభ్యకరమైన పదజాలం వాడరాదని సూచించింది. ఎదుటివారిని కించపరిచే వ్యాఖ్యలు చేయరాదని స్పష్టం చేసింది. రూ.20 వేలు చొప్పున రెండు షూరిటీలు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. సోమవారం రాత్రి గుంటూరు జిల్లా జైలు నుంచి కొమ్మినేని విడుదలయ్యారు.

మంత్రివర్గ ఆమోదం లేకుండా చెల్లింపులేంటి?

(మొదటి పేజీ తరువాయి)



ఏసీబీ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు

ఏడుగంటలకుపైగా సాగిన విచారణలో వారు ఆయన్ను 60 దాకా ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో నిధుల దుర్వినియోగంపై ఏసీబీ నమోదు చేసిన కేసులో కేటీఆర్ దర్యాప్తు అధికారుల ఎదుట రెండోసారి విచారణకు హాజరయ్యారు. గతంలో విచారణకు హాజరైన సమయంలో కేటీఆర్‌ను ప్రశ్నించిన అధికారులు.. అప్పుడు ఆయన ఇచ్చిన సమాధానాలు, ఈ కేసులో ఎఫ్ఈవో కంపెనీ ప్రతినిధుల నుంచి సేకరించిన పత్రాలు, సమాచారం ఆధారంగా ప్రత్యేక ప్రశ్నావళి రూపొందించి, మరింత లోతుగా విచారించి, సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు.

ఎందుకు? ఏమిటి? ఎలా?

ఏసీబీ నోటీసుల మేరకు కేటీఆర్ సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో.. తన న్యాయవాది రాంచందర్‌రావుతో కలిసి బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఏసీబీ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, సీఐయూ డీఎస్పీతో కూడిన ప్రత్యేక బృందం అప్పట్నుంచీ నుంచి సాయంత్రం ఐదున్నర దాకా.. 7 గంటలకుపైగా ఆయన్ను ప్రశ్నించింది. "ఎలాంటి లాభాపేక్షా లేకపోతే ఎఫ్ఈవో కంపెనీకి నిధుల చెల్లింపుల్లో నిబంధనలు అతిక్రమించాల్సిన అవసరం ఏమిటి? అసలు మంత్రివర్గ ఆమోదం లేకుండా నిధులు ఎందుకు చెల్లించారు? నిధుల చెల్లింపుల్లో క్విడ్ ప్రో కో జరిగిందా? రేసు నిర్వహణలో త్రైపాక్షిక ఒప్పందం ఏమిటి? అసలు అగ్రిమెంట్‌కు నాలుగు నెలల ముందు ఏర్పాటు చేసిన కంపెనీకి బాధ్యతలు ఎలా ఇచ్చారు? కేవలం రూ.2 లక్షలు క్యాపిటల్‌తో ఉన్న కంపెనీకి బాధ్యతలు ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది?" అంటూ దర్యాప్తు అధికారులు అడిగిన పలు కీలక ప్రశ్నలకు కేటీఆర్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారని.. కొన్నింటికి మాత్రం మౌనంగా ఉన్నారని.. కొన్ని ప్రశ్నలకు 'తెలియదు' అనే సమాధానం ఇచ్చారని సమాచారం. కాగా.. ఫార్ములా ఈ కార్ రేసు ఒప్పందాలు మొదలైనప్పటి నుంచి రేసు ముగిసేంత వరకు.. అంటే 2021 నుంచి 2024 వరకు ఉపయోగించిన సెల్ ఫోన్లను అప్పగించాల్సిందిగా కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ఆదేశించారు. సోమవారం విచారణకు హాజరైన సమయంలో కేటీఆర్ ఫోన్ సీజ్ చేసేందుకు అధికారులు ప్రయత్నించగా.. తాను ఫోన్ తీసుకురాలేదని ఆయన చెప్పినట్లు తెలిసింది. దీంతో.. 2021-2024 మధ్యకాలంలో ఉపయోగించిన సెల్‌ఫోన్లను 18వ తేదీలోగా అప్పగించాలని అధికారులు ఆదేశించారు.

ఎదురు ప్రశ్నలు..

విచారణ సందర్భంగా.. దర్యాప్తు అధికారులు అడిగిన కొన్నిప్రశ్నలకు కేటీఆర్ ఎదురు ప్రశ్నలు వేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం మొత్తాన్నీ అధికారులే చూసుకున్నారని.. హెచ్‌ఎండీఏ నిధులు ఎఫ్ఈవోకు పంపించానని, తన సొంత ఖాతాకు కాదని.. ఏసీబీ ఆరోపిస్తున్న ప్రకారం ఎక్కడ తప్పిదాలు ఉన్నాయో స్పష్టం చేయాలని అధికారుల్ని కేటీఆర్ అడిగినట్లు తెలిసింది. స్పాన్సర్ సంస్థ వెనక్కి తగ్గడంతో ఎఫ్ఈవో ఒత్తిడి మేరకు మరో స్పాన్సర్‌ను వెతకలేక పోయామని, అందుకే హెచ్‌ఎండీఏ నిధుల నుంచి ఫీజు చెల్లించామని కేటీఆర్ ఏసీబీ అధికారులకు వివరించినట్లు తెలిసింది.

ఏసీబీ క్యాంటీన్‌లోనే భోజనం

విచారణకు హాజరైన కేటీఆర్‌కు దర్యాప్తు అధికారులు బయటి నుంచి భోజనం తెచ్చుకోవడానికి అనుమతించలేదు. దీంతో ఆయన ఏసీబీ కార్యాలయంలోని క్యాంటీన్‌లోనే మధ్యాహ్న భోజనం చేశారు. పచ్చిపులుసు, టమాట పప్పు, మిక్స్‌డ్ కర్రీ, అన్నం, రెండు చపాతీలు తిన్నారు. టీ బ్రేక్‌లో రెండుసార్లు చాయ్ తాగారు. గతంలో విచారణకు హాజరైన సమయంలోనూ కేటీఆర్ ఏసీబీ కార్యాలయంలోని క్యాంటీన్ భోజనమే చేశారు.

విచారణ వేళ హైటెన్షన్

» ఏసీబీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

» నిలోఫర్ కేఫ్‌ను మూసివేయించిన పోలీసులు

» బీఆర్ఎస్ ఆఫీసుకు బయట నుంచి తాళం

» అదే సమయంలో కమాండ్ కంట్రోల్‌కు సీఎం



బీఆర్ఎస్ కార్యకర్తలను తరలిస్తున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ విచారణ సందర్భంగా ఏసీబీ ప్రధాన కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. తెలంగాణ భవన్, ఏసీబీ కార్యాలయానికి మధ్యలో కమాండ్‌కక ంట్రోల్ సెంటర్ ఉండడంతో.. అక్కడ భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విచారణకు వెళ్లే ముందు కేటీఆర్.. తనను ప్రభుత్వం అరెస్టు చేసే అవకాశం ఉందని చెప్పడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌కు పెద్ద ఎత్తున చేరుకున్నారు. మరోవైపు.. మధ్యాహ్నం 2 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించడంతో అక్కడ హైటెన్షన్ వాతావరణం నెలకొంది. అప్పటికే అక్కడి నిలోఫర్ కేఫ్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు తిష్ఠ వేయడంతో పోలీసులు దాన్ని మూసివేయించారు. అలాగే.. తెలంగాణ భవన్‌కు తాళం వేశారు. విచారణకు వచ్చిన కేటీఆర్ వాహనాన్ని ఏసీబీ కార్యాలయంలోనికి అనుమతించిన పోలీసులు.. పార్టీ శ్రేణుల వాహనాల్ని కొంత దూరంలో అడ్డుకుని వెనక్కి తిప్పిపంపారు.

ఫార్ములా-1 రేసు కేసులో కీలకమైన అర్వింద్ కుమార్ అదృశ్యం

» భువనగిరి ఎంపీ చామల అనుమానం

» కుట్రలూ కుతంత్రాలకు నిలయం కేటీఆర్ అని ఆరోపణ



హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా వన్ రేసు కేసులో కీలకమైన ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ అదృశ్యంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పలు అనుమానాలు వ్యక్తం చేశారు. అర్వింద్‌కుమార్ అందుబాటులో లేనందున ఏసీబీ విచారణలో తనకేమీ కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమాతో ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి తదితరులతో కలిసి కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ కుట్రలూ కుతంత్రాలకు నిలయమని ఆరోపించారు. ఫార్ములా వన్ రేసులో కీలకమైన అర్వింద్ కుమార్ ఎక్కడున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొందని ఎంపీ చామల పేర్కొన్నారు. ఫార్ములా వన్ రేసు విచారణ సందర్భంగా అర్వింద్ కుమార్‌ను విదేశాలకు పంపారా..? మరెక్కడైనా దాచిపెట్టారా..? అన్న విషయం బహిర్గతం కావాల్సి ఉందని చెప్పారు. వాస్తవంగా అందుబాటులో ఉంటే అర్వింద్ కుమార్ స్వయంగా చెప్పుకుంటారన్నారు. కేటీఆర్ మిత్రుడు కేదార్ గతంలో విదేశాల్లోనే చనిపోయారని ఆయన గుర్తు చేశారు. కేటీఆర్ ప్లాన్‌తోనే ప్రభాకర్‌రావు ఏడాదిన్నర కాలంగా అమెరికాకెళ్లి దాక్కున్నారని ఆరోపించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడినందు వల్లే కేటీఆర్‌పై విచారణ జరుగుతున్నదన్నారు. ఏసీబీ విచారణకు హాజరైన కేటీఆర్.. సినిమాలో మహేశ్ బాబు మాదిరి డైలాగ్‌లు కాపీ కొడుతూ హీరోలా ఫీలవుతున్నారని ఎంపీ చామల ఎద్దేవా చేశారు. ఆయనవన్నీ సినిమా డైలాగులేనని, ఆయన మాటల్లో ఒక్కటీ నిజం కాదని తెలంగాణ ప్రజలకు తెలిసిపోయిందన్నారు. అరెస్టు కావడానికే ఆయన ఓవర్ యాక్టింగ్ చేస్తున్నారని చామల ఎద్దేవా చేశారు. జైలుకెళ్తేనే సీఎం అవుతారనే ట్రెండ్‌ను కేటీఆర్ బలంగా నమ్ముతున్నారని విమర్శించారు. ఢిల్లీ జైలుకు కవిత వెళ్లిందని, తాను హైదరాబాద్‌లో జైలుకెళితే తానే సీఎం అవుతానని సన్నిహితుల వద్ద కేటీఆర్ చెబుతున్నారని ఆయన అన్నారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వలే తనకు తాను ఫీల్ అవుతున్న కేటీఆర్ ఉద్యమ కారుడు కాదని స్పష్టం చేశారు. గతంలో జైలుకెళ్లానని, ఎన్నిసార్లైనా జైలుకెళ్తానని డైలాగులు చెబుతున్న కేటీఆర్.. ఎప్పుడు జైలుకెళ్లారని ప్రశ్నించారు. గత జన్మలో దక్షిణాఫ్రికాలో గాంధీజీతో కలిసి జైలుకెళ్లారా? అని ఎద్దేవా చేశారు. తమ అవసరాల కోసం చేసిన తప్పులు కప్పి పుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నేతలు ఏమైనా చేస్తారని ఆయన ఆరోపించారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్వల్ప అస్వస్థత

కిమ్స్ ఆస్పత్రిలో చేరిక.. కేటీఆర్ పరామర్శ

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్‌నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో బాధ పడుతున్న ఆయన సోమవారం సాయంత్రం ఏడు గంటలకు బేగంపేటలోని కిమ్స్ ఆస్పత్రిలో చేరారు. జనరల్ ఫిజిషియన్, ఇంటర్నల్ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ ఎస్.పాటిల్ సుదేశ్ వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత ఆస్పత్రిలో అడ్మిట్ కావాలని హరీశ్ రావుకు సూచించారు. వైరల్ ఫీవర్‌తో బాధ పడుతున్న హరీశ్‌రావు ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ సంగతి తెలియడంతో హరీశ్‌రావును పరామర్శించడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఆ పార్టీ నేతలు హుటాహుటిన కిమ్స్ ఆస్పత్రికి వచ్చారు.

ఇక అన్ని పోలింగ్ స్టేషన్ల నుంచి వెబ్‌కాస్టింగ్

ఎలక్షన్ కమిషన్ నిర్ణయం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికార్లకు లేఖ

న్యూఢిల్లీ, జూన్ 16: పోలింగ్ జరుగుతున్న తీరును మరింత నిశితంగా పరిశీలించడానికి నూరు శాతం వెబ్‌కాస్టింగ్ విధానాన్ని అమలు చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ప్రస్తుతం 50 శాతం పోలింగ్ స్టేషన్ల నుంచే వెబ్‌కాస్టింగ్ జరుగుతుండగా ఇకపై మొత్తం అన్ని పోలింగ్ స్టేషన్ల నుంచి నూరు శాతం వెబ్‌కాస్టింగ్ జరపాలంటూ ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు సోమవారం లేఖలు రాసింది. ఈ ఏడాది చివర్లో బిహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నూరు శాతం వెబ్‌కాస్టింగ్ విధానాన్ని అమలు చేస్తారు. ఇంతవరకు సంక్లిష్టమైన పోలింగ్ స్టేషన్లకే పరిమితమైన ఈ సదుపాయాన్ని ఇక నుంచి అన్ని పోలింగ్ స్టేషన్లకు వర్తింపజేస్తారు. ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉన్న చోట్ల మాత్రమే వెబ్‌కాస్టింగ్ సాధ్యపడుతుంది.

జై తెలంగాణ అననోణ్ని ఏమనాలె?

హౌలా అన్నందుకు నాపై మండిపడుతున్నరు.. రేవంత్‌లాగా లుచ్చాపని మా పార్టీలో ఎవరూ చేయలే

» నాపై పెట్టింది లొట్టపీసు కేసు.. ఆయనో లొట్టపీసు సీఎం

» నన్ను జైల్లో పెడితే విశ్రాంతి తీసుకుంటా

» స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఫుట్‌బాల్ ఆడుకుందాం

» పార్టీ శ్రేణులతో కేటీఆర్



తెలంగాణ భవన్‌లో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు కొనసాగుతున్నాయని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. పాలన చేతగాని రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టి, వేధించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. "మొన్న ఆయన్ను హౌలా అన్నందుకు మండిపడుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండి కూడా జై తెలంగాణ అననోడ్ని ఏమనాలె?" అని కేటీఆర్ ప్రశ్నించారు. 'రాష్ట్రం దివాలా తీసిందంటడు. ఢిల్లీలో దొంగలా చూస్తున్నారంటడు. అప్పు పుట్టడం లేదంటడు. ఇలాంటోడ్ని ఏమనాల్నో మీరే చెప్పండి' అని బీఆర్ఎస్ కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. ఏసీబీ విచారణకు హాజరైన అనంతరం సోమవారం సాయంత్రం కేటీఆర్ పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా తెలంగాణభవన్‌కు చేరుకున్నారు. అక్కడ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ ప్రతిష్ఠను ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లే పనిచేశానని, తలదించుకునేలా తాను ఎలాంటి తప్పూ చేయలేదని కేటీఆర్ చెప్పారు. లుచ్చా పనిచేసి నెలరోజులు జైల్లో ఉన్న రేవంత్‌కు ప్రతిపక్ష నేతలను కూడా కొన్నిరోజులు జైల్లో పెట్టాలని ఒక షోకు ఉందని.. అందుకే తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌ను, మాజీ మంత్రి హరీశ్‌ను కాళేశ్వరం కమిషన్ విచారణకు రప్పించారని ఆరోపించారు. ఆయనలాగా లుచ్చా పనిచేసి రూ.50 లక్షలతో పట్టుబడిన వారు తమ పార్టీలో ఎవరూ లేరన్నారు. 'నాకు దక్కనిది ఎవరికీ దక్కొద్దు.. నాకు జరిగింది నీకూ జరగాలి' అన్నట్లుగా సీఎం శాడిస్టులా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. 'జైల్లో పెడితే పెట్టనీ. 15 రోజులు జైలుకెళ్తే ఏమైతది. కొన్ని రోజులు రెస్ట్ తీసుకుంట. ఈ ఉడత ఊపులకు భయపడేది లేదు' అని కేటీఆర్ అన్నారు. నాలుగు గోడల మధ్య కాదు నాలుగు కోట్ల మంది ముందు ఫార్ములా-ఈ రేసు గురించి అసెంబ్లీలో చర్చిద్దామంటే రేవంత్‌రెడ్డి పారిపోయారని చెప్పారు. దేశంలో ఏ రాజకీయ నాయకుడు సాహసించని లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమని తానంటే.. రావడానికి ఈ సీఎంకు ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. మొదటి సంవత్సరం ఫార్ములా-ఈ రేసు విజయవంతం కావడంతో రెండో ఏడాది కూడా హైదరాబాద్‌లోనే నిర్వహించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందన్నారు. అందులో భాగంగానే నిర్వహణ సంస్థకు డబ్బులు పంపిన విషయాన్ని ఏసీబీ అధికారులకు వివరించానని కేటీఆర్ తెలిపారు. ఇందులో అవినీతి ఎక్కడ ఉందని తాను అధికారులను ప్రశ్నిస్తే, సమాధానం చెప్పలేకపోయారన్నారు. చిట్టినాయుడు రాసిచ్చిన పనికిమాలిన ప్రశ్నలనే ఏసీబీ అధికారులు పొద్దుట్నుంచీ అటుతిప్పి, ఇటుతిప్పి అడిగారని చెప్పారు. ఒకవేళ ప్రభుత్వ పెద్దల నుంచి అరెస్ట్ చేయాలని ఒత్తిడి ఉంటే చేసుకోమని అధికారులకు చెప్పానన్నారు. రేవంత్‌రెడ్డి ఒక లొట్టపీసు ముఖ్యమంత్రి అని, వాళ్లు తనపై పెడుతున్న కేసులన్నీ లొట్టపీసు కేసులేనని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దద్దమ్మ రాజకీయాలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనిపై పార్టీ శ్రేణులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ధైర్యంగా ఎదుర్కొందామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఫుట్‌బాల్ ఆడుకుందామని, ఆ పార్టీ అభ్యర్థులను చిత్తుగా ఓడించి సత్తా చాటుకుందామని పిలుపునిచ్చారు. ఈ నెల 21కి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ఆరేళ్లవుతోందని, ఈ సందర్భంగా కాళేశ్వరం గొప్పదనాన్ని ప్రజలకు తెలియజేద్దామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ తరఫున కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ప్రశ్నిస్తున్నందుకే కక్ష సాధింపు: హరీశ్

రేవంత్‌రెడ్డి అసమర్థతను, పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని హరీశ్ ఆరోపించారు. ప్రజలకిచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చని రేవంత్‌రెడ్డి.. 18 నెలల పాలనలో కేటీఆర్‌పై 14కేసులు పెట్టారని విమర్శించారు. దేశంలోని చాలా రాష్ట్రాలు పోటీ పడినా కేటీఆర్ తన శక్తియుక్తులను ఉపయోగించి హైదరాబాద్‌కు ఫార్ములా-ఈ రేసును తెచ్చారన్నారు. దేశంలో ఏ రాష్ట్రమూ అందాల పోటీలను నిర్వహించబోమని తేల్చిచెబితే రేవంత్‌రెడ్డి మాత్రం తెలంగాణలో నిర్వహించి రాష్ట్రం పరువు తీశారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోనే కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెట్టి, చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా కేటీఆర్ భయపడే వ్యక్తి కాదని తెలిపారు. లక్షలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, కుటుంబ సభ్యుల అండ ఉన్న కేటీఆర్‌ను ముట్టుకుంటే భస్మం అయిపోతారని కాంగ్రెస్‌ను హెచ్చరించారు.

ఏసీబీకి జవాబులు చెప్పలేక కేటీఆర్ ఆపసోపాలు

» లొట్టపీసు కేసంటూనే వణికిపోతున్నారు: ఆది శ్రీనివాస్

» భయంతోనే కేటీఆర్ పిచ్చి ప్రేలాపనలు: అద్దంకి దయాకర్

» విచారణకు ఎన్నిసార్లు పిలిచినా వెళ్లాల్సిందే: బల్మూరి వెంకట్

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక లోపల ఆపసోపాలు పడిన కేటీఆర్.. బయటికొచ్చి పులకేశిలా బిల్డప్ ఇస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. లొట్టపీసు కేసు అంటూనే లోపల వణికిపోతున్నారని పేర్కొన్నారు. ఫార్ములా-ఈ రేస్ కేసులో ముద్దాయిగా ఉన్న వ్యక్తి విచారణకు హాజరై.. అరెస్ట్ కాకుండా వచ్చాడని బీఆర్ఎస్ కార్యకర్తలు బాణాసంచా కాల్చి, సంబరాలు చేసినట్లున్నారని ఎద్దేవా చేశారు. ఆ రేసు ద్వారా తెలంగాణ ప్రతిష్ఠను పెంచానని గప్పాలు కొట్టుకునేందుకు సిగ్గుండాలని ధ్వజమెత్తారు. అరెస్టు భయంతో కేటీఆర్ పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. ఆయన పరిస్థితి చూస్తుంటే సిగ్గు పోయేదాకా సిగం ఊగినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతూ తెలంగాణ పరువు తీస్తున్నారని విమర్శించారు. కేటీఆర్ వ్యవహారాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఉద్యమంలో కేటీఆర్ జైలుకు వెళ్లాడో.. లేదో తెలియదు కానీ.. ఇలాగే పిచ్చి ప్రేలాపనలు చేస్తే తగిన బుద్ధి చెప్పడానికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. చట్టం మీద గౌరవం ఉందంటూనే కేటీఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, సత్యహరిశ్చంద్రుడిలా బిల్డప్ ఇస్తున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మండిపడ్డారు. అవసరమైతే మూడు సార్లు కాదు.. 300 సార్లైనా అధికారులు విచారణకు పిలిచినప్పుడు వెళ్లాల్సిందేనని అన్నారు. కేటీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే విచారణలో నిజాయితీగా సమాధానాలు చెప్పాలన్నారు. అనవసరంగా కేసులు బనాయించాల్సిన అవసరం తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. మంత్రి వర్గం అనుమతి లేకుండా ఇష్టానుసారంగా విదేశీ కంపెనీకి 55 కోట్లు దోచిపెట్టిన కేటీఆర్.. ఇప్పుడు నంగనాచి కబుర్లు చెపుతున్నారని విమర్శించారు. కేవలం విచారణకు పిలిస్తేనే ఎందుకింత హడావుడి అని ప్రశ్నించారు.



జేఎన్‌టీయూ కాలేజీ ప్రిన్సిపాల్‌తో చర్చిస్తున్న సుజుకీ కంపెనీ ప్రతినిధులు

జేఎన్‌టీయూలో సుజుకీ ఇన్నోవేషన్ సెంటర్!

- కోర్ బ్రాంచ్‌ల విద్యార్థులకు నైపుణ్య, ఉపాధి శిక్షణ
- వర్సిటీ అధికారులతో ఆ కంపెనీ ప్రతినిధుల చర్చలు
- ఈ విద్యా సంవత్సరంలోనే ప్రారంభించే అవకాశం

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు జపాన్‌కు చెందిన మోటార్ వాహనాల తయారీ కంపెనీ సుజుకీ ముందుకొచ్చింది. ఈ మేరకు సోమవారం ఆ సంస్థ ప్రతినిధులు జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డితో భేటీ అయ్యారు. మెకానికల్, మెటలర్జికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు జపాన్‌లోని సుజుకీ, మిత్సుబిషి, టయోటా, హోండా, నిస్సాన్ వంటి కంపెనీల్లో మెరుగైన ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రిన్సిపాల్‌ను కలిసిన వారిలో సుజుకీ కంపెనీ ప్రతినిధులు షుంసుకె ఆకీ, నయోకీ నమోటో ఉన్నారు. కాగా ఐఐటీల్లోనే కాకుండా జేఎన్‌టీయూ వంటి సాంకేతిక విద్యాసంస్థల్లోనూ ఇన్నోవేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సుజుకీ కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. కోర్ బ్రాంచ్‌ల విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో పుష్కరాలపై వివక్ష వద్దు: సురేఖ

వరంగల్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పుష్కరాలకు ఏపీ వలే తెలంగాణకు కూడా నిధులు కేటాయించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కేంద్రాన్ని కోరారు. వరంగల్‌లో ఆమె మాట్లాడారు. తెలంగాణలో నిర్వహించే పుష్కరాలపై కేంద్రం వివక్ష చూపరాదని, రెండు తెలుగు రాష్ట్రాలను సమానంగా చూడాలని కోరారు. ఏపీని ఒకలా తెలంగాణను మరోలా చూడడం సరికాదన్నారు. 2027లో నిర్వహించేపుష్కరాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కావాల్సిన ఏర్పాట్ల కోసం కేంద్రం నిధులు విడుదల చేయాల్సిన అవసరముందన్నారు. ఈ విషయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ చూపాలని కోరారు.

రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా సంతోష్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా జస్టిస్ ఎ.సంతోష్ రెడ్డిని నియామకమయ్యారు. ఈ మేరకు పురపాలక శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో చైర్మన్‌గా పనిచేసిన జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి లోకాయుక్త చైర్మన్‌గా వెళ్లడంతో తాత్కాలిక చైర్‌పర్సన్‌గా చిత్రా రామచంద్రన్ బాధ్యతలు చేపట్టారు. తాజాగా అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా జస్టిస్ ఎ.సంతోష్ రెడ్డిని నియమిస్తూ పురపాలక శాఖ కార్యదర్శి కె.ఇలంబర్తి సోమవారం ఉత్తర్వులిచ్చారు.

వీటీడీఏకు రూ.25 కోట్ల నిధులు

వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి(వీటీడీఏ) ప్రభుత్వం రూ.25 కోట్ల నిధులు మంజూరు చేసింది. వీటీడీఏలో అభివృద్ధి పనులకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నిధులు కేటాయిస్తున్నట్లు పురపాలక శాఖ కార్యదర్శి కె.ఇలంబర్తి సోమవారం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిమ్స్‌లో ఎంహెచ్‌ఎం కోర్సులు

- జూన్ 28 వరకు దరఖాస్తుకు అవకాశం

నిమ్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్).. 2025 సంవత్సరానికి సంబంధించి మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్‌ఎం) కోర్సులో 20 సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. రెండున్నరేళ్ల కోర్సులో భాగంగా చివరి 6 నెలల పాటు ఇంటర్న్‌షిప్‌కు హాజరుకావాల్సి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది జూన్ 28 అని, దరఖాస్తు హార్డ్ కాపీని జూలై 2 లోగా అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా 040- 2348 9189 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

అంగన్‌వాడీ గుడ్ల టెండర్లు మళ్లీ పొడిగింపు!

హైదరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేసేందుకు ఆహ్వానించిన టెండర్ల గడువును మరోసారి పొడిగించారు. వాస్తవానికి సోమవారంతోనే గడువు ముగియగా.. ఈ నెల 30 వరకు పొడిగించారు. వచ్చే నెల 1న బిడ్లు ఓపెన్ చేస్తామని మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు ప్రకటించారు.

21న మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న అడ్లూరి

రాష్ట్ర మంత్రివర్గంలోకి ఇటీవల కొత్తగా వచ్చిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈనెల 21న మంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. సచివాలయంలోని మొదటి అంతస్తులో తనకు కేటాయించిన చాంబర్‌లో 21న ఉదయం 9.22 గంటలకు బాధ్యతలు చేపట్టనున్నారు.

బతుకమ్మ చీరల ఖర్చుపై విచారణ జరపండి

- సీఎస్‌కు టీడీపీ లేఖ

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన బతుకమ్మ చీరల ఖర్చుపై విచారణ జరపాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కోరారు. ఏడేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం, బతుకమ్మ చీరలకు రూ2,148 కోట్లు ఖర్చు చేసినట్లు చేనేత, జౌళిశాఖ వెల్లడించిందని ఆయన పేర్కొన్నారు. అందులో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు తెలుస్తోందని బక్కని, సీఎస్‌కు రాసిన లేఖలో తెలిపారు. దీనిపై విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలని ఆయన కోరారు.

హైదరాబాద్‌లో సోమిరెడ్డి లా గ్రూప్ కార్యాలయం

అమెరికాకు చెందిన ప్రముఖ న్యాయ సేవా సంస్థ 'సోమిరెడ్డి లా గ్రూప్' హైదరాబాద్‌లో తన కార్యాలయాన్ని ప్రారంభించనుంది. సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో సోమిరెడ్డి సంతోష్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డిని కలిసి కోకాపేటలో ఏర్పాటు చేయబోతున్న కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో న్యాయ సేవలు అందించే సోమిరెడ్డి లా గ్రూప్ సేవలు... దేశ యువతకు అవకాశాల గేట్ వే మారతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్, వర్జీనియా, న్యూజెర్సీ, నార్త్ కరోలినా, కాలిఫోర్నియా వంటి పలు రాష్ట్రాల్లో సేవలందిస్తున్న సోమిరెడ్డి లా గ్రూప్.. ఇప్పుడు భారతీయులకు, సంస్థలకు నేరుగా న్యాయ సలహాలు, వీసా సహాయం అందించనుందని తెలిపారు.

పొంగులేటిపై టీపీసీసీ చీఫ్ ఫైర్


(మొదటిపేజీ తరువాయి)

అంశాలను ముందే మాట్లాడితే ఎలా? అని ప్రశ్నించినట్లు సమాచారం. మంత్రులు వారి శాఖల పరిధిలోనే మాట్లాడాలని, కోర్టు పరిధిలో ఉన్న సున్నితమైన అంశాలపై మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏ మంత్రి అయినా తన మంత్రిత్వ శాఖకు సంబంధించిన అంశాలనే మాట్లాడాలని, ఇతర మంత్రుల శాఖలకు సంబంధించిన అంశాలపై మాట్లాడటం తగదని సున్నితంగా హెచ్చరించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్ బాధ్యతలు చేపట్టాక.. ఒక మంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేయడం ఇదే తొలి సారి కావడం గమనార్హం.

9 రోజుల్లో 9 వేల కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

ఖర్చు పెట్టిందని చెప్పారు. గత ప్రభుత్వంలోని పెద్దలు ప్రాజెక్టుల పేరుతో లక్ష కోట్లు దోచుకుంటే.. ఈ ప్రభుత్వం ఏడాదిన్నరలోనే లక్ష కోట్లు రైతులకు పంచిపెట్టిందని తెలిపారు. పదేళ్లలో వందేళ్ల విధ్వంసం జరిగిందని, ఆర్థిక విధ్వంసాన్ని సరిచేయడానికి రోజుకు 18 గంటలు పనిచేస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాజకీయాల్లోకి ఎవరొచ్చినా రైతుల అండదండలు లేకుంటే ఏమీ చేయలేరన్నారు. వార్డు సభ్యుడు, సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ, చివరకు ముఖ్యమంత్రి కావాలన్నా రైతుల ఆశీర్వాదం ఉంటేనే సాధ్యపడుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు. అప్పుడే పది కాలాలపాటు కుర్చీ పదిలంగా ఉంటుందని చెప్పారు. ఉమ్మడి ఏపీలో, గత పదేళ్లలో అధికారంలో ఉండి ఏమీ చేయనివారు ఇప్పుడు వీధి నాటకాలు ఆడుతూ విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో ప్రజల నెత్తిమీద అప్పు, రైతుల చేతిలో చిప్ప పెట్టడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రుణమాఫీ, ఉద్యోగులకు పదవీ విరమణ సొమ్ము, మొదటి తారీఖున వేతనాలు ఇవ్వలేని పరిస్థితుల్లోకి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని దోచుకున్నారని దుయ్యబట్టారు. 2018 నుంచి 2023 వరకు రూ.11,500 కోట్ల రుణమాఫీ చేస్తే.. రూ.8,500 కోట్లు వడ్డీలకే పోయిందని, కేవలం రూ.3 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ అయ్యిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిందని తెలిపారు. వరి వేస్తే ఉరి వేసుకున్నట్లేనని గత ప్రభుత్వం చెప్పిందని.. తమ ప్రభుత్వం మాత్రం కనీస మద్దతు ధరతోపాటు సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేసి, 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తోందని గుర్తుచేశారు. రైతులకు వరి సాగు చేయొద్దని చెప్పి, వాళ్లు మాత్రం ఫాంహౌస్‌లో 150 ఎకరాలు సాగు చేసి క్వింటా రూ.4,200 చొప్పున ధాన్యం అమ్ముకున్నారని తెలిపారు. రైతులు సన్నవడ్లు పండించడంతోనే పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయగలుగుతున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. ఏడాదిలో 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేయడంలో, సన్నాలు సాగు చేయడంలో దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. రైతుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా తనకు ఇంతకంటే సాధించే విజయం ఏమీ లేదని అన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకునే రోజుల నుంచి ఆత్మగౌరవంతో బతికే రోజులు తీసుకొచ్చామని తెలిపారు. రైతుల పిల్లలు ఉన్నత విద్యలు చదివి ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లుగా స్థిరపడితే దేశంలో ఎక్కడున్నా సొంత ప్రాంతానికి మేలు చేస్తారని రేవంత్‌రెడ్డి చెప్పారు.



రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల కరచాలనం

పాత బిల్లులకు మమ్మల్ని నిందిస్తున్నారు..

బిల్లులు రాలేదని మాజీ సర్పంచులు ఆందోళనలు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు చేసిన పనులకు, మంజూరు కాని బిల్లులకు ఇప్పుడు తమను నిందిస్తున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాంట్రాక్టర్ల బిల్లులు, ఉచిత విద్యుత్తు బకాయిలన్నీ కలిపి రూ.8.29 లక్షల కోట్లు అప్పు చేసి పోయారని తెలిపారు. ఆ అప్పులు మోయలేక తనకు నెత్తి నొస్తున్నదని, ఆర్థిక మంత్రి భట్టికి నడుము వంగిపోతున్నదని సీఎం అన్నారు. "అరే పిలగాడు కొత్తగా వచ్చిండు. కొంత సమయం ఇద్దామని లేదు. విద్యార్థులకు ప్రమాదం జరిగినా ఆనందమే. రైతులు చనిపోయినా, ప్రమాదాలు జరిగి జనం చనిపోయినా, ఆహారం విష పూరితమైనా, ఏం జరిగినా పైశాచిక ఆనందమే. ఇంతటి దుర్మార్గమైన ప్రతిపక్షాన్ని నేనెప్పుడూ చూడలేదు. చావుల పునాదులపై అధికారంలోకి రావాలనే దురాలోచన సరైంది కాదు" అని రేవంత్ ధ్వజమెత్తారు. "గతంలో భార్యాభర్తలు ఫోన్లో మాట్లాడుకున్నా వినేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. 4 కోట్ల ప్రజలకు సంపూర్ణ స్వేచ్ఛ ఉంది. సామాజిక న్యాయం పాటిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఒకేఒక్క దళితుడు మంత్రిగా ఉండేవారు. ఇప్పుడు నలుగురు మంత్రులతో పాటు శాసనసభ స్పీకర్ కూడా దళితుడే ఉన్నాడంటే కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని ఎలా పాటిస్తుందో అర్థం చేసుకోవచ్చు" అని సీఎం చెప్పారు. ఏడాదిలో 60 వేల ఉద్యోగాలిచ్చి వరసగా నోటిఫికేషన్లు జారీ చేస్తుంటే.. పోటీపరీక్షలు రాసే నిరుద్యోగులే ప్రభుత్వాన్ని కాస్త సమయం అడిగే పరిస్థితి తీసుకొచ్చామని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులకు రాయితీపై పనిముట్లను అందించేవని, బీఆర్ఎస్ వచ్చాక నిలిపివేసిందని చెప్పారు. రైతులకు మళ్లీ వ్యవసాయ పనిముట్లను రాయితీపై అందించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు. రైతులు పెట్టిన పెట్టుబడికి రెండింతల లాభం రావాలన్నదే తమ లక్ష్యమన్నారు. వ్యవసాయానికి సాంకేతిక పరిజ్ఞానం, ఏఐని అనుసంధానం చేయాలని చెప్పారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్తు ఖర్చు రూ.17 వేల కోట్లు అవుతోందని రేవంత్‌రెడ్డి అన్నారు. రైతులు సౌర పంపు సెట్లను వినియోగించాలని, సౌర విద్యుత్తుతో ఆదాయం కూడా వస్తుందని చెప్పారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సూచించారు. రైతులు ఇకపై అదానీ, అంబానీలతో పోటీపడాలని రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. సౌర పంపుసెట్ల వినియోగంపై అవగాహన ఉన్న రైతులను రైతువేదికలకు తీసుకెళ్లి ఇతర రైతులకు అవగాహన కల్పించాలని, అవసరమైతే వారికి రోజుకు రూ.1000 చొప్పున గౌరవ వేతనం ఇవ్వాలని, ఈ మేరకు జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సీఎస్ రామకృష్ణారావుకు సూచించారు.

ప్రజలే వారి పనిపట్టాలి!

పదేళ్ల రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించి, విధ్వంసం సృష్టించి బొందలగడ్డలా మార్చిన బీఆర్ఎస్ నేతలు టీవీల ముందు, జనం ముందు బలుపు మాటలు మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. "వాళ్లెన్ని తిట్లు తిట్టినా.. మాకు అవి ఆశీర్వాదాలే. వారి తిట్లను మేం పట్టించుకోవడం లేదు. నేను పనిచేస్తూ పోతుంటా. మీరు వాళ్ల పనిపట్టండి!" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎవరు అడ్డొచ్చినా, బట్టలు చింపుకున్నా, రోడ్డుమీద పడుకొని దొర్లినా.. పదేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

అన్ని వైద్యకళాశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు

- క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారుల కమిటీ
- నర్సింగ్ కాలేజీల్లో ఆప్షనల్‌గా జపాన్ భాష
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలలు మూడేళ్లలో పూర్తిస్థాయి వసతులతో పనిచేయాలని, దీనికి కార్యాచరణ ప్రణాళికను వెంటనే తయారుచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ప్రతి కళాశాలను సందర్శించి, అక్కడి అవసరాలపై నివేదిక సమర్పించాలని నిర్దేశించారు. సీఎం సోమవారం ఐసీసీసీలో వైద్యా రోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) రాష్ట్రంలోని వైద్య కళాశాలలకు సంబంధించి లేవనెత్తిన పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నియామకాలు, బోధన సిబ్బందికి పదోన్నతులు, ఖాళీల భర్తీ, అనుబంధ ఆస్పత్రుల్లో పడకల పెంపు తదితర అంశాలపై కూడా సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు వెంటనే విడుదల చేస్తామని తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి నిధులు, అనుమతులకు సంబంధించిన అంశాలు ఉంటే వెంటనే తెలియజేయాలని, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, ఆ శాఖ అధికారులను సంప్రదించి పరిష్కరిస్తామని చెప్పారు. నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ (జపాన్ భాష)ను ఒక ఆప్షనల్‌గా నేర్పించాలని, జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో మద్దతు ఇచ్చేందుకు జపాన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులు, వారిని పరీక్షించే వైద్యులు, ఆస్పత్రుల సమయాల పర్యవేక్షణకు ఒక యాప్‌ను వినియోగించే అంశంపై అధ్యయనం చేయాలని సూచించారు. విద్యా, వైద్య రంగాలు ఎంతో కీలకమని, ప్రతి నెలా మూడో వారంలో ఈ రెండు శాఖలపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర వైద్యా రోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వికటాట్టహాసం చేస్తున్న దయ్యాలను తరిమి కొట్టండి

- బీఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి పరోక్ష విసుర్లు

హైదరాబాద్, జూన్ 16, (ఆంధ్రజ్యోతి): ప్రజలకవసరమైన సహాయ సహకారాలందిస్తుంటే బీఆర్ఎస్ నేతలు తమ కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అలా నిప్పులు పోసుకుంటున్న నేతలే దయ్యాలని బీఆర్ఎస్ నేతలే చెప్పారన్నారు. ఆ దయ్యాలే వికటాట్టహాసం చేస్తున్నాయన్న భట్టి .. ఊర్లో దయ్యాలుంటే అరిష్టమని, ఆ దయ్యాలను ఊరి పొలిమేరల్లోకి రాకుండా తరిమి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వరుసగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే.. పుట్టగతులుండవని పదేళ్లు పాలించిన వారు ప్రజా ప్రభుత్వంపై బురద చల్లుతున్నారన్న విషయం ప్రజలు గుర్తించాలన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పదేళ్లు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి.. ఇప్పుడు ప్రజా ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలను చీల్చి చెండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి బీఆర్ఎస్ చేసిన అన్యాయాన్ని ప్రజలకు విడమరిచి చెప్పాలని కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు. రాష్ట్రాన్ని వినాశనం చేసిన వారికి రేవంత్ సర్కారును విమర్శించే హక్కు లేదని స్పష్టం చేశారు.

వ్యవసాయ పనిముట్లు కావాలి!

ముఖాముఖిలో ముఖ్యమంత్రికి రైతుల విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూలీల కొరత ఉందని.. సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, ఉద్యాన పంటల సాగు కోసం డ్రిప్ (సూక్ష్మ సేద్యం) యూనిట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు విజ్ఞప్తి చేశారు. సబ్సిడీ పథకాలను పునరుద్ధరించాలన్నారు. అలాగే నూనె గింజలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలు సాగు చేసేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలని కోరారు. సోమవారం జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీలో రైతులతో ముఖాముఖిలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్‌లో కొందరు, సభలో ప్రత్యక్షంగా కొందరు తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ.. కూరగాయలు, ద్రాక్ష తోటలు, వాణిజ్య పంటలు సాగు చేస్తే ప్రభుత్వం కచ్చితంగా సహకరిస్తుందన్నారు. రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సలహాలు, సూచనలిస్తుండటంతో ఎంతో మేలు జరుగుతోందని.. ఇప్పటివరకు 58 వారాలు, 58 ఎపిసోడ్లు నిర్వహిస్తే అన్నింటికి హాజరయ్యానని ఖమ్మం జిల్లాకు చెందిన ఓ రైతు చెప్పారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. 'ఖమ్మం జిల్లా వాళ్లు చాలా హుషారున్నరు. ఆర్థిక శాఖను మీరే తీసుక పోయిండ్లు. రెవెన్యూ శాఖను మీరే తీసుకెళ్లిండ్లు. వ్యవసాయశాఖను మీరే తీసుకెళ్లిండ్లు. కీలకమైన మూడు శాఖలు మీ జిల్లాకే ఇచ్చినం' అని అన్నారు. మహబూబాబాద్ జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులు మాట్లాడిన అనంతరం సీఎం మాట్లాడుతూ.. యువకులు కండలు పెంచుకోవటానికి జిమ్‌కు వెళ్తున్నారని, జొన్నరొట్టె తిని ఎవరి బట్టలు వాళ్లు ఉతుక్కుంటే సిక్స్ ప్యాక్ బాడీ తయారవుతుందని వ్యాఖ్యానించారు. కొడంగల్, అచ్చంపేటలో పండించే కందిపప్పు, దోసకాయ వండుకొని తింటే చికెన్, మటన్ కంటే మజా వస్తుందని చెప్పారు.

ఇష్టమొచ్చినట్లు మాట్లాడొద్దు

మనం మాట్లాడుకునేవి వేదికలపై చెబితే ఎలా?.. విధాన పరమైన నిర్ణయాలకు ముందే ప్రకటనలా?

- సమష్టిగా నిర్ణయాలు తీసుకుందాం.. కలిసి నడుద్దాం
- మంత్రులతో భేటీలో సీఎం రేవంత్
- 23న క్యాబినెట్!.. పలు కీలక నిర్ణయాలకు చాన్స్



హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): "సమావేశాలు, వేదికలపై మంత్రులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు. మనం సాధారణంగా మాట్లాడుకున్న అంశాల్లో కొన్నింటిపై విధానపరమైన నిర్ణయాలు తీసుకోకముందే వేదికలపై చెబితే ఎలా" అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మంత్రులతో అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని సమీకృత పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)లో మంత్రులతో.. సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ పలు అంశాలపై మాట్లాడుతూ.. మంత్రులను సున్నితంగా హెచ్చరించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల అంశం, రైతు భరోసా విషయంపై ఒకరిద్దరు మంత్రులు జిల్లాల పర్యటనలు, సమావేశాల్లో ప్రకటనలు చేశారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ వస్తుందంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన నియోజకవర్గ పర్యటనలో ద్వితీయ శ్రేణి నాయకత్వంతో అన్నారు. ఆ వ్యాఖ్యలు పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతోపాటు.. స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియరైందంటూ క్షేత్రస్థాయిలో చర్చ జరిగింది. మంత్రుల సమావేశంలో సీఎం ఈ విషయంపైనే కొద్దిసేపు మాట్లాడినట్లు తెలిసింది. ఆ క్రమంలోనే ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, పథకాలు, ప్రకటనలు సహా పలు అంశాలపై మంత్రులెవరూ 'ఇష్టం వచ్చినట్లు' మాట్లాడకూడదని, అదే సమయంలో బహిరంగ వేదికలపైనా ప్రకటనలు చేయొద్దని సూచించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. విధానపరమైన అంశాలపై ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు మాత్రమే వాటిని ప్రకటించాలని దిశానిర్దేశం చేశారు. ఇకపై నిర్ణయాలు, ప్రకటనల విషయంలో ఎవరికివారుగా కాకుండా.. కలిసికట్టుగా మాట్లాడాలని సూచించారు. సమష్టిగా ఉంటూ.. కలిసి నిర్ణయాలు తీసుకుని.. వాటినే అందరం కలిసి ప్రకటిద్దామని చెప్పారు. దీంతోపాటు.. బీఆర్ఎస్, బీజేపీ రాజకీయంగా చేస్తున్న విమర్శలు, ఫార్ములా ఈ-కారు రేసు, కాళేశ్వరం విచారణ కమిషన్ వ్యవహారాలపైనా సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిసింది. అయితే.. బీఆర్ఎస్, బీజేపీ గురించి ఏమాత్రం పట్టించుకోవాల్సిన అవసరంలేదన్న సీఎం.. "మన పని మనం చేసుకుంటూ వెళ్దాం" అని అన్నట్లు సమాచారం. ఇచ్చిన హామీలు, పథకాల అమలు ఎలా ఉందనే దానిపైనే దృష్టిసారించి, ముందుకెళ్లాలని మంత్రులకు సీఎం సూచించారు. స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకున్నాకే సమష్టిగా ప్రకటన చేద్దామంటూ సూచించినట్లు తెలిసింది.

భరోసాకు.. ఎన్నికలకు సంబంధం లేదు

సమావేశంలో స్థానిక ఎన్నికల అంశం కూడా చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల కోసమే రైతుభరోసా నిధులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందంటూ రాజకీయ వర్గాలు విమర్శిస్తున్నాయన్న విషయాన్ని మంత్రులు.. సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం మాట్లాడుతూ.. రైతుభరోసా అమలు, రైతుల సంఖ్య, నిధుల వ్యవహారం గురించి మంత్రులతో చర్చించారు. రైతుభరోసా కింద అందించే నిధులను నాట్లు వేసుకునే సమయానికే అందించాలని మొదటినుంచి అనుకుంటున్నదేనని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు, భరోసా నిధుల జమకు ఎలాంటి సంబంధంలేదని తేల్చిచెప్పారు. గతంలో ఎన్నడూ రైతులకు 9 రోజుల్లోనే నిధులు జమచేసిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే మొదటిసారిగా వానాకాలం రైతుభరోసా కింద దాదాపు రూ.9వేల కోట్లను 9 రోజుల్లోనే అందించేలా కార్యచరణ తీసుకుందని గుర్తుచేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై క్షేత్రస్థాయి వివరాలను మంత్రులను అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీపై రైతుల అభిప్రాయం ఏమిటని అడిగారు. దీనిపై మంత్రులు ప్రాంతాలవారీగా ఉన్న అభిప్రాయాలను సీఎంకు వివరించారు.

కలిసికట్టుగా.. 'రైతునేస్తం'కు..

ఇకపై అందరం కలిసికట్టుగా ఉంటూ, సమష్టి నిర్ణయాలు తీసుకుంటూ.. ముందుకువెళ్లాలని సీఎం సూచించగా ఆ నిర్ణయం వెంటనే అమల్లోకి వచ్చింది. ఇందుకు రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమం వేదికైంది. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రుల సమావేశం నుంచి సీఎం, మంత్రులంతా కలిసికట్టుగా ఆ కార్యక్రమానికి వెళ్లారు.

23న క్యాబినెట్..!

రాష్ట్ర మంత్రివర్గ మండలి సమావేశాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నట్లు తెలిసింది. అందులో స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించనున్నారని సమాచారం. అలాగే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలకు మొదట ఏ ఎన్నికలు నిర్వహించాలనేదానిపై ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. అదేవిధంగా ఇప్పటికే స్థానిక సంస్థల్లో, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల్లో రెండు వేర్వేరు బిల్లులను ప్రవేశ పెట్టింది. ఆ బిల్లుల ఆమోదం కోసం వాటిని పార్లమెంటుకు పంపింది. వాటిపై కేంద్రం నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. కేంద్రం ఎటూ తేల్చకపోతే.. పార్టీ పరంగా రిజర్వేషన్లను అమలుచేయాలని ఇప్పటికే కాంగ్రెస్ నిర్ణయించింది. దీంతో ఈ అంశంపై క్యాబినెట్‌లో తుది నిర్ణయం తీసుకుంటారు. ఇదే భేటీలో రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) దక్షిణభాగం అలైన్‌మెంట్‌కు ఆమోదం తెలపనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ మార్గం అలైన్‌మెంట్‌కు సంబంధించిన సమగ్ర నివేదిక సిద్ధమైంది. నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'రాజీవ్ యువ వికాసం' పథకానికి 16.23 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఈ పథకాన్ని జూన్ 2 నుంచే అమలుచేయాలని భావించినా.. పలు కారణాలతో ముందుకు సాగలేదు. దీంతో ఈ పథకం అమలుపైనా చర్చించి, ఒక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని అధికారవర్గాల ద్వారా తెలిసింది.

రెండెకరాల వరకు రైతు భరోసా విడుదల

- ఒకేరోజు రూ.2,350 కోట్ల నగదు బదిలీ
- 41.25 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ
- కొత్త రైతుల నమోదుకు 20 వరకు గడువు

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వానాకాలం రైతు భరోసా నగదు బదిలీకి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం శ్రీకారం చుట్టింది. ఒకే రోజు రెండెకరాల వరకు ఉన్న రైతులకు నిధులు విడుదల చేశారు. ఎకరాకు రూ.6 వేల చొప్పున.. తొలుత ఎకరా వరకు ఉన్న రైతులకు.. ఆ తర్వాత రెండు ఎకరాల వరకు ఉన్న రైతుల ఖాతాలకు నగదు జమ చేశారు. మొత్తం రెండెకరాల లోపున్న 41.25 లక్షల మంది రైతులకు సంబంధించిన 39.16 లక్షల ఎకరాలకు రూ.2,349.84 కోట్ల రూపాయలను బదిలీ చేశారు. మంగళవారం మూడెకరాల వరకు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా వేయనున్నారు. మొత్తం ప్రక్రియను కేవలం వారం రోజుల వ్యవధిలోనే పూర్తి చేయటానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. గతంలో బీఆర్ఎస్ హయాంలో రైతు బంధు వేయటానికి ఎకరానికి ఒక రోజు చొప్పున.. పది రోజుల నుంచి పక్షం రోజుల వరకు నగదు బదిలీ చేసిన సందర్భాలున్నట్లు రాష్ట్ర మంత్రివర్గంలో చర్చకు వచ్చింది. ఈక్రమంలో నిధులు సమకూర్చుకొని కేవలం వారం రోజుల్లోపు ప్రక్రియ పూర్తి చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఈమేరకు నిధుల సమీకరణ చేపట్టారు. ఇటీవల రిజర్వు బ్యాంకు నుంచి రూ.3 వేల కోట్లను ప్రభుత్వం అప్పు తీసుకుంది. తర్వాత మరో రూ.4 వేల కోట్లకు ఇండెంట్ పెట్టింది. ఎకరానికి రూ.6 వేల చొప్పున పంపిణీ చేయటానికి... కోటిన్నర ఎకరాలకు రూ.9 వేల కోట్లు అవసరమవుతున్నాయి. ఇప్పటికే రూ.7 వేల కోట్లను ప్రభుత్వం సర్దుబాటు చేసుకుంది. మరో రూ. 2 వేల కోట్లను కూడా జమ చేసి వారం రోజుల్లోపే.. రైతుభరోసా నగదు బదిలీని పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది. మరోవైపు.. క్రయవిక్రయాలు, మ్యుటేషన్‌తో యాజమాన్య హక్కులు పొందిన కొత్త రైతులను రైతు భరోసా పథకంలో చేర్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల ఐదో తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతులను చేర్చాలని, ఈ నెల 20వతేదీ లోపు నమోదు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టరేట్ నుంచి ఆదేశాలు జారీ చేశారు.

ఒకే వేదికపై రాష్ట్ర మంత్రివర్గం..

రైతుభరోసా పథకం అమలును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం... సోమవారం నగదు బదిలీ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించింది. సాధారణంగా ఒక పథకాన్ని ప్రారంభిస్తే.. ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి, కొందరు మంత్రులు హాజరవుతుంటారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించినప్పుడు మాత్రమే వందకు వంద శాతం మంత్రులు హాజరయ్యే సందర్భాలు చూస్తుంటాం.. కానీ రాజేంద్రనగర్‌లోని.. రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవం, రైతులతో ముఖాముఖి, రైతు భరోసా నగదు బదిలీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా రాష్ట్ర మంత్రివర్గమంతా ఒకే వేదికపై కొలువుదీరింది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేసిన లబ్ధిని, చేయబోయే ప్రయోజనాలను, సంక్షేమ పథకాలను కార్యక్రమంలో వివరించింది.


సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపడుతున్న ప్రియాంక

సమాచారశాఖ స్పెషల్ కమిషనర్‌గా ప్రియాంక

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్‌గా సీహెచ్ ప్రియాంక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు స్పెషల్ కమిషనర్‌గా పనిచేసిన హరీశ్ తెలంగాణ జెన్కో ఎండీగా బదిలీపై వెళ్లారు. దీంతో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీగా వ్యవహరించిన ప్రియాంక ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ సెక్రటరీతో పాటు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ప్రియాంకకు సమాచార శాఖ, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మీడియా అకాడమీ అధికారులు అభినందనలు తెలిపారు. అలాగే జెన్కో ఎండీగా వెళ్లిన హరీశ్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ప్రియాంక సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏసీబీకి పట్టుబడ్డ ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు

- ఉపాధ్యాయుడిని లంచం అడిగిన ములుగు డీఈఓ, సీసీ
- ఇంటి నంబర్ జారీకి డబ్బులివ్వాల్సిందేనన్న గ్రామ కార్యదర్శి

ములుగు/ మునిపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ములుగు, సంగారెడ్డి జిల్లాల పరిధిలో లంచం అడిగిన ఒక అధికారి, ఇద్దరు ఉద్యోగులు ఏసీబీ అధికారులకు చిక్కారు. గత ఏడాది జూన్‌లో ప్రమాదానికి గురైన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పూర్తిగా నయమైన తర్వాత గత అక్టోబరులో విధులకు హాజరయ్యేందుకు వచ్చాడు. అందుకు అవసరమైన ఆదేశాలు జారీ చేయడానికి డీఈవో పాణి రూ.20 వేలు లంచం డిమాండ్ చేయడంతో సదరు ఉపాధ్యాయుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు డీఈఓ పాణికి రూ.15వేలు, డీఈవో సీసీ వేణుకు రూ.5,000 సదరు టీచర్ ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా, సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల వాసి ఒకరు.. మునిపల్లి మండలం బుదేరా గ్రామ చౌరస్తాలో వాటర్ సర్వీసింగ్ సెంటర్ కోసం షెడ్డు, ఓపెన్ ప్లాట్‌కు ఇంటి నంబర్ కోసం పంచాయతీ కార్యదర్శి పటోళ్ల నాగలక్ష్మిని సంప్రదించగా.. రూ.12 వేలు లంచమడిగినా రూ.8,000లకు ఒప్పందం కుదిరింది. సోమవారం నాగలక్ష్మికి రూ.8,000 నగదు అందజేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ మెదక్ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు.

ఏపీ సీఎం హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం

- అదే చాపర్ కేంద్ర మంత్రి పర్యటనకు కేటాయింపు
- సాంకేతిక సమస్యలపై సమగ్ర నివేదిక కోరిన డీజీపీ

అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అది ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలకు ఉపయోగించే హెలికాప్టర్. సీఎం చంద్రబాబు దీన్ని తరచూ వాడుతుంటారు. సోమవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు కూడా అధికారులు ఈ హెలికాప్టర్‌నే కేటాయించారు. తిరుపతి నుంచి కృష్ణపట్నం పోర్టుకు వెళ్లేందుకు దీన్ని అందుబాటులో ఉంచారు. మంత్రి పీయూష్ గోయల్ హెలికాప్టర్ ఎక్కాక దీనిలో సాంకేతిక లోపాన్ని గుర్తించిన సిబ్బంది ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన కృష్ణపట్నం పోర్టు పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో హెలికాప్టర్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్న అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డాను ఆదేశించారు. వీఐపీలు ప్రయాణించే హెలికాప్టర్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడంపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు.


వైద్య బృందంతో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

ప్రభుత్వాస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న కలెక్టర్

- అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్

సుభాష్‌నగర్ (కరీంనగర్), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వాసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని ఆదర్శంగా నిలిచారు. కొన్నేళ్లుగా సైనసైటీస్‌తో ఇబ్బంది పడుతున్న ఆమె ఇటీవల జిల్లా జనరల్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించారు. వారు పరీక్షల అనంతరం శస్త్ర చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ రవికాంత్ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కలెక్టర్‌ను ప్రశంసించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఆధునిక సదుపాయాలతో పాటు అనుభవమున్న వైద్యసిబ్బంది ఉన్నారని, శస్త్రచికిత్స చేయించుకుని ప్రజల్లో ప్రభుత్వాసుపత్రులపై నమ్మకాన్ని పెంచారని సీఎం రేవంత్ 'ఎక్స్' వేదికగా అభినందించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రస్తుతం కలెక్టర్ ఆరోగ్యంగా ఉన్నారని, త్వరలోనే డిశ్చార్జి చేస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు.

సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

- బ్రేక్ బైండింగ్‌తో మంటలు.. చైన్ లాగిన ప్రయాణికులు

ధర్మవరం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్‌కు (నంబర్ 12769) బ్రేక్ బైండింగ్ కావడంతో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు అప్రమత్తమై చైన్ లాగడంతో ప్రమాదం తప్పింది. సోమవారం రాత్రి 8.40 గంటల సమయంలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచెర్ల వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. గార్డు ఉన్న బోగీ ముందుభాగం చక్రాల వద్ద బ్రేకు బైండింగ్ అయి మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన గార్డు ట్రైన్‌ను ఆపేందుకు బీటీసీ బ్రేకు వేశారు. ప్రయాణికులు కూడా చైన్ లాగారు. రైలు ఆగగానే ప్రయాణికులు కిందకు దూకారు. చీకట్లో కంకర రాళ్లల్లో కేకలు వేస్తూ పరుగులు తీశారు. వెంటనే గార్డు మంటలను అగ్నిమాపక పరికరాలతో ఆర్పివేశారు. ఈ ఘటనతో సుమారు అరగంట పాటు రైలు ఆగిపోయింది.

ఇంటర్ సప్లమెంటరీలో 51% ఉత్తీర్ణత

గతేడాదితో పోలిస్తే 7% అధికం .. బాలుర కంటే బాలికలదే పైచేయి

- ఫలితాలు ప్రకటించిన విద్యాశాఖ కార్యదర్శి
- రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు 23వరకు గడువు
- ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య


సప్లమెంటరీ ఫలితాలు విడుదల చేస్తున్న యోగితారాణా, కృష్ణ ఆదిత్య, జయప్రద బాయి

హైదరాబాద్/ నస్పూర్/ జహీరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల్లో 51% మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. గత నెల 22-29 తేదీల మధ్య జరిగిన ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు మొత్తం 4,13,880 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో 2,49,358 మంది హాజరు కాగా, 1,68,079 (67.4%) మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం ఇంటర్‌లో 1,35,107 మంది హాజరవ్వగా 68,665 (50.82%) మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా, ఇంటర్ సెకండియర్ సప్లమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో రాష్ట్రంలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాగా, గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం ఇంటర్‌లో ఏడు శాతం ఎక్కువ ఉత్తీర్ణత నమోదు కాగా, 2023-24 విద్యా సంవత్సరంలో 43.77% మంది ఉత్తీర్ణులవ్వగా.. బాలురిపై బాలికలు ఆధిక్యత ప్రదర్శించారు. ప్రథమ సంవత్సరంలో 61.75శాతం మంది బాలురు, 73.88 శాతం మంది బాలికలు.. ద్వితీయ సంవత్సరంలో 48.54 శాతం మంది అబ్బాయిలు, 54.47 శాతం మంది అమ్మాయిలు ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరీక్షల నియంత్రణాధికారి జయప్రద బాయి సోమవారం ఇంటర్ సప్లమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల చేశారు. విద్యార్థులు తమ జవాబు పత్రాల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 17 నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని కృష్ణ ఆదిత్య తెలిపారు. ఒక్కో పేపర్ రీ కౌంటింగ్ కోసం రూ.100, దిద్దిన జవాబు పత్రాల రీవెరిఫికేషన్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.600 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. సప్లమెంటరీ పరీక్షా ఫలితాల్లో భూపాలపల్లి, ములుగు జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. భూపాలపల్లిలో ప్రథమ సంవత్సరం 83.45%, ద్వితీయ సంవత్సరం 88.64%, ములుగులో ప్రథమ సంవత్సరం 82.2%, ద్వితీయ సంవత్సరం 84.23 శాతం ఉత్తీర్ణత నమోదైంది. చివరి స్థానంలో నిలిచిన వికారాబాద్ జిల్లాలో ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో 55.62%, ద్వితీయ సంవత్సరంలో కేవలం 33.54% మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

గ్రూప్	ఇంటర్-1 మొత్తం	ఉత్తీర్ణత (శాతం)	ఇంటర్-2 మొత్తం	ఉత్తీర్ణత (శాతం)
ఎంపిసి	134326	105123 (78.26)	59684	35248 (59.06)
ఎంఈసీ	7768	4458 (57.39)	5978	2966 (49.62)
బైపిసి	53266	37923 (71.2)	23175	12527 (54.05)
సీఈసీ	49156	18543 (37.72)	42696	16232 (38.02)
హెచ్ఈసీ	4762	1984 (41.66)	3479	1662 (47.77)
ఇతర	80	48 (60)	95	30 (31.58)
మొత్తం	249358	168079 (67.4)	135107	68665 (50.82)

సెకండియర్ ఫెయిలయ్యామని మనస్తాపంతో..

సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయామని మనస్తాపంతో ఇద్దరు విద్యార్థులు బలవన్మరణం పాలయ్యారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణం జయశంకర్ కాలనీ వాసి కొటోజి అక్షయ (16).. స్థానిక కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో గణితం-2 పరీక్ష ఫెయిలైంది. దీంతో సప్లమెంటరీ రాసినా పాస్ కాలేదని మనస్తాపంతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పరీక్షా ఫలితాలు తెలుసుకోవడానికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో తల్లి ప్రవీణ ఇంటికొచ్చి చూసే సరికి అక్షయ ఉరేసుకుందని, స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించినా అప్పటికే మరణించిందని వైద్యులు చెప్పారని నస్పూర్ ఎస్ఐ ఉపేందర్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం మహబత్ పూర్ గ్రామ వాసి రాయిపల్లి వెంకటరమణ (19).. సెకండియర్ సంస్కృతం, ఫిజిక్స్ సప్లమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై, జహీరాబాద్‌లోని తమ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పట్టణ ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపారు.

నేటి నుంచి ఈసెట్ కౌన్సెలింగ్..!

- ధ్రువపత్రాల పరిశీలనకు 8,647 మంది స్లాట్ బుకింగ్

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఈసెట్)-2025లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు మంగళవారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం 8,647 మంది అభ్యర్థులు స్లాట్‌లు బుక్ చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 20 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆరు హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన తెలిపారు. హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలన అనంతరం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మెరుగైన కళాశాలల్లో సీట్లు పొందేందుకు అభ్యర్థులు వెబ్ కౌన్సెలింగ్‌లో వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఎంచుకోవాలని సూచించారు. వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 21న ముగియనుండగా, 25లోగా తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుందని వెల్లడించారు. మరిన్ని వివరాలకు టీజీఈసెట్.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నీట్ యూజీ సీట్ల కేటాయింపుపై బుక్‌లెట్ విడుదల

హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యా కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ (యూజీ)-2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థుల అవగాహన కోసం గత సంవత్సరం (నీట్-2024)లో సీట్ల కేటాయింపుపై రూపొందించిన డిజిటల్ బుక్‌లెట్‌ను సిద్ధం చేసినట్లు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. ఈ బుక్‌లెట్ ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్‌లలో మూడు రౌండ్ల ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో ర్యాంకుల వారీగా, రిజర్వేషన్ల వారీగా సీట్ల కేటాయింపు, ఓపెనింగ్, క్లోజింగ్ ర్యాంకుల వివరాలను పొందుపరిచామని చెప్పారు. ఈ డిజిటల్ బుక్‌లెట్‌ను పొందాలనుకునే వారు మరింత సమాచారం కోసం వాట్సాప్ నంబర్ 98490 16661కు సంప్రదించాలని ఫోరం తెలిపింది.



ఖాజాగూడలో ప్రభుత్వ భూమి కబ్జాపై.. నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పిల్

(మొదటిపేజీ తరువాయి)

దాఖలు చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామ పరిధిలోని పాత సర్వే నెంబర్లు 119, 122, కొత్త సర్వే నెంబరు 27లోని 27.18 ఎకరాల ప్రభుత్వ భూమిలో బెవర్లీ హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బండి బిందు నుంచి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (డీఏజీపీఏ) పొందిన బీ సుబ్బారెడ్డి 47 అంతస్తుల చొప్పున 8 భారీ టవర్లు నిర్మిస్తున్నారని పిటిషనర్లు పేర్కొన్నారు. 150 మీటర్ల దూరంలో ఓక్రిడ్జ్ స్కూల్ ఉన్న విషయాన్ని పట్టించుకోకుండా రెడ్‌మిక్స్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల పర్యావరణ కాలుష్యం తీవ్రంగా ఉందన్నారు. ఈ భూమికి సంబంధించిన పాత సర్వే నెంబర్లను సవరించి కొత్తగా సర్వే నెంబర్లు కేటాయిస్తూ 1995లో జిల్లా రెవెన్యూ అధికారి ఇచ్చిన ఆదేశాలను కొట్టేయాలని కోరారు. సదరు ఉత్తర్వులకు అనుగుణంగా రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ, జిల్లా కలెక్టర్, తహసీల్దార్ సదరు ప్రభుత్వ భూమిని ప్రతివాదులకు బదిలీ చేయడం చెల్లదని ప్రకటించాలన్నారు. కలెక్టర్ ఎన్‌వోసీ ఇవ్వడంతో జీహెచ్ఎంసీ భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేసిందని, రెవెన్యూ, మునిసిపల్, జీహెచ్ఎంసీ చట్టాలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ అక్రమాలను అడ్డుకోవాలని కోరారు. ఈ పిటిషన్ సోమవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదిస్తూ తన భూములను తాను రక్షించుకోవడం ప్రభుత్వ బాధ్యత అని, సుప్రీంకోర్టు కోర్టు గతంలో పలు ఇతర కేసుల్లో ఇచ్చిన తీర్పులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. ఈ భూమి విలువ రూ.10 వేల కోట్లు ఉంటుందన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రతివాదులతో కుమ్మక్కై భూకబ్జా చేశారని తీవ్ర ఆరోపణ చేశారు. ఈ మేరకు హైడ్రాకు ఫిర్యాదు చేశామని, అయినా లాభం లేదని తెలిపారు. పిటిషనర్లకు ఈ భూమి విషయంలో ఎలాంటి ఆసక్తి లేదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం... పిటిషనర్లు హైడ్రాకు ఇచ్చిన ఫిర్యాదులో కబ్జాకు గురైన భూమి ఎక్కడ ఉందో తెలిపే సర్వే నెంబర్లు లేవని పేర్కొంది. కబ్జాకు గురైన భూమి లొకేషన్, సర్వే నెంబరు తదితర పూర్తిస్థాయి వివరాలతో తాజాగా రిప్రజెంటేషన్ ఇవ్వాలని, దానిపై ప్రభుత్వం నిర్ణయిస్తుందని పిటిషనర్లకు సూచించింది. తాజా విజ్ఞప్తి ప్రతిని తమకు కూడా సమర్పించాలని పేర్కొంటూ విచారణను రెండు వారాల పాటు వాయిదా వేసింది.

రాజాసింగ్‌లా

సీనియర్ నాయకుడిని కాదు

(మొదటిపేజీ తరువాయి)

విలేకరులు అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి స్పందించారు. రాజాసింగ్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధి మాట్లాడినప్పుడు తప్పకుండా వింటాం. వారి మాటలను గౌరవించి చర్చిస్తాం. వారంతా పార్టీ కోసం త్యాగాలు చేసిన వాళ్లు. మేమంతా సాధారణ కార్యకర్తలం" అని అన్నారు.

బనకచర్లపై రేవంత్ చొరవ చూపాలి

బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రజల హక్కులు కాపాడేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర జలవనరుల శాఖ మంత్రికి సీఎం లేఖ రాయాలని కోరారు. కేంద్ర జలశక్తి మంత్రితో కలిసి ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. వివాద పరిష్కారం కోసం రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జరగాలని, ఇదే తమ వైఖరి అని తెలిపారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం ఇప్పటి వరకు ఏమీ చేయలేదు. ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)పై అధ్యయనం చేయాల్సి ఉంది. డీపీఆర్ ఇంకా కేంద్రం వద్దకు రాలేదు. గోదావరి బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే కేంద్ర జలసంఘం సమగ్ర పరిశీలన జరపాలన్న నిబంధన ఉంది. సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చిన


గాంధీ ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

తర్వాత కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది. మన తరఫున రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపించాలి. సీఎం రేవంత్ కేంద్ర జలశక్తి మంత్రికి లేఖ రాయాలని గతంలోనే కోరాను. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన దోపిడీపై సీబీఐ విచారణ జరపాలని మేం మొదటి నుంచీ కోరుతున్నాం. ప్రతిదానికీ బీజేపీని విమర్శించడం కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అలవాటైపోయింది. కాంగ్రెస్ హైకమాండ్, కేసీఆర్ కుటుంబం చేసుకున్న ఒప్పందంలో భాగంగానే ఇరుపార్టీలు ఉత్తుత్తి ఫైటింగ్ చేస్తున్నాయి"అని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో జనగణన ఉంటుందని, దాని కోసం యాప్ రూపొందిస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీకి అనుగుణంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై తాము హైకోర్టును ఆశ్రయించామని, తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

గాంధీ ఆస్పత్రి సందర్శన

గాంధీ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసి, సౌకర్యాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆస్పత్రిని సందర్శించిన ఆయన వివిధ విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణంలోని భవనాల నిర్వహణను పరిశీలించారు. మురుగునీటి వ్యవస్థ మెరుగుపరచాలని సూచించారు. ఔట్‌సోర్సింగ్ సంస్థతో మాట్లాడి ఆర్ఎంవోలు, సెక్యూరిటీ గార్డులు, పారిశుధ్య కార్మికులకు టైమ్‌కు జీతాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆస్పత్రిలోని మదర్ చైల్డ్ ఆస్పత్రి(ఎంసీహెచ్) భవనం, ఓపీ భవనంలో నీళ్లకు ఇబ్బంది అవుతోందని, సీటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాలు పనిచేయకపోవడంతో అవస్థ పడుతున్నామని రోగులు కిషన్‌రెడ్డికి తెలిపారు. వైద్యులు అందుబాటులో ఉండటం లేదని కొంత మంది చెప్పారు. కొవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించాలని ప్రధాని మోదీ ఆదేశించారని కిషన్‌రెడ్డి తెలిపారు.

బనకచర్లకు పర్యావరణ అనుమతి ఇవ్వొద్దు

- పోలవరం విస్తరణ గోదావరి ట్రైబ్యునల్ తీర్పునకు విరుద్ధం
- కేంద్రానికి మంత్రి ఉత్తమ్ లేఖ



హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధానం కోసం చేపట్టిన ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితుల్లో పర్యావరణ అనుమతి ఇవ్వరాదని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని తెలంగాణ కోరింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు సోమవారం లేఖ రాశారు. మంగళవారం గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతికి అవసరమైన విధి విధానాల(టీవోఆర్)పై చర్చించేందుకు కేంద్ర అటవీ పర్యావరణ శాఖ నిపుణుల కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశం అజెండాలో పోలవరం-బనకచర్ల (గోదావరి-బనకచర్ల అనుసంధానం) ప్రాజెక్టు ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. 200 టీఎంసీల సామర్థ్యంతో ఏపీ చేపట్టదలిచిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు గోదావరి ట్రైబ్యునల్-1980 తీర్పునకు విరుద్ధమని, ఈ ప్రాజెక్టు చేపట్టే అధికారం ఏపీకి లేదని ఉత్తమ్ తన లేఖలో పేర్కొన్నారు. గోదావరి నదిపై తెలంగాణ హక్కులను కాలరాసేలా ఉన్న ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలించడానికి కూడా వీల్లేదని గతంలో తాము లేఖలు రాయగా.. బచావత్ ట్రైబ్యునల్ తీర్పుకు అనుగుణంగానే వ్యవహరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని ఉత్తమ్ తెలిపారు. వరద నీటి పేరుతో గోదావరి జలాలను అక్రమంగా తరలించడానికి నిర్ణయం తీసుకున్నారని, వరద జలాలపై ఏపీకి హక్కులు లేవని పేర్కొన్నారు. గోదావరిలోనే కాకుండా కృష్ణాలోనూ ట్రైబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఏపీ నిర్ణయాలు ఉంటున్నాయన్నారు. పోలవరంతో ముడిపడిన పర్యావరణ అంశాలను ప్రభావిత రాష్ట్రాలతో సమావేశమై పరిష్కరించాలని 2022 సెప్టెంబరు 6న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. నాలుగుసార్లు సమావేశాలు జరిగినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో కొత్తగా పోలవరం విస్తరణకు అనుమతిపై నిపుణుల మదింపు కమిటీ సమావేశం జరగడం అభ్యంతరకరమ'ని స్పష్టం చేశారు. కాగా, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా కూడా కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శికి మరో లేఖ రాశారు.

అజ్ఞానంతోనే హరీశ్ వ్యాఖ్యలు: ఉత్తమ్

గోదావరి-బనకచర్ల అనుసంధానంపై హరీశ్‌రావు వ్యాఖ్యలు, లేఖలు ఆయన అజ్ఞానానికి తార్కాణమని ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈనెల 15న హరీశ్ తనకు రాసిన లేఖపై మంత్రి స్పందించారు. నదీ జలాలపై తెలంగాణ న్యాయమైన హక్కును, ప్రయోజనాలను దెబ్బతీసేలా హరీశ్ వ్యవహారశైలి ఉందని మండిపడ్డారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.